

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



బుధవారం | 19-11-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 214 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: చతుర్దశి ఉ.9.44 తదుపరి అమావాస్య, నక్షత్రం: స్వాతి ఉ.7.59 తదుపరి విశాఖ, వర్జ్యం: మ.2.17-4.05, దుర్ముహూర్తం: ఉ.11.38-12.22, అమృతఘడియలు: రా.1.05-2.53, రాహుకాలం: మ.12.00-1.30, సూర్యోదయం: 6.26, సూర్యాస్తమయం: 5.34 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బిజినెస్



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,23,660 ▼	1,13,350 ▼	1,70,000 ▼
విజయవాడ	1,27,000 ▼	1,19,000 ▼	1,60,000 ▲
విశాఖపట్నం	1,25,440 ▼	1,14,950 ▲	1,70,000 ▼
రాజమండ్రి	1,23,650 ▼	1,13,350 ▼	1,55,000 ▼
ప్రొద్దుటూరు	1,23,400 ▼	1,13,530 ▼	1,55,800 ▼
ముంబై	1,22,180 ▼	1,11,917 ▼	1,53,706 ▼

2030 నాటికి జీసీసీల్లో కొత్తగా 13 లక్షల ఉద్యోగాలు

మొత్తం ఉద్యోగులు 34.6 లక్షలకు చేరే చాన్స్ ● ఎన్ఎల్‌బీ సర్వీసెస్ నివేదిక వెల్లడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఐటీ, టెక్నాలజీ రంగాల్లో ఉద్యోగాలు మందగిస్తున్నాయి. కొన్ని ఐటీ కంపెనీలైతే పునర్ వ్యవస్థీకరణ లేదా నైపుణ్యాల లేమి పేరుతో ఉద్యోగులపై వేటు వేస్తున్నాయి. అయితే అంతర్జాతీయ కంపెనీలు మన దేశంలో ఏర్పాటు చేస్తున్న గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ) మాత్రం పెద్దఎత్తున ఉద్యోగుల నియామకాలు చేస్తున్నాయి. ఏఐ ప్రభావం ఉన్నా జీసీసీల్లో కొలువుల నియామకాలు జోరుగా సాగుతున్నాయి. వచ్చే ఏడాదికల్లా దేశంలోని జీసీసీల్లో పని చేసే ఉద్యోగుల సంఖ్య 11 శాతం పెరిగి 24 లక్షలకు, 2030 నాటికి 30 శాతం పెరిగి 34.6 లక్షలకు చేరుకుంటుందని గ్లోబల్ టెక్నాలజీ, డిజిటల్ టాలెంట్ సొల్యూషన్స్ సంస్థ ఎన్ఎల్‌బీ సర్వీసెస్ ఒక నివేదికలో తెలిపింది. ప్రస్తుతం జీసీసీలో పనిచేస్తున్న 21.6 లక్షల ఉద్యోగులతో పోలిస్తే 2030 నాటికి మన దేశంలోని జీసీసీల్లో పనిచేసే ఉద్యోగుల



సంఖ్య 13 లక్షలు పెరుగుతుందని అంచనా వేసింది.

చిన్న నగరాల్లోనూ జీసీసీలు: నిన్న మొన్నటి వరకు మెట్రో నగరాలపైనే ఆసక్తి చూపిన జీసీసీలు ఇప్పుడు దేశంలోని అహ్మదాబాద్, కోయంబత్తూర్, భువనేశ్వర్ వంటి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలపైనా ఆసక్తి చూపిస్తున్నాయి. ఈ నగరాల్లో జీసీసీలు ఏర్పాటు చేస్తే ఉద్యోగాలు మారే ఉద్యోగులు మెట్రో నగరాల్లోని జీసీసీలతో పోలిస్తే 10-12 శాతం మాత్రమే ఉండడం, ఆఫీస్ నిర్వహణ ఖర్చులు 30 నుంచి 50 శాతం తక్కువగా ఉండడం, 20 నుంచి 35 శాతం తక్కువ జీతాలకే నిపుణులైన ఉద్యోగులు దొరకడం ఇందుకు కలిసి వస్తోందని ఎన్ఎల్‌బీ సర్వీసెస్ తెలిపింది. 2030 నాటికి దేశంలోని జీసీసీల్లో పనిచేసే ఉద్యోగుల్లో 39 శాతం మంది ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని జీసీసీల్లోనే పనిచేస్తారని కూడా ఈ నివేదిక పేర్కొంది. అప్పటికి మెట్రో నగరాల్లోని జీసీసీలు నాయకత్వం, పరిపాలన, ఆర్ అండ్ డీ కేంద్రాలుగా పనిచేస్తే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని జీసీసీలు స్పెషలైజ్డ్ డెలివరీ కేంద్రాలుగా పని చేయనున్నాయి. దీంతో 2030 నాటికి ద్వితీయ, తృతీయ నగరాల్లోనే జీసీసీల్లోనే 7.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని ఎన్ఎల్‌బీ సర్వీసెస్ (ఆసియా,పసిఫిక్ రీజియన్) సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వరుణ్ సచ్‌దేవ చెప్పారు.

వాల్యూల్యాబ్స్‌పై పీఈ సంస్థల కన్ను!

రేసులో ఈక్యూటీ, పీఏజీ, బ్లాక్‌స్టోన్, సీవీసీ సంస్థలు

మెజారిటీ వాటా కోసం చర్చలు

హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ కంపెనీ వాల్యూలాబ్స్ ఈక్విటీలో మెజారిటీ వాటా చేజిక్కించుకునేందుకు అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు సన్నాహాలు చేస్తున్నాయి. ఈక్యూటీ, పీఏజీ, సీవీసీ సహా బ్లాక్‌స్టోన్ వంటి పీఈ సంస్థలు.. వాల్యూల్యాబ్స్‌లో మెజారిటీ వాటా కోసం సంస్థను ప్రమోట్ చేసిన దొనకంటి కుటుంబ సభ్యులతో చర్చిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా కంపెనీ విలువ రూ.8,800 కోట్లు (100 కోట్ల డాలర్లు)గా లెక్కకట్టినట్లు తెలుస్తోంది. డీల్ విషయంలో అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ శాక్స్.. వాల్యూల్యాబ్స్ ప్రమోటర్లకు సహకరిస్తున్నట్లు సమాచారం. పీఈ సంస్థలతో చర్చలు పూర్తయితే ఈ నెలాఖరులోనే తొలి దశ బిడ్స్‌ను ఆహ్వానించే అవకాశం ఉందని తెలుస్తోంది. వాల్యూల్యాబ్స్ వాల్యుయేషన్‌పై స్పష్టత వస్తే మరికొన్ని పీఈ సంస్థలు, వ్యూహాత్మక ఇన్వెస్టర్లు కూడా రంగంలోకి దిగే అవకాశం కనిపిస్తోంది.

1997లో ప్రారంభం

వాల్యూలాబ్స్ సంస్థను 1997లో దొనకంటి అర్జున రావు, ఆయన కుటుంబసభ్యులు ప్రమోట్ చేశారు. ఈ మధ్య స్థాయి ఐటీ కంపెనీ 300కు పైగా కంపెనీలకు ఏఐ ఆధారిత ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్ అందిస్తోంది. ప్రస్తుతం వాల్యూలాబ్స్‌లో 7,000 మందికిపైగా ఇంజనీర్లు పని చేస్తున్నారు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, క్వాలిటీ ఇంజనీరింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా అండ్ అనలిటిక్స్‌లో కంపెనీకి మంచి పట్టుంది. దీంతో పీఈ సంస్థలు వాల్యూల్యాబ్స్ ఈక్విటీలో మెజారిటీ వాటా తీసుకునేందుకు ఆసక్తితో ఉన్నట్టు తెలుస్తోంది.

సీక్వెంట్ సైంటిఫిక్‌లో వియాష్ లైఫ్ సైన్సెస్ విలీనం

▸▸ ఎన్‌సీఎల్‌టీ నుంచి గ్రీన్ సిగ్నల్

ముంబై: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న వియాష్ లైఫ్ సైన్సెస్.. సీక్వెంట్ సైంటిఫిక్ కంపెనీలో విలీనమవుతోంది. జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ఇందుకు ఆమోదం తెలిపింది. ఇరు కంపెనీల విలీనంతో రూ.8,000 కోట్ల కంపెనీ ఏర్పడనుంది. గత ఏడాది సెప్టెంబరులో రెండు కంపెనీలు ఈ విలీనాన్ని ప్రకటించాయి. అయితే ఎన్‌సీఎల్‌టీ నుంచి ఇందుకు ఆమోదం మంగళవారమే లభించింది. సీక్వెంట్ సైంటిఫిక్ వాటాదారుల్లో 99.98 శాతం మంది ఇప్పటికే ఈ విలీనానికి ఆమోదం తెలిపారు. ఇందులో సీక్వెంట్ సైంటిఫిక్.. యానిమల్ హెల్త్ కేర్ రంగంలో, వియాష్ లైఫ్ సైన్సెస్ హ్యూమన్ హెల్త్‌కేర్ రంగంలో ఉన్నాయి. వియాష్ లైఫ్ సైన్సెస్ కంపెనీ ఉత్పత్తులకు అమెరికా ఎఫ్‌డీఏ ఆమోదం ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	625	విజయవాడ	650
వరంగల్	627	గోదావరి	630
చిత్తూరు	663	విశాఖపట్నం	615
		దజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	117	విజయవాడ	111
వరంగల్	117	గుంటూరు	115
కరీంనగర్	117	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	117	చిత్తూరు	112
కర్నూలు	117	నెల్లూరు	117
విశాఖపట్నం	110	అనంతపురం	117
గోదావరి	111		

ఆర్థిక మోసాల నిరోధానికి నేషనల్ ఫైనాన్షియల్ గ్రిడ్

ఏర్పాటు చేయాలన్న ఎస్‌బీఐ చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి

ముంబై: దేశంలో ఆర్థిక మోసాలను నిరోధించడంతో పాటు రిస్క్ నిర్వహణ కోసం ఆర్థిక సేవల రంగానికి చెందిన కీలక విభాగాలను అనుసంధానిస్తూ నేషనల్ ఫైనాన్షియల్ గ్రిడ్ (ఎన్ఎఫ్‌జీ)ను ఏర్పాటు చేయాలని భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బీఐ) చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి కోరారు. క్రెడిట్ రేటింగ్ బ్యూరోలు, ఫ్రాడ్ రిజిస్ట్రీలు, ఈ-కేవైసీ వసతులు, యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), అకౌంట్ అగ్రిగేటర్లతో పాటు ఈ మధ్యనే ప్రవేశపెట్టిన యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (యూఎల్ఐ)ను ఈ గ్రిడ్‌తో అనుసంధానించాలని శెట్టి అన్నారు. ముంబైలో జరుగుతున్న సీఐఐ ఫైనాన్షియల్ సమ్మిట్‌లో మంగళవారం పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ సూచన చేశారు. ఆర్థిక రంగ వర్గాలు ఏకమై లాభాపేక్ష లేని సంస్థ ఇండియన్ డిజిటల్ పేమెంట్ ఇంటెలిజెన్స్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశాయి. వినియోగదారుల ప్రయోజనాలను రక్షించడమే అంతిమ లక్ష్యంగా రియల్ టైం డేటాను ఇచ్చిపుచ్చుకునేందుకు వీలుగా ఏర్పాటైన డిజిటల్ మౌలిక సదుపాయం ఇది.

చిన్న వ్యాపారుల కోసం డిజిటల్ ట్విన్: చిన్న వ్యాపారులు సులభంగా రుణాలు తీసుకునేందుకు వీలుగా 'డిజిటల్ ట్విన్'ను ఏర్పాటు చేయాలని కూడా ఎస్‌బీఐ చైర్మన్ శెట్టి సూచించారు. ఈ డిజిటల్ ట్విన్ వ్యాపార సంస్థకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని నిక్షిప్తం చేస్తుంది. ఆ సమాచారం వ్యాపార సంస్థ ఆర్థిక పరిస్థితిని సమగ్రంగా తెలియజేయడంతో పాటు ఆ సంస్థ సులభంగా ఆర్థిక సేవలందుకునేందుకు దోహదపడుతుంది. అందరికీ ఆర్థిక సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఇప్పటికే పలు చర్యలు చేపట్టినప్పటికీ, అది పూర్తిగా నెరవేరలేదు.

దాంతో చిన్న వ్యాపారాలు అసంఘటిత, అనియంత్రిత సంస్థల నుంచి అధిక వడ్డీకి రుణాలు తీసుకోవాల్సి వస్తోందని శెట్టి పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు రుణాలిచ్చే విషయంలో సత్సంబంధాల ఆధారిత విధానానికి బదులు పూర్తిగా డేటా ఆధారిత విధానాన్ని అనుసరించేందుకు డిజిటల్ ట్విన్ తోడ్పడుతుందన్నారు.

ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్

లాభాల స్వీకరణతో సెన్సెక్స్ 278 పాయింట్లు డౌన్

ముంబై: స్టాక్ మార్కెట్లో ఆరు రోజుల వరుస ర్యాలీకి అడ్డుకట్ట పడింది. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన ట్రెండ్ నేపథ్యంలో దేశీయంగా మదుపరులు ఐటీ, మెటల్, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్ రంగ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటంతో ప్రామాణిక సూచీలు మంగళవారం నష్టాలు చవిచూశాయి. ఒక దశలో 393 పాయింట్ల వరకు పతనమైన సెన్సెక్స్.. చివరికి 277.93 పాయింట్ల నష్టంతో 84,673.02 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 103.40 పాయింట్లు కోల్పోయి 25,910.05 వద్ద ముగిసింది. ఈక్విటీ వర్గాల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.2.52 లక్షల కోట్లు తగ్గి రూ.474.62 లక్షల కోట్లకు జారుకుంది.

రేపటి నుంచి ఇన్ఫీ బైబ్యాక్

దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ రూ.18,000 కోట్ల సొంత షేర్ల తిరిగి కొనుగోలు (బైబ్యాక్) ప్రక్రియ ఈ నెల 20 (గురువారం)న ప్రారంభమై 26న ముగియనుంది. కంపెనీ చరిత్రలో ఇదే అతిపెద్ద బైబ్యాక్. ఇందులో భాగంగా కంపెనీ 2.41 శాతం వాటాకు సమానమైన 10 కోట్ల ఈక్విటీ షేర్లను ఒక్కొక్కటీ రూ.1,800 చొప్పున చెల్లించి తిరిగి కొనుగోలు చేయనుంది. అర్హులైన షేర్‌హోల్డర్లు ఈ నెల 20-26 మధ్య కాలంలో తమ వద్దనున్న షేర్లను కంపెనీకి ఆఫర్ చేయవచ్చు.

క్యూ2 జీడీపీ వృద్ధి 7.5%

ఎస్‌బీఐ రీసెర్చ్ అంచనా

న్యూఢిల్లీ: సెప్టెంబరు చివరిలో జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో పండగల సీజన్ కొనుగోళ్లు జోరుగా సాగడం వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (క్యూ2)లో వృద్ధి రేటు 7.5 శాతానికి చేరుతుందని ఎస్‌బీఐ రీసెర్చ్ తాజా నివేదికలో అంచనా వేసింది. దీనికి తోడు పెట్టుబడి కార్యకలాపాలు పుంజుకోవడం, గ్రామీణ వినియోగం పెరగడం, సేవలు/తయారీ రంగాల జోరు వృద్ధికి ఊతం ఇచ్చే అంశాలని పేర్కొంది. అలాగే వ్యవసాయం, పరిశ్రమలు, సేవల రంగాల్లో వినియోగం, డిమాండుకు దర్పణం పట్టే ప్రధాన సూచికల వేగం 70% నుంచి 83 శాతానికి పెరిగినట్టు తెలిపింది. ఇవన్నీ జీడీపీ 7.5 శాతానికి చేరేందుకు దోహదపడే అంశాలేనని ఎస్‌బీఐ ఆర్థిక పరిశోధనా విభాగం రూపొందించిన ఆ నివేదిక పేర్కొంది. రెండో త్రైమాసికానికి ఆర్‌బీఐ ప్రకటించిన వృద్ధి అంచనా 7 శాతం కన్నా ఇది అధికం. ప్రభుత్వం ఈ నెలాఖరులో జూలై-సెప్టెంబరు త్రైమాసిక జీడీపీ అధికారిక గణాంకాలను ప్రకటించనుంది.

భారీగా తగ్గిన బంగారం, వెండి



- 10 గ్రాముల బంగారం రూ.3,900 తగ్గుదల
- కిలో వెండి రూ.7,800 డౌన్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ట్రెండ్‌కు అనుగుణంగా దేశీయంగానూ విలువైన లోహాల ధరలు భారీగా తగ్గాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9% స్వచ్ఛత బంగారం ధర 10 గ్రాములపై రూ.3,900 తగ్గి రూ.1,25,800కు దిగివచ్చింది. 99.5% స్వచ్ఛత లోహం రేటు కూడా అదే స్థాయిలో తగ్గి రూ.1,25,200గా నమోదైంది. కిలో వెండి ఏకంగా రూ.7,800 తగ్గుదలతో రూ.1,56,000కు జారుకుంది. వచ్చే నెలలో ఫెడ్ రేట్లు మరింత తగ్గేందుకు అవకాశాలు సన్నగిల్లడంతో ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం 4,042 డాలర్లు, సిల్వర్ 50 డాలర్లకు తగ్గాయి.

స్పోర్ట్స్

భారత్-బంగ్లా మహిళల సిరీస్ వాయిదా

న్యూఢిల్లీ: భారత్-బంగ్లాదేశ్ మహిళల క్రికెట్ జట్ల మధ్య డిసెంబరులో జరగాల్సిన పరిమిత ఓవర్ల సిరీస్ వాయిదా పడింది. ఐసీసీ ఎఫ్‌టీపీ ప్రకారం ఇరు జట్లు మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్‌లు ఆడాల్సి ఉంది. కోల్‌కతా, కటక్‌లో ఈ మ్యాచ్‌లను నిర్వహించాలనుకున్నారు. అయితే భారత్‌లో తలదాచుకున్న బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు అక్కడి కోర్టు సోమవారం మరణ శిక్ష విధించిన విషయం తెలిసిందే. దీంతో ఇరు దేశాల మధ్య రాజకీయ సంబంధాలు సున్నితంగా మారాయి. కానీ వాయిదా నిర్ణయం వెనుక కారణాన్ని మాత్రం బీసీసీఐ చెప్పలేదు. 'డిసెంబరులో మేం ప్రత్యామ్నాయ సిరీస్ కోసం ప్రయత్నిస్తున్నాం. ప్రస్తుతానికి బంగ్లాతో మాత్రం మ్యాచ్‌లు ఉండవు' అని బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. అటు బీసీసీఐ నుంచి ఈ మేరకు లేఖ అందిందని బంగ్లా క్రికెట్ బోర్డు తెలిపింది.

టైబ్రేక్‌కు అర్జున్

క్వార్టర్స్ రెండో గేమూ డ్రా ● చెస్ వరల్డ్‌కప్



పనాజీ: చెస్ వరల్డ్‌కప్‌లో తెలుగు జీఎం అర్జున్ ఇరిగేసి క్వార్టర్స్ ఫలితం టైబ్రేక్‌కు మళ్లింది. మంగళవారం జరిగిన క్లాసిక్ గేమ్‌లో కూడా ప్రత్యర్థి వి యి (చైనా)తో అర్జున్ పాయింట్ పంచుకొన్నాడు. తెల్ల పావులతో ఆడిన అర్జున్ 32 ఎత్తుల అనంతరం ప్రత్యర్థితో డ్రాకు అంగీకరించాడు. తొలి గేమ్ కూడా డ్రా కావడంతో అర్జున్, వి యిలు 1-1తో సమంగా నిలిచారు. బుధవారం జరిగే టైబ్రేక్‌లో గెలిచిన వారు సెమీస్‌కు చేరుకొంటారు. జోస్ మార్టినెజ్‌తో జావోరిక్ షిండరోవ్, సామ్ షెంక్‌లాండ్‌తో ఆండే ఎసిపెంకు కూడా 1-1తో డ్రా చేసుకొన్నారు. కాగా, నోడిర్‌బెక్ 1.5-0.5తో అలెగ్జాండర్ డాన్‌చెంకోపై గెలిచి సెమీస్‌లోకి అడుగుపెట్టాడు.

సెమీస్‌లో భారత్-ఎ

ఒమన్‌పై గెలుపు ● రైజింగ్ స్టార్స్ ఆసియాకప్

దోహా: రైజింగ్ స్టార్స్ ఆసియాకప్‌లో భారత-ఎ జట్టు సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకొంది. హర్ష్ దూబే (53 నాటౌట్) అదరగొట్టడంతో.. గ్రూప్-బీలో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 6 వికెట్లతో ఒమన్‌ను చిత్తు చేసింది. దీంతో 3 మ్యాచ్‌ల నుంచి భారత్-ఎ 4 పాయింట్లతో గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. ఒమన్, యూఏఈ టోర్నీ నుంచి అవుటయ్యాయి. తొలుత ఒమన్ 20 ఓవర్లలో 135/7 స్కోరు చేసింది. వసీం అలీ (54 నాటౌట్) హాఫ్ సెంచరీ చేశాడు. సుయాన్ష్, గుర్‌ప్రీత్ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో భారత్ 17.5 ఓవర్లలో 138/4 స్కోరు చేసి గెలిచింది. నమన్ (30), నేహల్ (23) రాణించారు.

స్పిన్, పేస్ మిశ్రమం..



టీమిండియా కోచ్‌ల సమాలోచన

గువాహటి పిచ్ సిద్ధం

22 నుంచి సఫారీలతో రెండో టెస్టు

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో స్పిన్ ట్రాక్‌పై ఎదురైన పరాభవంతో భారత జట్టు రెండో టెస్టుపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. దక్షిణాఫ్రికాతో ఈనెల 22 నుంచి గువాహటిలో జరిగే ఈ మ్యాచ్ కోసం స్పిన్‌తో పాటు పేస్‌కు అనుకూలంగా ఉండేలా వికెట్‌ను కోరుకుంటోంది. అక్కడి పిచ్ కూడా ఎర్ర మట్టితో రూపొందించనుండడంతో పేసర్లకు చక్కటి బౌన్స్ లభించే అవకాశం ఉంది. బర్సాపర స్టేడియంలో జరిగే తొలి టెస్టు ఇదే కావడంతో విమర్శలకు తావీయకూడదనే ఆలోచనలో బీసీసీఐ ఉంది. అందుకే బోర్డు హెడ్ క్యురేటర్ ఆశిష్ భౌమిక్ కూడా పిచ్‌ను పర్యవేక్షిస్తున్నారు. 'ఇక్కడి పిచ్‌ను ఎర్రమట్టితో తయారుచేశారు. దీంతో ఇది ఎక్కువ పేస్, బౌన్స్‌ను అందించే తత్వం కలిగి ఉంటుంది. హోమ్ సీజన్‌కు ముందే భారత్ తమ డిమాండ్‌ను స్పష్టంగా చెప్పింది. అయితే అస్థిర బౌన్స్ మాత్రం ఉండకూడదనే క్యురేటర్ ప్రయత్నిస్తున్నాడు' అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. తొలి టెస్టు జరిగిన కోల్‌కతా పిచ్ మొదటి రోజే అదనపు బౌన్స్‌తో పాటు స్పిన్‌కు అనుకూలంగా మారిన విషయం తెలిసిందే. దీంతో ఇరు జట్ల బ్యాటర్లకు పరుగులు తీయడం కష్టంగా మారింది.

ప్రాక్టీస్ అలా..



జురెల్

ఈడెన్‌లో స్పిన్నర్లను దీటుగా ఆడలేక విమర్శల పాలైన భారత బ్యాటర్లు నెట్ సెషన్‌లో ఆ దిశగా దృష్టి సారించారు. ప్రస్తుతం కోల్‌కతాలోనే ఉన్న ప్లేయర్లు నెట్ ప్రాక్టీస్ చేశారు. ఇది ఆప్షనల్ కావడంతో కొంతమందే బరిలోకి దిగారు. ముఖ్యంగా సాయి సుదర్శన్‌తో పాటు ధ్రువ్ జురెల్ సింగిల్ ప్యాడ్‌ను ధరించి ప్రాక్టీస్‌లో పాల్గొన్నారు. ఇది రిస్క్‌తో కూడుకున్నదైనప్పటికీ ఎడమచేతి బ్యాటర్ సుదర్శన్ సులువుగా ఫ్రంట్ ఫుట్ షాట్ ఆడేందుకు.. కుడి కాలి ప్యాడ్‌ను తొలగించాడు. ఈ సందర్భంలో డిఫెన్స్ ఆడాలంటే కాలును కాకుండా బ్యాట్‌ను అడ్డుగా పెట్టాల్సి ఉంటుంది. జట్టులోని లెఫ్ట్ హ్యాండర్లు స్పిన్‌ను ఎదుర్కొనే క్రమంలో బ్యాక్ ఫుట్ తీసుకుంటూ ఇబ్బంది పడుతున్నారు. అందుకే ముందుకు వచ్చి ఆడేలా సింగిల్ ప్యాడ్‌తో ప్రాక్టీస్ చేస్తున్నారు. జురెల్ రివర్స్ స్వీప్ షాట్లు ఎక్కువగా ఆడాడు. ఇదిలావుండగా.. సఫారీ ఆఫ్ స్పిన్నర్లు సైమన్ హార్మర్, లెఫ్టామ్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్‌లను దీటుగా ఎదుర్కొనేందుకు స్థానిక స్పిన్నర్ కౌశిక్ మైటీతో బ్యాటర్లు ప్రాక్టీస్ చేశారు. ఎందుకంటే 26 ఏళ్ల కౌశిక్ తన రెండు చేతులనూ ఉపయోగిస్తూ.. లెఫ్ట్ హ్యాండర్లకు ఆఫ్ బ్రేక్, కుడి చేతి బ్యాటర్లకు లెఫ్టామ్ స్పిన్‌తో బంతులు వేయగల నైపుణ్యం కలిగి ఉన్నాడు.

బ్యాకప్‌గా నితీశ్

తొలి టెస్టుకు ముందు ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌ను వదిలేసిన బీసీసీఐ తిరిగి గువాహటి మ్యాచ్‌కు జట్టులో చేర్చింది. కెప్టెన్ గిల్ గాయపడడంతో అతడికి బ్యాకప్‌గా నితీశ్‌ను పిలిపించారు. కోల్‌కతా నుంచి జట్టుతో పాటు వెళ్లనున్న గిల్ ఈ టెస్టు ఆడే విషయమై స్పష్టత లేదు. అందుకే సోమవారం సాయంత్రమే నితీశ్ జట్టులో చేరాడు.

ధనుష్ డబుల్ ధమాకా

బధిర ఒలింపిక్స్‌లో రెండో స్వర్ణం కైవసం



మహిత్

టోక్యో: తెలుగు షూటర్ ధనుష్ శ్రీకాంత్ తన గురి తప్పదని మరోసారి నిరూపించాడు. బధిర ఒలింపిక్స్ (డెఫ్లింపిక్స్)లో రెండో స్వర్ణం కొల్లగొట్టి డబుల్ ధమాకా సృష్టించాడు. రెండ్రోజుల క్రితం 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత ఈవెంట్‌లో విజేతగా నిలిచిన ఈ హైదరాబాద్ స్టార్.. మంగళవారం మిక్స్‌డ్ విభాగంలోనూ పసిడి దక్కించుకున్నాడు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్ ఫైనల్లో భారత ద్వయం ధనుష్/మహిత్ సంధు 17-7తో దక్షిణ కొరియా జోడీ జియోన్ డెయిన్/కిమ్ వూరిమ్‌ను ఓడించి బంగారు పతకం అందుకుంది. ఇక, భారత్‌కే చెందిన మహ్మద్ ముర్తజా వానియా/కోమల్ మిలింద్ జంట 16-12తో ఉక్రెయిన్ ద్వయంపై గెలిచి కాంస్య పతకం సొంతం చేసుకుంది. 23 ఏళ్ల ధనుష్ శ్రీకాంత్‌కు ఇది ఓవరాల్‌గా నాలుగో డెఫ్లింపిక్స్ స్వర్ణం కావడం విశేషం. 2022లో బ్రెజిల్ వేదికగా జరిగిన టోర్నీలోనూ వ్యక్తిగత, మిక్స్‌డ్ ఈవెంట్లలో చాంపియన్‌గా నిలిచాడు. కొన్నాళ్లుగా అంతర్జాతీయస్థాయిలో అద్భుత విజయాలు సాధిస్తోన్న ధనుష్.. మాజీ షూటర్, ఒలింపిక్ కాంస్య పతక విజేత గగన్ నారంగ్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు.

'హాకీ అంపైర్ ఆఫ్ ద ఇయర్' రఘు



లాసన్నే: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) 2025కుగాను పురుష 'అంపైర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు భారత్‌కు చెందిన రఘు ప్రసాద్‌కు దక్కింది. 2003లో అంపైర్‌గా కెరీర్ ఆరంభించిన ప్రసాద్ (కర్ణాటక).. గడచిన 23 ఏళ్లలో 198 మ్యాచ్‌లకు రెఫరీగా పని చేశాడు. ఈ నెల 23 నుంచి జరగనున్న సుల్తాన్ అజ్లాన్ షా కప్‌తో 200 మ్యాచ్‌ల మైలురాయిని అందుకొన్న తొలి ఆసియా అంపైర్‌గా అరుదైన ఘనతను సాధించనున్నాడు. హాకీ వరల్డ్‌కప్‌లు, మూడు ఒలింపిక్స్ ఆసియా క్రీడల్లో రెఫరీగా రఘు సేవలందించాడు. కాగా ఈ ఏడాదికిగాను అత్యుత్తమ మహిళా అంపైర్‌గా అర్జెంటీనాకు చెందిన ఇరెనె ప్రెసెన్క్వీ ఎంపికైంది.

అభిషేక్ ద్విశతకం

- ఆంధ్ర 567/6 డిక్లేర్
- 239 పరుగుల ఆధిక్యం



జార్ఖండ్ 34/2

జంషెడ్‌పూర్: అభిషేక్ (247) ద్విశతకం నమోదు చేయడంతో.. గ్రూప్-ఎలో జార్ఖండ్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర కీలక తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సాధించింది. ఆటకు మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 224/2తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆంధ్ర 567/6 వద్ద డిక్లేర్ చేసింది. జార్ఖండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 328కు అదనంగా 239 పరుగుల ఆధిక్యాన్ని నమోదు చేసింది. కరణ్ షిండే (94) దూకుడుగా ఆడాడు. అనుకూల్ రాయ్, రిషవ్ రాజ్ రెండేసి వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో జార్ఖండ్ 34/2 స్కోరు చేసింది. మంగళవారం ఆట ఆఖరుకు శరణ్‌దీప్ సింగ్ (13), మనీష్ (2) క్రీజులో ఉన్నారు. ఓపెనర్ శిఖర్ మోహన్ (3)ను శశికాంత్ అవుట్ చేయగా.. కుమార్ కుశాగ్ర (16)ను సౌరభ్ కుమార్ వెనక్కిపంపాడు.

సాత్విక్ జోడీ ముందంజ

- గాయత్రి ద్వయం పరాజయం
- ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్



సిడ్నీ: ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరల్డ్ నెం:3 సాత్విక్ సాయిరాజ్ జోడీ రెండు రౌండ్‌కు చేరుకోగా.. గాయత్రి జంట ఓటమితో ఇంటిముఖం పట్టింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్-చిరాగ్ షెట్టి ద్వయం 25-23, 21-16తో చైనీస్ తైపీకి చెందిన చాంగ్ కో చి-పో లి విపై పోరాడి గెలిచింది. అయితే, మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ జంట 10-21, 14-21తో ఇండోనేసియాకు చెందిన కుసుమ-పుష్పితా సరి చేతిలో ఓడింది. లక్ష్యసేన్, కిడాంబి శ్రీకాంత్, హెచ్ఎస్ ప్రణయ్, ఆయుష్ షెట్టి తలపడే సింగిల్స్ మ్యాచ్‌లు బుధవారం నుంచి జరగనున్నాయి.

జింబాబ్వే వణికించినా.. పాక్‌దే గెలుపు

రావల్పిండి: జింబాబ్వే భయపెట్టినా..ముక్కోణపు టీ20 సిరీస్‌లో పాకిస్థాన్ బోణీ కొట్టింది. మంగళవారం జరిగిన సిరీస్ ఆరంభ మ్యాచ్‌లో పాక్ 5 వికెట్లతో జింబాబ్వేపై గెలిచింది. తొలుత జింబాబ్వే 20 ఓవర్లలో 8 వికెట్లకు 147 పరుగులు చేసింది. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (49), కెప్టెన్ సికందర్ రజా (34 నాటౌట్), మరుమణి (30) టాప్ స్కోరర్లు. ఛేదనలో పాక్ 19.2 ఓవర్లలో 151/5 స్కోరు చేసి గెలిచింది. 54/4తో కష్టాల్లో పడిన సమయంలో.. ఫఖర్ జమాన్ (44), ఉస్మాన్ ఖాన్ (37 నాటౌట్), నవాజ్ (20 నాటౌట్) కౌంటర్ ఎటాక్‌తో జట్టును గెలిపించారు.

ఓటమి దిశగా హైదరాబాద్

జమ్మూ: జమ్మూ కశ్మీర్‌తో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ ఓటమి బాటలో పయనిస్తోంది. 472 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆటకు మూడో రోజు హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 169/7తో కష్టాల్లో పడింది. ఆఖరి రోజు విజయానికి హైదరాబాద్‌కు 303 పరుగులు కావాల్సి ఉండగా.. చేతిలో 3 వికెట్లే ఉన్నాయి. ఓవర్‌నైట్ స్కోరు 275/4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన జమ్మూ 422 రన్స్‌కు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్‌లో జమ్మూ 170, హైదరాబాద్ 121 పరుగులు చేశాయి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 19-11-2025 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**




హిడ్మా మృతదేహం


హిడ్మా భార్య రాజే

కగార్‌తో నక్సల్స్ కకావికలం..

హిడ్మా ఎన్‌కౌంటర్

'మోస్ట్ వాంటెడ్' నేత మృతి



మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

హిడ్మా, ఆయన సహచరి సహా ఆరుగురి మృతి

'సేఫ్ జోన్' కోసం దండకారణ్యం దాటిన దళం

మారేడుమిల్లి మీదుగా ఒడిశా వెళ్లాలనే వ్యూహం

హిడ్మా ఉనికిపై ఏపీ పోలీసులకు పక్కా సమాచారం

నాలుగు రోజులుగా బలగాలతో కూంబింగ్

తెల్లవారుజామున ఎదురుపడ్డ నక్సల్స్.. ఎన్‌కౌంటర్

ఆయుధాలు, పేలుడు సామగ్రి స్వాధీనం


హిడ్మా, ఇతర నక్సల్స్ మృతదేహాలు ఉంచిన రంపచోడవరం ఏరియా ఆసుపత్రి మార్చురీ వద్ద బలగాల పహారా

అతడంటేనే... 'హింస!'
మెరుపు దాడులకు మారు పేరు!
ఆకుపచ్చ అడవులకు పూసిన నెత్తురు!
భద్రతా దళాలకు చిక్కడు...
ఎంత గాలించినా దొరకడు!

కూంబింగ్‌కు వెళ్లిన ప్రతిసారీ, 'అతడు దొరకాలి' అని ఒకవైపు... 'అతడి ఎరకు దొరకొద్దు' అని ఇంకోవైపు బలగాలు గట్టిగా కోరుకునే నక్సల్స్ నేత!

మావోయిస్టు పార్టీ కార్యదర్శి స్థాయి నేతలు, కేంద్ర కమిటీ సభ్యులు, కమాండర్లు... ఎందరు దొరుకుతున్నా... ఎందరు ఎన్‌కౌంటర్లలో తలవాల్చుతున్నా... 'అతడు కావాలి. అతడు దొరికితే చాలు' అని పోలీసులు పదేపదే పలవరించారు!

ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తెలంగాణ.. ఇలా అనేక రాష్ట్రాల పోలీసులకు 'మోస్ట్ వాంటెడ్'.. ఎట్టకేలకు, ఇన్నేళ్లకు ఆంధ్రప్రదేశ్ బలగాల చేతిలో ఎన్‌కౌంటర్ అయ్యాడు! ఆయనే.. హిడ్మా! మావోయిస్టు పార్టీలో అతడే ఒక సైన్యం.. అతడిది ఒక ప్రత్యేక సైన్యం! '2025 నవంబరు 30లోపు హిడ్మాను మట్టుబెట్టాలి' అని కేంద్రం పెట్టుకున్న డెడ్‌లైన్‌కు ముందుగానే.. ఏపీ బలగాలు ఆ పని చేసేశాయి! అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా, ఆయన జీవన సహచరి మడకం రాజే అలియాస్ రాజక్కతోపాటు మరో నలుగురు మరణించారు! 'ఆపరేషన్ కగార్'లో ఇదో కీలక మలుపు! ఆదివాసీ కుటుంబంలో పుట్టి.. కుర్రాడిగానే ఆయుధం పట్టి.. మావోయిస్టు పార్టీ అగ్రనేతల్లో ఒకడిగా ఎదిగిన హిడ్మా మరణం మావోయిస్టు పార్టీకే పెద్ద చావుదెబ్బగా అభివర్ణిస్తున్నారు.

సమగ్ర కథనాలు 11, 12, 13లో

గెరిల్లా గుండెలయ హిడ్మా

దండకారణ్యంలో అలజడి రేపిన ఆదివాసీ నేత

సాధారణ వ్యక్తిగా మొదలై మిలిటరీ చీఫ్‌గా ఎదిగి

వ్యూహం పన్నాడంటే రక్తపుటేరులే

కథ ముగిసినట్టేనా?

హిడ్మా మృతితో పార్టీకి కోలుకోలేని దెబ్బ

కీలక సభ్యుల వరుస ఎన్‌కౌంటర్లతో కుదేలు

మిగిలినవారి లొంగుబాట్లతో పూర్తిగా డీలా

మావోయిస్టు పార్టీ చీఫ్ దేవ్‌జీ ఎక్కడ?

గార్డుల అరెస్ట్.. ఆయనా పోలీసులకు దొరికారా?

అడవి దాటిన అన్నలు

జనారణ్యంలో ఒకే రోజు 50 మంది అరెస్టు

బెజవాడలోనే 32 మంది

ఏలూరు, కొవ్వూరు, అమలాపురం, కోనసీమల్లో మరో 18 మంది అదుపులోకి

బెజవాడ న్యూ ఆటోనగర్‌లో తలదాచుకున్న నక్సల్స్

ఆయుధాలు, మందుగుండుతో ఓ భవనంలో మకాం!

చుట్టుముట్టిన గ్రేహౌండ్స్, ఆక్టోపస్ దళాలు

8 గంటలపాటు సైలెంట్ ఆపరేషన్.. 28 మంది అరెస్ట్

వీరిలో 21 మంది మహిళలు.. వీరంతా హిడ్మా, అగ్రనేత దేవ్‌జీ రక్షణ సిబ్బందే

అటు ఏలూరు గ్రీన్‌సిటీలో మఫ్టీలో పోలీస్ ఆపరేషన్

గోడ దూకి లోపలికెళ్లి 15 మంది అదుపులోకి


బెజవాడలో మావోయిస్టులను బస్సులో తరలిస్తున్న దృశ్యం

ఒకే రోజు... అటు అడవుల్లో కాల్పులతో కట్టడి... ఇటు మైదాన ప్రాంతాల్లో ముట్టడి... ఏపీ పోలీసుల చేతిలో మావోయిస్టు పార్టీకి కనీవినీ ఎరుగని స్థాయి దెబ్బ తగిలింది. 'ఆపరేషన్ కగార్' ధాటికి కకావికలమైపోయి... రక్షణ కోసం అడవులను వీడారా? లేక... ఏదైనా సంచలన దాడి చేసి తమ 'ఉనికి' చాటుకునే వ్యూహంలో భాగంగానే నగరాలకు చేరారా? మావోయిస్టుల అసలు లక్ష్యం ఏదైనప్పటికీ.. వారి కదలికలను పోలీసులు ముందే పసిగట్టారు. ఒకరూ ఇద్దరూ కాదు.. ఏకంగా 50 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో 32 మందిని విజయవాడలోనే అరెస్టు చేశారు! ఏలూరు, కాకినాడ నగరాల్లోనూ మెరుపు దాడులు చేశారు. పట్టుబడిన నక్సల్స్‌లో అత్యధికులు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారే. వీరిలో... హిడ్మా దళ సభ్యులతోపాటు మావోయిస్టు దళపతి దేవ్‌జీ బాడీగార్డులూ ఉన్నట్లు సమాచారం! దీంతో.. దేవ్‌జీ ఎక్కడ? అనే అంశంపైనా రకరకాల ప్రచారం జరుగుతోంది!

ఉనికి కోసం..

ఏపీలో దాడులకు నక్సల్స్ ప్రణాళిక?

ఎవరో ఒకరిని చంపాలన్నదే ప్లాన్!

తద్వారా ఉనికిని చాటుకునే యత్నం

అందుకే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తిష్ట

ముందుగానే పసిగట్టిన ఇంటెలిజెన్స్

మూడు ప్రాంతాల్లో ఏకకాలంలో అరెస్టులు

అదుపులో హిడ్మా గన్‌మెన్, 'దేవ్‌జీ' గార్డులు

డెన్, వ్యూహాలపై కూపీ లాగుతున్న పోలీసులు


మావోయిస్టుల అరెస్టు తర్వాత ఘటనా స్థలంలో విలేకరులతో మాట్లాడుతున్న కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

అన్నదాతకు డబుల్ ధమాకా

నేడు పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ సొమ్ము విడుదల

ఒక్కో లబ్ధిదారుకు 7 వేల రూపాయల జమ

కేంద్రం రూ.2 వేలు.. ఏపీ సర్కారు రూ.5 వేలు

రాష్ట్రవ్యాప్తంగా 47 లక్షల ఖాతాలకు 3,135 కోట్ల జమ

కోయంబత్తూరులో ప్రధాని మోదీ, కమలాపురంలో సీఎం చంద్రబాబు నిధుల విడుదల

అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీ రైతులకు ఇదో డబుల్ ధమాకా! 'పీఎం కిసాన్- అన్నదాత సుఖీభవ' పథకం డబ్బులు బుధవారం రైతుల బ్యాంకు ఖాతాల్లో పడనున్నాయి. పీఎం కిసాన్ 21వ విడత సొమ్ము రూ.2వేల చొప్పున కేంద్రం, అన్నదాత సుఖీభవ రెండో విడత సొమ్ము రూ.5వేల చొప్పున రాష్ట్రప్రభుత్వం అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేయనున్నాయి. దీంతో ఒకే రోజు ఒక్కో రైతు కుటుంబానికి రూ.7వేల చొప్పున లబ్ధి చేకూరనున్నది. పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ పథకం కింద మొత్తం 46,85,838 రైతు కుటుంబాలకు రూ.3,135కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్నాయి. ప్రస్తుత రెండో విడతలో రాష్ట్ర ప్రభుత్వ వాటా

మిగతా 14వ పేజీలో...

నేడు పుట్టపర్తికి ప్రధాని మోదీ

శ్రీసత్యసాయి శత జయంత్యుత్సవాలకు హాజరు 2



రేపు సీబీఐ కోర్టుకు జగన్

అక్రమాస్తుల కేసులో కోర్టు మెట్లెక్కనున్న వైసీపీ చీఫ్

సుదీర్ఘ విరామం తర్వాత న్యాయస్థానంలో హాజరు

2020 తర్వాత తొలిసారి కోర్టుకు

నాడు అధికారం అడ్డుపెట్టి హాజరు నుంచి మినహాయింపు

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 20న(గురువారం) హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు హాజరు కానున్నారు. సుదీర్ఘ కాలంగా బెయిల్‌పైనే ఉన్న ఆయన ఇటీవల కోర్టు ఆదేశాలతో న్యాయస్థానం మెట్లు ఎక్కనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో 2020, జనవరి 10న

మిగతా 14వ పేజీలో...

రూ.58,700 కోట్లు!

పోలవరం-నల్లమలసాగర్ అంచనా వ్యయమిది

'బనకచర్ల' స్థానంలో కొత్త పథకానికి కార్యాచరణ

24న ముఖ్యమంత్రి సమీక్షలో తుది మెరుగులు

డీపీఆర్ తయారీకి నేడో రేపో బిడ్లకు ఆహ్వానం

పోలవరం టూ బొల్లాపల్లి టూ నల్లమలసాగర్

గోదావరి వరద జలాల ఎత్తిపోత

రోజుకు 2 టీఎంసీల చొప్పున

100 రోజుల్లో 200 టీఎంసీలు

ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో

7 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు

వెలిగొండ, గుండ్లకమ్మ, ఇతరాల పరిధిలో

6 లక్షల ఎకరాలకు సాగునీటి స్థిరీకరణ

60 లక్షల జనాభాకు తాగునీటి సరఫరా

మూడు దశల్లో పూర్తిచేయాలని నిర్ణయం

కొత్త పథకంపై ముందే వెల్లడించిన 'ఆంధ్రజ్యోతి'



అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకం స్థానంలో పోలవరం-నల్లమలసాగర్ ప్రాజెక్టుకు కార్యాచరణ సిద్ధమైంది. రూ.58,700 కోట్ల అంచనా వ్యయంతో దీనిని చేపట్టాలని రాష్ట్ర జల వనరుల శాఖ నిర్ణయించింది. పోలవరం నుంచి బొల్లాపల్లి రిజర్వాయరుకు.. అక్కడి నుంచి నల్లమలసాగర్‌కు గోదావరి వరద జలాలను ఎత్తిపోయడం దీని ఉద్దేశం. రోజుకు రెండు టీఎంసీల చొప్పున 100 రోజుల పాటు 200 టీఎంసీల వరద నీటిని తరలించాలని భావిస్తున్నారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో మూసీ, మన్నేరు బేసిన్ల పరిధిలో కొత్తగా ఏడు లక్షల ఎకరాలకు

మిగతా 14వ పేజీలో...



'పెద్దాయన' చెప్పిందే చేశా!

నెయ్యి కల్తీతో నాకేంటి సంబంధం?

అది చూసుకోవాల్సింది టీటీడీ అధికారులు

నా సేవలకు మెచ్చి కొందరు డబ్బులిచ్చారు

సిట్ విచారణలో చిన్న అప్పన్న డొంక తిరుగుడు సమాధానాలు

పెద్దాయన పేరు మాత్రం వెల్లడించని నిందితుడు

తిరుపతి/తిరుపతి (నేరవిభాగం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): కల్తీ నెయ్యి కేసు నిందితుడు కడూరు చిన్న అప్పన్న కస్టడీ విచారణలో రెండో రోజు కూడా డొంక తిరుగుడు సమాధానాలే ఇచ్చాడు. 'పెద్దాయన' ఏమి చెబితే అదే చేశానంటూ విచారణ సందర్భంగా చెప్పాడని తెలిసింది. చిన్న అప్పన్న పలు సందర్భాలలో 'పెద్దాయన' ప్రస్తావన తెచ్చాడని, అయితే ఆ పెద్దాయన ఎవరనేది

మిగతా 11వ పేజీలో...



కే కావేరీ బస్సు బీభత్సం

ముందు వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తూ..

దాని ముందున్న లారీతో బలంగా ఢీ

బస్సు ఎడమ భాగమంతా నుజ్జునుజ్జు

అదృష్టవశాత్తు తప్పిన ప్రాణ నష్టం

ప్రమాదంలో 8 మందికి గాయాలు

ఎన్టీఆర్ జిల్లా నందిగామ వద్ద ఘటన


2
లారీని రుద్దుకుంటూ వెళ్లడంతో బస్సు ఒకవైపంతా తుక్కుతుక్కైన దృశ్యం


3

తొలి 3 రోజులూ ఈ-డిప్‌లోనే

మిగిలిన ఏడు రోజులూ నేరుగా దర్శనాలు

డిసెంబరు 30 నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు

టీటీడీ బోర్డు కీలక నిర్ణయాలు


14

పరకామణి కేసులో..

ఏవీఎస్‌వో సతీశ్ మృతిపై హైకోర్టు దిగ్భ్రాంతి

దర్యాప్తు పూర్తయ్యేదాకా నిందితుడు రవికుమార్‌కు, సాక్షులకు రక్షణ కల్పించండి

పోలీసులకు న్యాయమూర్తి ఆదేశం

సీఐడీ, ఏసీబీ డీజీల పర్యవేక్షణలో దిగువ సిబ్బంది దర్యాప్తునకు అనుమతి

తదుపరి విచారణ 2కి వాయిదా

ఆ దేశపు మూర్ఖులపై అరిచా..

» అందుకే గొంతు బొంగురుపోయింది : ట్రంప్



వాషింగ్టన్, నవంబరు 18: ఓ దేశంతో వాణిజ్య చర్చల సందర్భంగా మూర్ఖపు వ్యక్తులపై గట్టిగా అరిచానని, దానితో తన గొంతు బొంగురుపోయిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే ఆ దేశం ఏదో చెప్పడానికి నిరాకరించారు. సోమవారం అధ్యక్ష కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సమయంలో తన గొంతు బొంగురుపోవడాన్ని ప్రస్తావిస్తూ.. "వాణిజ్యం, సుంకాల అంశంపై చర్చల సందర్భంగా ఓ దేశపు వారిపై గట్టిగా అరిచాను. ఎందుకంటే వారు మూర్ఖులు. ఒప్పందంపై పునఃసంప్రదింపులకు ఆ దేశం ప్రయత్నం చేస్తోంది. దాంతో చిరాకు వేసింది. వారికి నా అభిప్రాయాన్ని గట్టిగా కుండబద్దలు కొట్టనట్టు చెప్పాను" అని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై భారత్ సహా పలు ఆసియా, లాటిన్ అమెరికా దేశాలు చర్చలు జరుపుతున్నాయి. ఇదిలా ఉండగా, అమెరికా, భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొలిక్కి వస్తున్నాయని, త్వరలోనే శుభవార్త వినొచ్చని కేంద్ర వాణిజ్య మంత్రి గోయల్ పేర్కొన్నారు.

శబరిమలకు ఒక్కరోజే 2 లక్షల మంది భక్తులు



పథనంతిట్ట, నవంబరు 18: శబరిమల అయ్యప్ప ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. మంగళవారం దాదాపు 2 లక్షల భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. పంబా నుంచి సన్నిధానం వరకూ దారి పొడవునా భక్తులు బారులుతీరారు. రద్దీని అదుపు చేయడానికి ఏర్పాటుచేసిన బ్యారికేడ్లపైకి చాలామంది ఎక్కగా, వీరిని నియంత్రించడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారు. శబరిమలకు ఇంత పెద్దసంఖ్యలో భక్తులు రావడాన్ని ఇప్పటివరకూ చూడలేదని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు (టీడీబీ) అధ్యక్షుడు కె. జయకుమార్ అన్నారు. భక్తులు స్పాట్ బుకింగ్ కోసం పంబాకు రావాల్సిన అవసరం లేకుండా నీలక్కల్‌లోనే ఏడు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. శబరిమలకు ప్రవేశాన్ని రోజుకు లక్ష మంది పరిమితం చేస్తామన్నారు. అలాగే స్పాట్ బుకింగ్ 20 వేల మందికి మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు.

జంతువుల దాడితో దెబ్బతిన్న పంటలకూ బీమా

న్యూఢిల్లీ, నవంబరు 18: అటవీ జంతువుల దాడితో దెబ్బతిన్న పంటలకు కూడా వచ్చే ఖరీఫ్ సీజన్(2026 వానాకాలం) నుంచి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన వర్తించనుంది. ఈ మేరకు కేంద్రప్రభుత్వం మంగళవారం ప్రకటన విడుదల చేసింది. దీంతో పాటు వర్షాలు, వరదలతో మునిగిపోయిన వరిపంటకు కూడా ఈ పథకం వర్తిస్తుందని తెలిపింది. అడవులు ఎక్కువగా ఉన్న కేరళ లాంటి రాష్ట్రాల్లో ఏనుగులు, పలు రాష్ట్రాల్లో అడవి పందులు, కోతులు పంటలను తీవ్ర దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే కేంద్రం తాజా నిర్ణయం తీసుకొంది. అయితే, ఫసల్ బీమా పరిధిలోకి వచ్చే అటవీ జంతువులు ఏవనేది తమ భౌగోళిక పరిస్థితులను బట్టి ఆయా రాష్ట్రాలు నోటిఫై చేస్తాయని కేంద్రం తెలిపింది.

శిశువుల అదృశ్యం ఆందోళనకరం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, నవంబరు 18: దేశంలో శిశువుల అదృశ్యంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఇది తీవ్రమైన సమస్య అని మౌఖికంగా వ్యాఖ్యానించింది. పిల్లల అదృశ్యానికి సంబంధించిన కేసులు పరిష్కారం కావడం లేదని పేర్కొంటూ గురియా స్వయం సేవీ సంస్థాన్ అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా జస్టిస్ నాగరత్న మాట్లాడుతూ "దేశంలో ప్రతి 8నిమిషాలకు ఒక శిశువు అదృశ్యమవుతున్నట్టు ఓ పత్రికలో చదివాను. ఇది చాలా తీవ్రమైన సమస్య" అని పేర్కొన్నారు. దేశంలో దత్తత ప్రక్రియ సంక్లిష్టంగా ఉందని, ఆ కారణంగానే అక్రమంగా పిల్లలను పెంపకానికి తీసుకుంటున్నారని చెప్పారు. పిల్లల అదృశ్యంపై నమోదైన కేసుల దర్యాప్తు కోసం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు నోడల్ అధికారులను నియమించాలన్న ఆదేశాలు అమలుకాకపోవడంపై ప్రశ్నించింది. కేంద్రం ఆరు వారాల గడువు ఇవ్వాలని కోరగా, ధర్మాసనం తిరస్కరించింది. డిసెంబరు 9లోగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలంది.

బంగ్లాదేశ్‌లో నిరసనలు.. ఇద్దరి మృతి

ఢాకా, నవంబరు 18: అవామీ లీగ్ మద్దతుదారుల నిరసనలతో బంగ్లాదేశ్ అట్టుడికిపోతోంది. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ఐసీటీ) మరణశిక్ష విధించడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళనకారులు దేశవ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తున్నారు. పలు హైవేలను దిగ్బంధించారు. పోలీసులతో ఘర్షణలకు దిగారు. ఢాకాలో పెద్ద సంఖ్యలో నిరసనకారులు వీధుల్లోకి చేరారు. కొన్ని చోట్ల నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జితో పాటు బాష్పవాయువును ప్రయోగించారు. ఈ అల్లర్లలో ఇద్దరు మరణించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి.

ప్రాజెక్టులు పూర్తయ్యాకా పర్యావరణ అనుమతులు!


తీసుకోవచ్చన్న అత్యున్నత న్యాయస్థానం



» అలా అనుమతించడాన్ని నిషేధిస్తూ గతంలో ఇచ్చిన తీర్పు ఉపసంహరణ

న్యూఢిల్లీ, నవంబరు 18: రియల్ ఎస్టేట్, మైనింగ్ తదితర ప్రాజెక్టులకు 'ఎక్స్ పోస్ట్ ఫ్యాక్టో (పూర్తయ్యా)' పర్యావరణ అనుమతులు ఇవ్వడాన్ని నిషేధిస్తూ గతంలో జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం ఇచ్చిన తీర్పును.. తాజాగా సీజేఐ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం 2:1 మెజారిటీతో ఉపసంహరించింది. ఈ ధర్మాసనంలోనూ ఉన్న న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ మాత్రం తాను గతంలో ఇచ్చిన తీర్పునకే కట్టుబడి ఉన్నారు. మిగతా ఇద్దరు న్యాయమూర్తుల తీర్పుతో ఆయన విభేదించారు. ఎలాంటి అనుమతులూ లేకుండా ప్రాజెక్టులు చేపట్టి.. అవి పూర్తయ్యాక పర్యావరణ అనుమతులు (ఎక్స్ పోస్ట్ ఫ్యాక్టో) తీసుకుంటామనడం పర్యావరణచట్టానికి విరుద్ధమని ఈ ఏడాది మేలో జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం తీర్పునిచ్చింది. దీనికి సంబంధించి.. 'ముందు కట్టేసినా తర్వాత అనుమతులు ఇస్తాం' అనే మార్గదర్శకాలతో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 2017, 2021 నాటి ఆఫీస్ మెమొరాండాలను, ఒక నోటిఫికేషన్‌ను కొట్టివేసింది. భవిష్యత్తులో ఏ ప్రాజెక్టుకూ పోస్ట్-ఫ్యాక్టో పర్యావరణ అనుమతులు ఇవ్వరాదని తేల్చిచెప్పింది. అయితే, ఆ తీర్పు వల్ల ఎన్నో ప్రాజెక్టులను కూల్చేయాల్సి వస్తుంది, దీనివల్ల రూ.వేల కోట్ల నష్టం వాటిల్లుతుందని పేర్కొంటూ.. పలు కంపెనీలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశాయి. దానిపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపి.. ఆ తీర్పును రీకాల్ చేసింది. 2020లో అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ కేసును విచారించిన సుప్రీం ద్విసభ్య ధర్మాసనం.. పోస్ట్ ఫ్యాక్టో పర్యావరణ అనుమతులు ఇవ్వకూడదని చెప్పినప్పటికీ, అప్పటికే ఇచ్చిన అనుమతులను రద్దు చేయలేదని, జరిమానా వేసి ఆ అనుమతులను క్రమబద్ధీకరించిందని సీజేఐ జస్టిస్ గవాయ్ తన తీర్పులో గుర్తుచేశారు. అలాగే డాక్టర్ స్వామి వర్సెస్ కర్ణాటక కాలుష్య నియంత్రణ బోర్డు, ఎలక్ట్రోస్టీల్ స్టీల్స్ లిమిటెడ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, పహ్వా ప్లాస్టిక్స్ కేసుల్లో సైతం.. అసాధారణ సందర్భాల్లో పోస్ట్ ఫ్యాక్టో అనుమతులు ఇవ్వొచ్చని తీర్పులు వచ్చిన సంగతి గుర్తుచేశారు. ఈ కేసులు వేటినీ పరిగణనలోకి తీసుకోకుండా వనశక్తి కేసులో ద్విసభ్య ధర్మాసనం తీర్పునిచ్చిందని ఆయన అభిప్రాయపడ్డారు. 2017, 2021లో కేంద్రం జారీ చేసిన ఆఫీస్ మెమొరాండాల్లో.. అనుమతించదగ్గ ప్రాజెక్టులకు మాత్రమే పోస్ట్ ఫ్యాక్టో అనుమతులు ఇవ్వొచ్చని ఉందని కూడా ఆయన గుర్తుచేశారు. వనశక్తి తీర్పు ప్రకారం అలా ఇవ్వకూడదు కాబట్టి.. కట్టిన నిర్మాణాల్ని కూల్చేయాల్సి వస్తుందని.. దాని వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గకపోగా మరింత పెరుగుతుందని, అది ప్రజాప్రయోజనాలకు అనుకూలం కాదని సీజేఐ అభిప్రాయపడ్డారు. వనశక్తి కేసులో సైతం ద్విసభ్య ధర్మాసనం.. 'భవిష్యత్తు ప్రాజెక్టులకు' పోస్ట్ ఫ్యాక్టో అనుమతులు ఇవ్వొద్దని తీర్పునిచ్చింది తప్ప, పోస్ట్ ఫ్యాక్టో అనుమతులు పొందిన ప్రాజెక్టులను కూల్చాలని చెప్పలేదని గుర్తుచేశారు. ఆ తీర్పు వల్ల.. సాంకేతిక కారణాలతో, కోర్టు మధ్యంతర ఉత్తర్వులతో అనుమతులు పొందలేకపోయిన ప్రాజెక్టులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది కాబట్టి వనశక్తి తీర్పును రీకాల్ చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ అంశాన్ని తగిన బెంచ్ ముందుకు పంపించాలని ఆదేశించారు. కాగా.. ధర్మాసనంలోని మిగతా ఇద్దరి (మెజారిటీ) తీర్పుతో విభేదించిన ఉజ్జల్ భుయాన్.. ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరి అయిన ప్రాజెక్టులకు పోస్ట్ ఫ్యాక్టో అనుమతులు ఇవ్వకూడదని, కానీ పలు కేసుల్లో సుప్రీం ధర్మాసనాలు ఆ నిబంధనను అనుసరించకుండా తీర్పునిచ్చాయని పేర్కొన్నారు. "కాబట్టి అవి వాస్తవాలను, చట్టాలను పరిగణనలోకి తీసుకోకుండా ఇచ్చిన తీర్పులు. తర్వాత అలాంటి కేసులను విచారించే సమానస్థాయి ధర్మాసనాలు ఆ తీర్పులకు కట్టుబడాల్సిన అవసరం లేదు" అని ఆయన స్పష్టం చేశారు. అలాగే.. ప్రాజెక్టులను కూల్చివేయడం వల్ల కాలుష్యం మరింత పెరుగుతుందన్న వాదనను కూడా అంగీకరించకూడదని, ఉల్లంఘనలకు పాల్పడిన వారు తమ అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికి ఇలాంటి వాదనలను ముందుకు తెస్తారని ఆయన పేర్కొన్నారు.

లోకం తీరు



ప్రధాని ప్రసంగం విన్నందుకు సంతోషించా!

» మోదీ 'రాంనాథ్ గోయెంకా' స్మారక ఉపన్యాసంపై థరూర్ ప్రశంసల వర్షం

న్యూఢిల్లీ, నవంబరు 18: ప్రధాని మోదీపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ మరోసారి ప్రశంసలు కురిపించారు. ప్రధాని పాల్గొన్న ఓ సభకు తాను కూడా హాజరయ్యానని, ఆయన ప్రసంగం విన్న సభికులలో తానూ ఒకడిని అయినందుకు సంతోషిస్తున్నానని తెలిపారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో మోదీ రామ్‌నాథ్ గోయెంకా స్మారక ఉపన్యాసం ఇచ్చారు. ఈ సభకు శశిథరూర్ కూడా హాజరయ్యారు. దీనిపైనే ఆయన తాజాగా స్పందించారు. ఎల్లప్పుడూ ఎన్నికల మూడ్‌లోనే ఉంటానని తన మీద విమర్శలున్నాయని.. కానీ, తాను ప్రజల సమస్యలు పరిష్కరించే ఎమోషనల్(భావోద్వేగ) మూడ్‌లో ఉన్నానని మోదీ ఈ ఉపన్యాసంలో చెప్పారు. కాగా, "మోదీ ప్రసంగం ఆర్థిక దృక్కోణానికి, జాతిని ఆచరణలోకి దింపే సాంస్కృతిక పిలుపునకూ, దేశ ప్రగతి కోసం అవిరామంగా కృషి చేయాలనే దృఢదీక్షకు అద్దం పట్టింది" అంటూ శశిథరూర్ అభిప్రాయపడ్డారు. ఈ సభకు మాజీ కాంగ్రెస్ నేత గులాంనబీఆజాద్ కూడా హాజరై, థరూర్ పక్కనే కూర్చున్నారు.

అనిల్ అంబానీపై దాఖలైన పిల్‌పై 3 వారాల్లో జవాబివ్వండి: సుప్రీం

న్యూఢిల్లీ, నవంబరు 18: రిలయన్స్ అడాగ్ పరిశ్రమలు అక్రమాలకు పాల్పడుతున్నాయంటూ దాఖలైన పిల్‌పై సమాధానం ఇవ్వాలని సుప్రీంకోర్టు మంగళవారం కేంద్రం, సీబీఐ, ఈడీలకు నోటీసులు పంపించింది. ఆ గ్రూపు ఛైర్మన్ అనిల్ అంబానీతో పాటు, వివిధ కంపెనీలు అక్రమాలకు పాల్పడ్డాయని, న్యాయస్థానం పర్యవేక్షణలో విచారణ జరపాలని కోరుతూ కేంద్ర మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై 3 వారాల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

రాకెట్ దాడులకు కుట్ర

డ్రోన్లను పరీక్షించిన ఫరీదాబాద్ మాడ్యూల్

» అది విఫలమవటంతో కారు బాంబు దాడి



అల్ ఫలాహ్ వర్సిటీలో ఈడీ అధికారుల సోదాలు

న్యూఢిల్లీ, నవంబరు 18: ఫరీదాబాద్ వైట్ కాలర్ ఉగ్ర ముఠా దేశంలో కొత్త తరహా దాడులకు కుట్ర పన్నినట్లు ఎన్ఐఏ దర్యాప్తులో బయటపడింది. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద ఈ నెల 10న ఆత్మాహుతి దాడికి పాల్పడిన జైషే మహ్మద్ ఉగ్రవాది డాక్టర్ ఉమర్ నబీ అనుచరుడు జాసిర్ బిలాల్ వని అలియాస్ డానిష్‌ను అరెస్టు చేసి విచారించగా కుట్రలో కొత్తకోణం వెల్లడైంది. ఈ ఉగ్ర వైద్యుల ముఠా ఢిల్లీ, మరికొన్ని చోట్ల డ్రోన్ల ద్వారా రాకెట్ దాడులకు ప్రణాళిక వేసినట్లు జాసిర్ వెల్లడించాడు. గాజాలోని హమాస్ ఉగ్రవాద సంస్థ ఇజ్రాయెల్‌పై చేసే దాడులతో వీరు స్ఫూర్తి పొందినట్లు తెలిపాడు. ఢిల్లీలోని అత్యంత కీలకమైన ప్రాంతాల్లో రాకెట్ దాడులు చేసి మారణహోమం సృష్టించేందుకు వీరు కుట్ర చేసినట్లు వివరించాడు. అందుకోసం రాకెట్లు తయారుచేసి డ్రోన్లకు అమర్చి పేల్చే ప్రయోగాలు కూడా చేశారని, కానీ అవి విఫలమయ్యాయని వెల్లడించాడు. దీంతో కారు బాంబు దాడులు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపాడు.

దాడికి ముందే వీడియో రికార్డు

ఆత్మాహుతికి పాల్పడిన ఉగ్రవాది ఉమర్ నబీ.. ఆ దాడికి ముందే అల్ ఫలాహ్ యూనివర్సిటీలోని తన గదిలో రికార్డు చేసిన ఓ వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. ఆ వీడియోలో ఆత్మాహుతి దాడిని సమర్థిస్తూ నబీ మాట్లాడాడు. 'ఆత్మాహుతి దాడులను చాలామంది తప్పుగా అర్థం చేసుకుంటున్నారు. కానీ, అది సరైన పనే. ఆత్మాహుతి దాడి అమరత్వం పొందేందుకు చేసే ఆపరేషన్' అని ఆ వీడియోలో నబీ పేర్కొన్నాడు. ఇతడు జాసిర్ బిలాల్‌ను కూడా ఆత్మాహుతి దాడికి ఒప్పించినట్లు దర్యాప్తులో తేలింది. కాగా, అల్ ఫలాహ్ మెడికల్ కాలేజీలో కశ్మీరీ ఫ్యాకల్టీ అంతా కలిసి ఉగ్రవాద భావజాలాన్ని ఒక పద్ధతి ప్రకారం వ్యాపింపజేసినట్లు పోలీసులు వైద్యురాలు షహీన్ విచారణలో వెల్లడించింది. కాలేజీలో 70% ఫ్యాకల్టీ కశ్మీర్‌కు చెందినవారేనని, వీరంతా గ్రూప్‌గా ఏర్పడి ఇతర ఫ్యాకల్టీపై ఆధిపత్యం చెలాయించేవారని తేలింది.

అల్ ఫలాహ్ వర్సిటీ వ్యవస్థాపకుడి అరెస్ట్

అల్ ఫలాహ్ వర్సిటీ వ్యవస్థాపకుడు జావేద్ అహ్మద్ సిద్దిఖీని ఈడీ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద అతడిపై కేసు నమోదుచేసి, అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం అల్ ఫలాహ్ వర్సిటీతోపాటు జావేద్ నివాసంలోనూ ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. దాదాపు 9 షెల్ కంపెనీలు ఏర్పాటు చేసి ఆయన మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు.

'రిసిన్' నిందితుడిపై ఖైదీల దాడి

అహ్మదాబాద్, నవంబరు 18: ఉగ్రవాద చర్యల్లో భాగంగా మంచినీటిలో 'రిసిన్' అనే విష పదార్థాన్ని కలపడానికి ప్రయత్నించడాన్న అనుమానంపై అరెస్టయిన అహ్మద్ మొహియుద్దీన్ సయ్యద్‌పై సబర్మతి జైలులో దాడి జరిగినట్టు మంగళవారం అధికారులు తెలిపారు. గాయాలయినప్పటికీ ప్రమాదమేమీ లేదని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ఎంబీబీఎస్ వైద్యుడైన సయ్యద్‌ను ఈ నెల 8న గుజరాత్ ఏటీఎస్ అరెస్టు చేసింది. హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించిన అనంతరం రిసిన్‌ను స్వాధీనం చేసుకుంది. అనంతరం అత్యంత భద్రత ఉండే అహ్మదాబాద్‌లోని సబర్మతి సెంట్రల్ జైలుకు తరలించింది. ఆయనతో పాటు అనుమానితులుగా ఉన్న మరో ఇద్దర్ని కూడా అదే జైలులో ఉంచింది. అయితే ఏదో విషయమై జైలు లోపల ముగ్గురు ఖైదీలు ఆయనతో గొడవ పడి దాడి చేశారని జైలు సూపరింటెండెంట్ గౌరవ్ అగర్వాల్ చెప్పారు. ఆ దాడిలో ఆయనకు గాయాలయ్యాయని, వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించినట్టు తెలిపారు. తిరిగి జైలుకు తీసుకొచ్చామని చెప్పారు.

20 ఏళ్లు దాటిన వాహనాలకు భారీ ఫిట్‌నెస్ చార్జీలు

న్యూఢిల్లీ, నవంబరు 18: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షల ఫీజులను భారీగా పెంచింది. పాత వాహనాలను రోడ్ల మీదకు తెచ్చే విషయంలో ప్రజలను నిరుత్సాహపరిచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కొన్ని వాహనాలకు ఫీజులను ఏకంగా పదిరెట్లు పెంచారు. సోమవారం ఈ ఉత్తర్వులు విడుదల అయ్యాయి. గతంలో 15 ఏళ్లు దాటిన వాహనాలకే అధిక ఫిట్‌నెస్ ఛార్జీలు ఉండేవి. ఇప్పుడు దాన్ని పదేళ్లకు తగ్గించారు. గతంలో పదిహేనేళ్ల దాటిన అన్ని వాహనాలకు ఒకే రకమైన ఫిట్‌నెస్ ఛార్జీలు ఉండేవి. ఇప్పుడు 10-15, 15-20, 20+ వయసు వాహనాలుగా విభజించారు. 15 ఏళ్లలోపు వాహనాల ఫిట్‌నెస్ చార్జీలనూ పెంచారు. ద్విచక్ర వాహనాలకు రూ.400, లైట్ మోటార్ వాహనాలకు రూ.600, భారీ, మధ్యతరహా వాహనాలకు రూ.1,000 వసూలు చేయనున్నారు.

	10 ఏళ్ల లోపు	10-15	15-20	20+	
				పాత రేట్లు	కొత్తరేట్లు
భారీ వాణిజ్య వాహనాలు	రూ.1000	5000	12,500	రూ.2,500	రూ.25,000
మధ్యతరహా వాణిజ్య వాహనాలు	రూ.1000	1300	10,000	రూ.1,800	రూ.20,000
లైట్ మోటార్ వాహనాలు	రూ.600	1000	5,000	-	రూ.15,000
త్రిచక్ర వాహనాలు	రూ.600	800	3,000	-	రూ.7,000
ద్విచక్ర వాహనాలు	రూ.400	500	1,000	రూ.600	రూ.2,000



బాలికను న్యాయాధికారి సమక్షంలో ఇంటి నుంచి బయటికి తీసుకొస్తున్న ఐసీడీఎస్ అధికారులు

అమ్మ చేతిలోనే బందీగా!

» రెండేళ్లుగా కూతురిని చీకటి గదిలో నిర్బంధించిన తల్లి

ఇచ్ఛాపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తల్లి కారణంగా రెండేళ్లుగా చీకటి గదిలో బందీ అయిన 16ఏళ్ల బాలికకు స్థానిక న్యాయాధికారి, ఐసీడీఎస్ అధికారుల చొరవతో విముక్తి కలిగింది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో మంగళవారం ఈ ఘటన వెలుగుచూసింది. స్థానిక మహిళకు 2007లో కటక్‌కు చెందిన వ్యక్తితో వివాహమైంది. 2009లో పాపకు జన్మనిచ్చింది. కొన్నాళ్లకు ఆయన మృతి చెందటంతో మానసికంగా కుంగిపోయిన ఆమె ఇచ్ఛాపురంలోనే ఉండిపోయింది. ఆమెకు వచ్చే పింఛను సొమ్ముతో జీవనం సాగిస్తోంది. కూతురిని ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించింది. బాలిక 2022లో యుక్తవయసుకు రాగా, బయటికి పంపిస్తే ఏమైపోతోందనన్న భయంతో తల్లి ఆమెను చదువు మాన్పించేసి రెండేళ్లుగా ఇంట్లోనే బంధించినట్లు ఉంచేసింది. స్థానిక అంగన్వాడీ కార్యకర్తకు ఈ విషయం తెలియడంతో మంగళవారం ఐసీడీఎస్ పీవో ఎం.రాజేశ్వరికి సమాచారం ఇచ్చారు. ఆమె నుంచి సమాచారం అందుకున్న స్థానిక జూనియర్ సివిల్ న్యాయాధికారి పరీక్షకుమార్, తహసీల్దార్ వెంకటరావు తదితరులు బాధిత కుటుంబం ఇంటికి వెళ్లారు. చీకటి గదిలో ఉన్న వీరిద్దర్నీ చూసిన న్యాయాధికారి, ఇతర అధికారులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇద్దరి పరిస్థితీ బాగోలేకపోవడంతో బాలికను శ్రీకాకుళం స్టేట్ హోమ్‌కు, తల్లిని వైజాగ్ కేజీహెచ్‌కు తరలించారు.

కే కావేరీ బస్సు బీభత్సం

» ప్రమాదంలో 8 మందికి గాయాలు

» ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలో ఘటన

నందిగామ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల క్రితం కర్నూలు జిల్లాలో జరిగిన వీ కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాద ఘటన మరువకముందే కే కావేరి ట్రావెల్స్ బస్సు అలజడి రేపింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలో సోమవారం అర్ధరాత్రి ఈ ప్రమాదం జరిగింది. ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి దాని ముందున్న లారీని బలంగా ఢీకొట్టిన బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాదం జరిగే సమయానికి 28 మంది బస్సులో ఉన్నారు. బస్సు ఎడమభాగం చివరి సీటు వరకు నుజ్జునుజ్జుగా మారింది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగలేదు. ఒక్కసారిగా భారీ శబ్దం రావడంతో ప్రయాణికులు ఉలిక్కిపడి లేచి భయంతో హాహాకారాలు చేశారు. వెంటనే బస్సు డ్రైవర్ పారిపోయాడు. పోలీసులు వచ్చి ఒకదానిలో ఒకటి ఇరుక్కుపోయిన లారీ, బస్సు ను క్రేన్ సాయంతో విడదీశారు. క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిని శ్రీకాకుళం, విజయనగరం, ఒడిశాకు చెందిన వారుగా గుర్తించారు. సవరం నరేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



ప్రమాదం జరిగిన కావేరి బస్సు ముందు, ఎడమ భాగాలు

నేడు పుట్టపర్తికి ప్రధాని మోదీ

శ్రీసత్యసాయి శత జయంతి వేడుకలకు హాజరు

న్యూఢిల్లీ, పుట్టపర్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ బుధవారం పుట్టపర్తికి వస్తున్నారు. ప్రధానితోపాటు గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, దేశవిదేశాలకు చెందిన సత్యసాయిసేవా సంస్థల ప్రతినిధులు, సేవా, క్రీడా, వ్యాపార రంగ దిగ్గజాలు, సినీ, రాజకీయ ప్రముఖులు వేడుకలకు హాజరుకానున్నారు. టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ సచిన్ టెండూల్కర్, బాలీవుడ్ నటి ఐశ్వర్యరాయ్ సహా సుమారు 500 మంది వీవీఐపీలు శత జయంతి ఉత్సవాల్లో పాల్గొంటున్నారు. ప్రధాని ఉదయం 9.30కు పుట్టపర్తి విమానాశ్రయంలో దిగుతారు. రోడ్డు మార్గన పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయానికి చేరుకుని, 10 గంటలకు సత్యసాయి మహాసమాధిని దర్శించుకుంటారు. హిల్‌వ్యూ స్టేడియంలో నిర్వహించే సత్యసాయి శత జయంతి ఉత్సవాలకు వెళతారు. మధ్యాహ్నం 12.25కి పర్యటన ముగించుకుని, పుట్టపర్తి నుంచి తమిళనాడులోని కోయంబత్తూరుకు వెళ్తారు. సత్యసాయి శత జయంతిని పురస్కరించుకుని ఆయన స్మారక చిహ్నంగా రూపొందించిన రూ.100 నాణాన్ని, నాలుగు తపాళా బిళ్లలను ప్రధాని మోదీ ఆవిష్కరిస్తారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్, రాష్ట్ర మంత్రులు పాల్గొంటున్నారు.

తమిళనాడులో పీఎం కిసాన్ నిధుల విడుదల

పుట్టపర్తి నుంచి ప్రధాని నేరుగా కోయంబత్తూరుకు వెళ్తారు. అక్కడ దక్షిణ భారత ప్రకృతి వ్యవసాయంపై ఏర్పాటు చేసిన సదస్సును ప్రారంభిస్తారు. కార్యక్రమంలో భాగంగా, దేశవ్యాప్తంగా తొమ్మిది కోట్ల మంది రైతులకు సహాయాన్ని అందించేందుకు ఉద్దేశించిన 'పీఎం కిసాన్' 21వ వాయిదా కింద రూ.18,000 కోట్లకు పైగా నిధుల్ని మోదీ విడుదల చేస్తారు.



సచిన్ టెండూల్కర్‌తో లోకేశ్, పయ్యావుల, అనగాని

టెండూల్కర్‌ను కలిసిన మంత్రి లోకేశ్

» మహా సమాధిని దర్శించుకున్న ఐశ్వర్యారాయ్

పుట్టపర్తి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు టీం ఇండియా మాజీ కెప్టెన్ సచిన్ టెండూల్కర్, నటి ఐశ్వర్యా రాయ్, సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ పుట్టపర్తికి చేరుకున్నారు. అలాగే మంత్రులు లోకేశ్, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్ మంగళవారం సాయంత్రం పుట్టపర్తికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రశాంతి నిలయంలో సచిన్ టెండూల్కర్‌ను లోకేశ్, మంత్రులు కలిసి.. కాసేపు ముచ్చటించారు. మాజీ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణను మంత్రులు లోకేశ్, పయ్యావుల, అనగాని మర్యాదపూర్వకంగా కలిశారు. నటి ఐశ్వర్యారాయ్ సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు

వైసీపీ నేత కారుమూరి వెంకటరెడ్డి అరెస్ట్

హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు



తాడిపత్రి/గుంతకల్లు/కేపీహెచ్‌బీకాలనీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో వైసీపీ అధికార ప్రతినిధి కారుమూరి వెంకటరెడ్డిని అనంతపురం జిల్లా తాడిపత్రి పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఆయన ఇంటిలో మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. టీటీడీ మాజీ ఏవీఎస్ఓ సతీశ్ కుమార్ అనుమానాస్పద మృతిపై వెంకటరెడ్డి సోషల్ మీడియాలో పలు విమర్శలు చేశారు. ఇది ప్రభుత్వ హత్య అని ఆరోపించారు. ఆయన రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని తాడిపత్రి టీడీపీ నేత చింబిలి ప్రసాద్‌నాయుడు ఫిర్యాదు మేరకు తాడిపత్రి రూరల్ పోలీసులు వెంకటరెడ్డిపై కేసు నమోదు చేశారు. తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి సిబ్బంది హైదరాబాదులో అరెస్టు చేసిన సందర్భంగా వెంకటరెడ్డి గట్టిగా ప్రతిఘటించారని, బాత్రూమ్‌లోకి వెళ్లి హార్పిక్ డబ్బా తెచ్చుకుని అది తాగి చనిపోతానంటూ బెదిరించారని తెలిసింది. అయినా పోలీసులు వెనక్కితగ్గకపోవడంతో అరగంట తర్వాత వెంకటరెడ్డి లొంగిపోయినట్లు సమాచారం. తన భర్తను గుర్తుతెలియని వ్యక్తులు తీసుకెళ్లారని వెంకటరెడ్డి భార్య హరిత కూకట్‌పల్లి పోలీసులను ఆశ్రయించారు. కాగా, వెంకటరెడ్డిని మంగళవారం రాత్రి తాడిపత్రి జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా, న్యాయాధికారి ఆయనకు బెయిల్ మంజూరు చేశారు.

600 కోట్లతో 24 క్రిటికల్ కేర్ బ్లాకులు

అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం కొవిడ్ విరుచుకుపడినప్పుడు క్రిటికల్ కేర్ చికిత్సకు ప్రత్యేక బ్లాకులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. భవిష్యత్తులో ఇలాంటి పరిసితులు తలెత్తకుండా ఉండేందుకు దేశవ్యాప్తంగా 621 క్రిటికల్ కేర్ బ్లాకుల (సీసీబీ) నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ రూ.600 కోట్లతో 24 సీసీబీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎంఏబీమ్) కింద నిధులు కేటాయించి, విడతల వారీగా వీటి నిర్మాణాన్ని చేపట్టేందుకు సిద్ధమైంది.

వేగంగా నిర్మాణాలు..: మంత్రి సత్యకుమార్

కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించే సీసీబీలను వీలైనంత త్వరగా పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం తెలిపారు. డిసెంబరు నెలాఖరుకి 13 సీసీబీలు, 2026 ఆగస్టు నాటికి మరో 11 సీసీబీలను వినియోగంలోనికి తెస్తామని చెప్పారు. క్రిటికల్ కేర్ బ్లాకుల నిర్మాణాల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

తొలి మూడు రోజులూ ఈ-డిప్‌లోనే

- మిగిలిన ఏడు రోజులూ నేరుగా దర్శనాలు
- డిసెంబరు 30 నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు
- టీటీడీ బోర్డు నిర్ణయాలు వెల్లడించిన చైర్మన్

తిరుమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాల తొలి మూడురోజులకు టోకెన్లను ఆన్‌లైన్‌లో కేటాయించాలని టీటీడీ నిర్ణయించింది. తిరుమలలో మంగళవారం జరిగిన టీటీడీ ధర్మకర్తల మండలి అత్యవసర సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ మూడు రోజులూ టోకెన్లను ఈ-డిప్ ద్వారా ఆన్‌లైన్‌లో కేటాయిస్తారు. మిగిలిన ఏడు రోజులూ భక్తులు నేరుగా తిరుమలకు చేరుకుని వైకుంఠ ద్వార దర్శనాలు చేసుకోవచ్చు. ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులతో కలిసి టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. డిసెంబరు 30 నుంచి జనవరి 8 వరకు పదిరోజుల పాటు తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనాలు ఉంటాయి. గతంలో తిరుపతి, తిరుమలలో ఏర్పాటు చేసే కౌంటర్లలో ముందు రోజు నుంచీ వైకుంఠ ద్వార దర్శనాల టోకెన్లు కేటాయించేవారు. తొలి రెండు రోజుల టికెట్ల కోసం విపరీతమైన ఒత్తిడి ఉంటుంది. గతేడాది తిరుపతి బైరాగిపట్టెడ కౌంటర్ల వద్ద క్యూలైన్‌లో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడంతో ఈసారి అటువంటి సంఘటనలకు తావీయకుండా ఆన్‌లైన్‌లోనే తొలి మూడు రోజుల టోకెన్లు జారీ చేయాలని నిర్ణయించారు.

సామాన్యులకు అధిక ప్రాధాన్యం

సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఈసారి సామాన్య భక్తులకే వైకుంఠ ద్వార దర్శనాల్లో పెద్దపీట వేసేలా నిర్ణయాలు తీసుకున్నట్టు బీఆర్ నాయుడు తెలిపారు. పదిరోజుల పాటు వైకుంఠ ద్వారదర్శనాలకు 182 గంటల సమయం ఉంటుందని, అందులో 164 గంటలు సామాన్య భక్తులకే కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ పది రోజుల్లో దాదాపు 8 లక్షల మందికి వైకుంఠ ద్వార దర్శనం కల్పించేలా ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. గంటకు 4,300 నుంచి 4,700 మందికి దర్శనం చేయించేలా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. తొలి మూడు రోజుల దర్శనాల టోకెన్ల కోసం భక్తులు నవంబరు 27 నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు టీటీడీ వెబ్‌సైట్, మొబైల్ యాప్, వాట్సాప్ ద్వారా తెలుగు, తమిళం, కన్నడ, ఇంగ్లీష్, హిందీ భాషల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. డిసెంబరు 2న డిప్‌లో ఎంపికైన వారికి సమాచారాన్ని పంపుతారు. తొలి మూడురోజులు దర్శన టోకెన్లు ఉన్నవారు మాత్రమే తిరుమలకు రావాలని చైర్మన్ విజ్ఞప్తి చేశారు. కాగా.. అమరావతిలోని శ్రీవారి ఆలయం రెండో ప్రాకార నిర్మాణానికి సీఎం చేతుల మీదుగా ఈ నెల 27వ తేదీన భూమి పూజ జరుగుతుందని తెలిపారు.



టీటీడీ బోర్డు నిర్ణయాలను మీడియాకు వివరిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

బోర్డు నిర్ణయాలు

- వైకుంఠ ద్వార దర్శనాల తొలి మూడురోజులూ శ్రీవాణీతో పాటు, రూ.300 ప్రత్యేక దర్శనాలు రద్దు
- పది రోజుల పాటు ఆర్జితసేవలు, ప్రత్యేక దర్శనాలు రద్దు.స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు మాత్రమే వీఐపీ బ్రేక్ దర్శనాలు
- వాట్సాప్ ద్వారా టోకెన్లు బుక్ చేసుకునేందుకు ప్రత్యేక అప్షన్లు అందుబాటులోకి తెచ్చి సులువుగా నమోదు చేసుకునేలా ఏర్పాట్లు
- వైకుంఠ ఏకాదశి రోజున 70 వేలు, ద్వాదశి రోజున 75 వేలు, ఆంగ్ల సంవత్సరం తొలి రోజు 68 వేల మందికి దర్శనం అవకాశం
- జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు రూ.300 టికెట్లు 15 వేలు, శ్రీవాణి ట్రస్టు దాతలకు వెయ్యి చొప్పున టికెట్లు కేటాయిస్తూ నిర్ణయం.

ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల సంఘం నూతన కార్యవర్గం

అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఐనకోయి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా గ్రంధి సత్యనారాయణ, కోశాధికారిగా గద్దె రాజలింగం, ఉపాధ్యక్షులుగా కేవీ సుబ్బారెడ్డి, ప్రగతి కృష్ణారావు, వీవీ నాగేశ్వరరావు, కార్యదర్శులుగా కేవీవీ సత్యనారాయణ, ఎస్.వెంకట రామిరెడ్డి, ఎన్‌వీ రమణారెడ్డి ఎన్నికయ్యారు.



పత్తి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు

- ఇప్పటి వరకూ 56.59 కోట్ల విలువైన పత్తి కొనుగోళ్లు: మంత్రి అచ్చెన్న

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 'పత్తి రైతుకు పూర్తి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. పత్తి రైతుల ఇబ్బందులను పరిష్కరించాలని ఇటీవల నేను రాసిన లేఖపై కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ సానుకూలంగా స్పందించారు' అని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన చేశారు. 'ఎల్ 1, 2, 3 జిన్నింగ్ మిల్లులు ఒకేసారి ప్రారంభించడం, 12-18 శాతం వరకు తేమ ఉన్న పత్తిని అనుపాత తగ్గింపుతో కొనుగోలు చేయడం, వర్షాలకు తడిసి, రంగు మారిన పత్తిని తగిన ధరలతో కొనుగోలు చేసే అంశాలపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చాం. రైతు సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు కృషి చేస్తాం. పత్తి కొనుగోలుపై పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్లు, క్షేత్రస్థాయిలో మార్కెటింగ్ అధికారులతో కమిటీలు నియమించాం. రాష్ట్రంలో 11 మార్కెట్ యార్డులు, 64 జిన్నింగ్ మిల్లులను పత్తి కొనుగోలు కేంద్రాలుగా ప్రకటించగా, ఇప్పటి వరకు 19 జిన్నింగ్ మిల్లుల ద్వారా రూ.56.59 కోట్ల విలువైన 72,240 క్వింటాళ్ల పత్తిని 2,793 మంది రైతుల నుంచి కొనుగోలు చేశాం' అని మంత్రి అచ్చెన్న పేర్కొన్నారు.

క్వింటా పత్తికి రూ.3 వేలు బోనస్ ప్రకటించాలి

- అఖిల భారత కిసాన్ సభ

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): క్వింటా పత్తికి రూ.12 వేలు చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో క్వింటాకు రూ.3 వేలు బోనస్ ప్రకటించాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షుడు రాజన్ క్షీరసాగర్, ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా ఆదోనిలో మంగళవారం జరిగిన రాష్ట్ర స్థాయి పత్తి రైతుల సమ్మేళనంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో పత్తి రైతులు అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తంచేశారు. సీసీఐ 11 కింటాళ్లు కొంటామని మాట ఇచ్చి కేవలం 7 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేయడం దారుణమన్నారు.

కూటమి నిర్లక్ష్యంతో పత్తి రైతుకు దుఃఖం: షర్మిల

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం పత్తి రైతుకు దుఃఖాన్ని మిగిల్చింది. మొక్కజొన్న రైతు రెక్కలు విరిచింది' అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. మద్దతు ధరలేక రాష్ట్రంలో పత్తి, మొక్కజొన్న రైతులు విలవిల్లాడుతున్నారని మంగళవారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు.

తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు నైతిక బోధనలు

- వచ్చే వేసవి నుంచి 'సద్గమయ' పేరుతో అమలు
- హెచ్‌డీపీపీ కమిటీ సమావేశంలో టీటీడీ నిర్ణయం

తిరుమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని 8, 9, 10వ తరగతి విద్యార్థులకు 'సద్గమయ' అనే కార్యక్రమం ద్వారా నైతిక విలువలు, మానవీయ ధర్మాలు, వ్యక్తిత్వ నిర్మాణం కోసం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని టీటీడీ నిర్ణయించింది. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రానున్న వేసవిలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుడుతారు. తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రత్యేక సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. అఖండ హరినామ సంకీర్తనలకు రిజిస్టర్ అయిన 7,856 భజన బృందాలు నైపుణ్యాన్ని పరిశీలించి జిల్లా స్థాయిలో భజన ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని కూడా నిర్ణయించారు.

తిరుమలకు చేరిన స్టేట్ ఫుడ్ లాబొరేటరీ పరికరాలు


తిరుమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): భక్తులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక ల్యాబ్‌ను తిరుమలలో ఏర్పాటు చేసేందుకు నిర్ణయించిన విషయం తెలిసిందే. స్టేట్ ఫుడ్ లాబొరేటరీ ఏర్పాటుకు కేంద్రం రూ.19.84 కోట్లు కేటాయిస్తూ మే నెలలో నిర్ణయం తీసుకోగా, ఇప్పటికే తిరుమలలోని టీటీడీ మార్కెటింగ్ గోదాము ఎదురుగా ఉన్న ఫ్లోర్ మిల్లు ప్రాంగణంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ద్వారా ల్యాబ్ సివిల్ పనులన్నీ పూర్తయ్యాయి. కాగా, యంత్రాలు కూడా దాదాపుగా అన్ని తిరుమలకు చేరుకున్నాయి. ఇందులో ప్రధానంగా రూ.6.50 కోట్లతో బేసిక్ మిషనరీ, శాంపిల్ ప్రిపరేషన్ ఫ్యాకెల్టీ, రూ.8.46 కోట్లతో ఆధునాతన పరికరాలు, రూ.4.28 కోట్లతో మైక్రో బయోలాజికల్ ల్యాబోరేటరీ, రూ.30 లక్షలతో 250 కేవీ జనరేటర్, మరో రూ.30 లక్షలతో విద్యుత్ కనెక్షన్ కోసం కేటాయించారు.

పోటు వర్కర్ల పేరు మార్పు

తిరుమల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): లడ్డూలు, అన్నప్రసాదాలు తయారుచేసే శ్రీవారి ఆలయ పోటు సూపర్‌వైజర్లు, పోటు వర్కర్లను ఇక నుంచి 'ముఖ్య పాచక', 'పాచక' అనే పేర్లతోనే సంబోధించాల్సి ఉంటుంది. పోటు వర్కర్ల కోరిక మేరకు టీటీడీ బోర్డు ఈ మేరకు తీర్మానం చేసింది.

టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.2 కోట్ల విరాళం

టీటీడీ బర్డ్ ట్రస్టుకు మంగళవారం రూ.రెండు కోట్లు విరాళంగా అందింది. ఈ విరాళం డీడీని హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చైర్‌పర్సన్ రోషణి నాడర్ టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందించారు.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

భయపెడుతున్న మౌనం

దేశంలో గో రక్షకుల ఉన్మాదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన మహమ్మద్ అఖ్లాఖ్ హత్యకేసులో నిందితులందరిపైనా ఆరోపణలు ఉపసంహరించుకోవాలని యోగి ఆదిత్యనాథ్ ఏలుబడిలో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. గ్రేటర్ నోయిడా పరిధిలోని బిసహాడ గ్రామానికి చెందిన యాభైరెండేళ్ళ ఆ వృద్ధుడి మూక హత్య జరిగిన దశాబ్దం తరువాత, అతడిని కొట్టిచంపిన వారిమీద అప్పట్లో పెట్టిన అన్ని ఆరోపణలనూ ప్రభుత్వం వెనక్కుతీసుకుంటున్నట్టు స్థానిక సెషన్స్‌కోర్టులో దరఖాస్తు దాఖలైంది. ఆగస్టు 26న తయారైన ఆదేశాలను గవర్నర్ ఇప్పటికే అనుమతించిన మేరకు ప్రభుత్వ న్యాయవాది కోర్టులో ఈ అభ్యర్థన దాఖలు చేశారు. దేశాన్ని కుదిపేసిన ఈ దారుణానికి అక్కడి బీజేపీ నాయకుడి కుమారుడు నాయకత్వం వహించాడు. ఈ వర్థమాన రాజకీయనాయకుడి ఆధ్వర్యంలో అఖ్లాఖ్ ఇంటి సమీపంలో నివసిస్తూండేవారే ఈ ఘోరానికి పాల్పడ్డారు. ఘటన జరిగిన రెండుమూడేళ్ళలోనే నిందితులంతా బయటకు వచ్చేసి, పదేళ్ళుగా నత్తనడకనసాగుతూ నామమాత్రంగా మిగిలిన ఈ కేసుమీద యోగి ప్రభుత్వం సమ్మెటదెబ్బ వేసింది.

ఇంతకూ యూపీ ప్రభుత్వం ఏ కారణాలతో ఈ కేసు ఉపసంహరించుకుంది? అఖ్లాఖ్ కుటుంబం చీటికీమాటికీ తన వాదనలూ సమాధానాలూ మార్చేస్తోందట. పోనీ, నిందితులు మారణాయుధాలతో దాడి చేశారా? కానేకాదు. బాధితుడికీ, నిందితులకు మధ్య పాతకక్షలున్నాయా? లేనేలేవు. వీరంతా దశాబ్దాలుగా సయోధ్యతో ఉన్నవారే. ఈ యువ గోరక్షకులు ఎక్కడపడితే అక్కడ తంతూవుంటే, అందివచ్చినవాటిని ఆయుధాలుగా వాడి శరీరాన్ని చీల్చేస్తూంటే, పుటుక్కున ప్రాణాలు వదిలేసిన ఆ ముసలి ముసల్మాన్‌తో వీరెవ్వరికీ కక్షలూ, కార్పణ్యాలూ లేవు. అందువల్ల, ఇంతటి బలమైన కారణాలు ఉండగా కేసు ఇంకా కొనసాగించడమేమిటని యోగి ప్రభుత్వం అనుకుంది. నిందితులమీద పెట్టిన హత్య, హత్యాయత్నం వంటివే కాదు, తీవ్రంగా గాయపరచడం, భౌతికదాడితో అవమానించడం, నేరపూరిత బెదిరింపు ఇత్యాది అనేకానేక సెక్షన్లు కూడా ఎత్తివేస్తేనే తగిన న్యాయం చేసినట్టవుతుందని యోగి ప్రభుత్వం భావించింది. పకడ్బందీగా పెద్దతలకాయలందరి సంతకాలతో, 321వ సెక్షన్ వాడుకొని పూర్తిగా కేసుమూసేయడానికి సిద్ధపడింది.

గోవును చంపి, మాంసాన్ని తెచ్చి అఖ్లాఖ్ తన ఫ్రిజ్‌లో దాచుకున్నాడన్న వాదనతో అతడినీ, కుమారుడినీ ఈ మూక ఇంట్లోనుంచి బయటకు లాగి కొట్టడం ఆరంభించింది. వారు దాడికి ఉపక్రమించగానే, అక్కడే ఉన్న గుడి లౌడ్‌స్పీకర్ ద్వారా అఖ్లాఖ్ గోహత్యకు పాల్పడ్డాడంటూ అదేపనిగా ప్రచారం కొనసాగింది. ఓ ఇరవైమంది మంద, అడ్డేవారూ ఆపేవారూ లేకుండా యథేచ్ఛగా సంహారాన్ని కొనసాగించింది. పదేళ్ళక్రితం అఖ్లాఖ్ హత్య జరగ్గానే కదిలిపోయి, రగిలిపోయిన దేశం, ఇప్పుడు కేసు ఉపసంహరణ నిర్ణయంమీద మౌనంగా ఉండిపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. మూకదాడులు, అసహనం, గోమాంసం ఇత్యాది అంశాలమీద ప్రజాక్షేత్రంలో చర్చలు, మీడియా చానెళ్ళలో వాదోపవాదాలు సాగడమే కాదు, 'నాట్ ఇన్ మై నేమ్' తరహా ర్యాలీలు, అవార్డు వాపసీలతో దేశం కదిలిపోయింది. అన్ని రంగాలకు చెందిన మేధావులు, బాలీవుడ్ నటులు గళం విప్పారు. టెలివిజన్ చానెళ్ళు ఆగ్రహంతో ఊగిపోయాయి. ప్రధాని కాస్తంత ఆలస్యంగానే అయినా, విచారం వెలిబుచ్చవలసి వచ్చింది. గోరక్షణ పేరిట ముస్లింలను లక్ష్యంగా చేసుకొనే ఇటువంటి దాడులను నియంత్రించనిపక్షంలో ఈ ఉన్మాదానికి అడ్డూఆపూ ఉండబోదన్న హెచ్చరికలు ఆ తరువాత అనేకసార్లు నిజమైనాయి. వెలిసిపోయిన పాస్‌పోర్టు సైజ్ ఫోటోలో అమాయకంగా కనిపించే అఖ్లాఖ్ మొఖం మతోన్మాదానికీ, మూకదాడులకూ ప్రతీకగా మిగిలిపోయింది. అఖ్లాఖ్ మరణం నిజం కాదా? ఆ వృద్ధుడు వీరి చేతుల్లో మరణించలేదని యోగి ప్రభుత్వం అంటోందా? వంటి ప్రశ్నలకు సమాధానాలు ఉండవు. కానీ, అఖ్లాఖ్ కుటుంబానికి కనీస న్యాయం కాదు, ఘోరమైన అవమానం, అన్యాయం చేసినా నేటి సమాజం తమను నిలదీయదన్న ధైర్యం ఈ పదేళ్ళలో పాలకులకు బాగా ఒంటబట్టిందని అర్థం.

విపక్షాల దౌర్బల్యమే మోదీ విజయం



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'మీరు బిహార్‌లో ఎన్నికల కవరేజ్‌కు వెళ్లి పెద్దగా ఉపయోగం ఉండకపోవచ్చు. అక్కడ ఎన్డీఏ అధికారంలోకి రావడం ఖాయం' అని ఎన్నికల షెడ్యూలు ప్రకటించకముందే ఒక సీనియర్ జర్నలిస్టు సలహా ఇచ్చారు. ఆయన ఏ ఉద్దేశంతో ఈ సలహా ఇచ్చారో కానీ దేశంలోని పరిస్థితులు చూస్తుంటే ప్రధాని మోదీకి దేశ రాజకీయాల్లో తిరుగులేదనే అభిప్రాయం చాలా మందిలో నెలకొని ఉన్నదని తెలుస్తోంది. మోదీకి మించిన, బలమైన నాయకుడు ఇతర పార్టీల్లో లేకపోవడం మాత్రమే కాదు, భారతీయ జనతా పార్టీకున్న ఎన్నికల యంత్రాంగం, పటిష్ఠ వ్యూహరచన చేసే శక్తి, కింది స్థాయి నుంచి పరిస్థితులను అధ్యయనం చేసి అవసరమైన చర్యలు తీసుకోగల నిశిత దృష్టి, అన్నిటినీ మించి వ్యవస్థలపై ఉన్న పట్టు మూలంగా కమలనాథులను ఓడించడం కాంగ్రెస్‌కు, ఇతర పార్టీలకు సాధ్యం కాదేమోనన్న అంచనా చాలా మందికి ఉన్నది.

అయినప్పటికీ బిహార్‌లో ఫలితాలు భిన్నంగా ఉండవచ్చునేమో అన్న ఆశలు బీజేపీ వ్యతిరేకులకు చివరివరకూ మిణుకుమిణుకుమంటూనే ఉన్నాయి. దాదాపు 20 ఏళ్లు నితీశ్‌కుమార్ ముఖ్యమంత్రిగా ఉండడం, బీజేపీకి స్థానిక నాయకుడంటూ లేకపోవడం మాత్రమే కాదు, ఎన్నికల కమిషన్ అక్రమాలు చేస్తున్నదన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రతిపక్షాలు ఉధృతంగా ప్రయత్నం చేయడం, బలహీనవర్గాలకు మోదీ వ్యతిరేకమని, రాజ్యాంగాన్ని తుంగలో తొక్కుతున్నారనే ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు తీవ్రయత్నాలు చేయడం మూలంగా ప్రతిపక్షాలు పుంజుకోవచ్చుననే అభిప్రాయం చాలా మంది వ్యక్తం చేశారు. ముఖ్యంగా రాహుల్‌గాంధీ, తేజస్వి యాదవ్ ఇద్దరూ చేపట్టిన ఓటర్ అధికార యాత్రకు భారీ ఎత్తున ప్రతిస్పందన లభించింది. ఒక లక్ష్యం ప్రకారం గ్రామీణ, సెమీ అర్బన్ ఏరియాలో ఈ యాత్రను చేపట్టారు. గయాలో తొక్కిసలాటలో ఒక యువకుడు కూడా మరణించాడు. ముఖ్యంగా సీమాంచల్‌లో రాహుల్ యాత్ర అన్ని రికార్డులను అధిగమించి 2 లక్షలకు పైగా జనాన్ని ఆకర్షించింది. ఎన్నికల ప్రచార సమయంలో కూడా రాహుల్, ప్రియాంక, తేజస్వి సభలకు జనం పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

'బహిరంగ సభలకు, యాత్రలకు జనం పెద్ద సంఖ్యలో హాజరు కావడం, హాజరైన జనం ఓటర్లుగా మారడం అనేది ఒకటి కాదు' అనేది చరిత్రలో అనేకసార్లు రుజువైంది. 1994లో పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పాల్గొన్న ఏలూరు సభకు లక్షలాది మంది హాజరయ్యారు. కానీ ఆశ్చర్యకరమేమంటే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కేవలం 26 సీట్లు రాగా, తెలుగుదేశం 216 సీట్లు గెలుచుకుంది. కాంగ్రెస్ కంటే వామపక్షాలకు ఎక్కువ(34) సీట్లు లభించాయి. 1977లో ఎమర్జెన్సీ అనంతరం ఉమ్మడి బిహార్‌లో జరిగిన ఎన్నికల్లో ఇందిరాగాంధీ రాష్ట్రంలో ఎక్కడకు వెళ్లినా పెద్ద సంఖ్యలో జనం ఆమెకు నీరాజనాలు పట్టారు. కానీ ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ బిహార్‌లో అప్పుడున్న మొత్తం 54 సీట్లను కోల్పోయింది. ఈ రెండు సంఘటనలతో పాటు రాహుల్ సభలకు పెద్ద సంఖ్యలో జనం రావడాన్ని బట్టి రెండు అంచనాలకు రావచ్చని స్పష్టమవుతోంది. ప్రజా వ్యతిరేకత అనేది ఉంటే అది పైకి కనపడకుండా చాప కింద నీరు లాగా పాకుతుంది. ఇందిరాగాంధీ, పీవీ నరసింహారావు ఇద్దరూ కాంగ్రెస్ పట్ల ప్రజా వ్యతిరేకతను కనిపెట్టలేకపోయారు. ప్రభుత్వంపై ప్రజావ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకోవడంలో రాహుల్ విఫలమయ్యారు. 2014లో ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ జనం నాడిని పసిగట్టి అందుకు తగ్గ వ్యూహరచన చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమవుతోంది. ప్రతికూల అంశాలను కూడా మోదీ అనుకూలంగా మార్చుకోగలిగితే, అనుకూల అంశాలను కూడా రాహుల్ వ్యతిరేకంగా మార్చుకుంటున్నారేమో!

ఆశ్చర్యమేమంటే, రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ సభలకు పెద్ద సంఖ్యలో జనం వచ్చిన నియోజకవర్గాలన్నిటిలోనూ కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోయింది. కాంగ్రెస్ గెలిచిన ఆరు సీట్లలో మూడు సీట్లు అతి స్వల్ప మెజారిటీతో గెలిచింది. కాంగ్రెస్ 5 సీట్లలోనూ, ఆర్‌జేడీ ఒక సీటులోనూ డిపాజిట్ కోల్పోగా ఎన్డీఏ ఎక్కడా డిపాజిట్ కోల్పోకపోవడం గమనార్హం.

ఒక యంత్రాంగం అంటూ లేకపోవడం వల్ల కాంగ్రెస్ ఓడిపోయింది. కానీ ఆర్‌జేడీ ఘోర వైఫల్యమే బిహార్ ఎన్నికల్లో అన్నిటికంటే విడ్డూరమైన విషయం. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్‌జేడీ అన్ని పార్టీల కంటే ఎక్కువగా– అంటే 75 సీట్లు గెలుచుకుంది. ఈసారి తన సీట్లు తప్పకుండా పెంచుకుంటుందని చాలా మంది ఆశించారు. బిహార్‌లో మండల్ రాజకీయాల్లో బలమైన పునాది ఉన్న రాష్ట్రీయ జనతాదళ్ 143 సీట్లలో పోటీ చేసి కేవలం 25 సీట్లు మాత్రమే గెలుచుకోవడానికి కారణం ఏమిటి? ఆర్‌జేడీకి ప్రధాన ఓటు బ్యాంక్ అయిన యాదవులకూ, ఇతర అత్యంత వెనుకబడిన సామాజిక వర్గాలు, మహిళలు, దళితులకూ మధ్య వైరుధ్యం ఈ ఎన్నికల్లో కొట్టొచ్చినట్లు కనపడిందని ఒక విశ్లేషకుడు తెలిపారు. యాదవులకు 37 శాతం సీట్లిచ్చి, అత్యంత వెనుకబడిన వర్గాలకు కేవలం 11 శాతం సీట్లు ఇవ్వడం వల్ల ఆర్‌జేడీ కొత్త సామాజిక పునాదిని ఏర్పర్చుకోలేకపోయిందని ఆయన చెప్పారు. తన సొంత కుటుంబంలోని లుకలుకలనే ఆర్‌జేడీ పరిష్కరించుకోలేకపోయింది. ఆర్‌జేడీ తన వైఫల్యానికి గతంలో లాగా కాంగ్రెస్ వంటి మిత్రపక్షాలను నిందించేందుకు వీలు లేకుండా పోయింది. తాను పోటీ చేసిన సీట్లలో నాలుగోవంతు కూడా గెలుచుకోలేనప్పుడు ఇతరులను నిందించి అర్థం లేదు.

> ఎన్డీఏ 200కు పైగా సీట్లను గెలుచుకుంటుందని, ఓట్ల లెక్కింపు మొదటి దశ నుంచీ ఆధిక్యత కనబరుస్తుందని ఏ పరిశీలకుడూ ఊహించలేదు. బిహార్ ఎన్నికల్లో విజయం సాధించి, తన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి, తనపై ఇంటా బయటా వస్తున్న విమర్శలను తిప్పికొట్టి అజేయుడుగా మారడానికి మోదీ ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నిస్తారన్న విషయం కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలకు తెలుసు. అయినా బీజేపీ వ్యూహాల్ని అంచనా వేయడంలోను, తమ పార్టీలను పటిష్ఠంగా మార్చుకోవడంలోనూ విపక్షాలు విఫలమయ్యాయి.


ఇంకా ఆశ్చర్యకరమయిన విషయం ఏమంటే దేశంలో ఎన్నో పార్టీల తరఫున వ్యూహకర్తగా పనిచేసిన ప్రశాంత్ కిశోర్ స్వయంగా పార్టీ పెట్టి, గత ఏడాది కాలంగా జనం మధ్యలో తిరగడం ప్రారంభించారు. అనేకమంది మాజీ బ్యూరోక్రాట్లు, మేధావులకు టిక్కెట్లు ఇచ్చారు. ఆయన సభలకు కూడా జనం భారీగా హాజరయ్యారు. ఇంతకాలం తాను పార్టీల నుంచి వసూలు చేసిన కోట్లాది రూపాయలను ఆయన విచ్చలవిడిగా ఖర్చు పెట్టారు. బిహార్‌లో జన ప్రభంజనం వీస్తుందని, బొటాబొటి మెజారిటీ వచ్చినా అది తన ఓటమిగానే భావిస్తానని ఆయన చెప్పుకున్నారు. కానీ ఆయన మాటలన్నీ ప్రగల్భాలుగా మిగిలిపోయాయి. ఆయన స్థాపించిన 'జన సురాజ్ పార్టీ' 238 స్థానాల్లో పోటీ చేస్తే 236 స్థానాల్లో డిపాజిట్ కోల్పోయింది. రాజకీయ పార్టీలు ఎంతవరకు ఇలాంటి వ్యూహకర్తలను నమ్మాలో గ్రహించేందుకు ప్రశాంత్ కిశోర్ ఘోర వైఫల్యం ఒక ఉదాహరణ.

ప్రశాంత్ కిశోర్ మాత్రమే కాదు, మహాగఠ్ బంధన్‌లో ఉన్న అన్ని పార్టీలు గతంలో కంటే ఘోరంగా పరాజయం పొందడానికి రకరకాల కారణాలు చెబుతున్నారు. మండల్ రాజకీయాలకు నెలవైన బిహార్‌లో ఎవరూ ఊహించలేని మార్పు జరుగుతున్నదని కొందరు పరిశీలకులు భావిస్తున్నారు. అది బీజేపీ సీట్ల సంఖ్య ఈసారి గతంలో కంటే ఎక్కువ పెరగడమే కాక, బీజేపీతో చేతులు కలిపిన పార్టీలు కూడా తమ సంఖ్యా బలాన్ని పెంచుకోవడం కూడా. బీజేపీ హిందుత్వ రాజకీయాలు బిహార్‌లోనూ ప్రభావం చూపుతున్నాయని ఒక విశ్లేషకుడు అంటే, ప్రజలు మోదీ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధికి స్వాగతం పలుకుతున్నారని ఎన్డీఏ భాగస్వామి పక్షమైన తెలుగుదేశం అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశ్లేషించారు. ఏమైనా బిహార్‌లో బీజేపీ సారథ్యంలో ఎన్డీఏ విజయం సాధించడం దేశ రాజకీయాల తీరుతెన్నులపై ప్రభావం చూపక తప్పదు.

ప్రతిపక్ష కూటమిలో మొదటి నుంచి పొడజూపిన అంతర్గత వైరుధ్యాలు కూడా ఈ ఫలితాలకు దారితీసి ఉండవచ్చు. ఓటర్ అధికార యాత్ర ద్వారా ప్రదర్శించిన వాపును బలుపుగా మార్చుకోవడంలో కాంగ్రెస్, ఆర్‌జేడీ విఫలమయ్యాయి. సీట్ల సర్దుబాటులో రెండు పార్టీలు చివరి వరకు ఘర్షించడం, స్నేహపూర్వక పోటీ పేరుతో దాదాపు 10 సీట్లలో కాంగ్రెస్ మిత్రపక్షాలతో తలపడడం, ముఖ్యమంత్రి అభ్యర్థి పేరును ప్రకటించడంపై అభ్యంతరాలు వ్యక్తం చేయడం, ఉమ్మడి మేనిఫెస్టో విడుదలకు రాహుల్‌గాంధీ హాజరుకాకపోవడం, ఆర్‌జేడీపై లాలూ హయాంలో పడ్డ జంగిల్ రాజ్ ప్రభావం ప్రజలు మరచిపోకపోవడం లాంటి అనేక కారణాల వల్ల మహాగఠ్ బంధన్ ఒక సమైక్య శక్తిగా ఏనాడూ కనిపించలేదు. అదే సమయంలో బీజేపీ, ఎన్డీఏ మిత్రపక్షాలు తమ మధ్య విభేదాలను ఎంతో ముందుగా పరిష్కరించుకోవడం, హోంమంత్రి అమిత్ షా ఢిల్లీని కూడా విస్మరించి దాదాపు 20 రోజులు అక్కడే మకాం వేయడం, మోదీ ఉధృతంగా ప్రచారం చేయడం, ఎస్ఐఆర్ పేరుతో ఓట్లను తొలగించలేకపోయినా హిందూ ఓట్లను సంఘటితం చేయగలగడం ఎన్డీఏ గెలుపునకు దారితీసింది.

అయినా ఎన్డీఏ 200కు పైగా సీట్లను గెలుచుకుంటుందని ఏ పరిశీలకుడూ ముందుగా ఊహించలేదు. ఎన్నికల సమయంలో మహిళలకు పెద్ద మొత్తంలో నిధులు పంపిణీ చేయడం వంటి కారణాలు ఎన్డీఏ గెలుపునకు దోహదం చేస్తాయని అంచనా వేసినవారు కూడా కొద్ది పాటి ఆధిక్యతతో ఎన్డీఏ అధికారంలోకి వస్తుందని మాత్రమే ఊహించారు. కానీ ఎన్డీఏకు అనూహ్యమైన విజయం లభించింది. ఎన్నికల అక్రమాలే కారణమని, ఎన్నికల కమిషన్ అధికార పార్టీకి అనుగుణంగా నడుచుకుందని ప్రతిపక్షాలు విమర్శించినంత మాత్రాన ఈ విజయం ప్రాధాన్యం తగ్గిపోదు. తమ ఆరోపణలు, విమర్శలు ప్రజలను కదిలించలేనప్పుడు వాటివల్ల పెద్దగా ప్రయోజనం ఉండదు. బిహార్ ఎన్నికల్లో విజయం సాధించి, తన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి, తనపై ఇంటా బయటా వస్తున్న విమర్శలను తిప్పికొట్టి అజేయుడుగా మారడానికి మోదీ ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నిస్తారన్న విషయం తెలిసినప్పటికీ బీజేపీ వ్యూహాల్ని అంచనా వేయడంలోను, తమ పార్టీలను పటిష్ఠంగా మార్చుకోవడంలోనూ కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు విఫలమయ్యాయన్న విషయం స్పష్టమవుతోంది. ప్రతిపక్షాల దౌర్బల్యమే మోదీకి శ్రీరామరక్ష.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



అవి ఊహాజనిత వాదనలు!

విశాఖపట్టణంలో గూగుల్–అదానీ–ఎయిర్‌టెల్ నిర్మించతలపెట్టిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) డేటా హబ్ గురించి అక్టోబర్ 30న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన నెల్లూరు నరసింహారావు వ్యాసంలో అనేక వాస్తవ విరుద్ధవాదనలున్నాయి. విశాఖపట్టణంలో నిర్మించదలుచుకున్నది సాధారణ డేటా సెంటర్ కాదు, ఏఐ డేటా సెంటర్. రెంటికీ ఎంతో తేడా ఉంది. గూగుల్ సంస్థకు చెందిన జీమెయిల్, యూట్యూబ్, క్రోమ్, మ్యాప్స్ లాంటివి వాడేటప్పుడు మనకు అందే సమాచారం సాధారణ డేటా సెంటర్స్‌లో ఉండే సర్వర్ల నుంచి లభిస్తుంది. అయితే గూగుల్ సంస్థ ఏఐ ఉత్పత్తులను తయారు చేయాలన్నా, పెద్దఎత్తున సమాచారం క్రోడీకరించాలన్నా వాటిని ఏఐ డేటా సెంటర్‌ల ద్వారా చేయాల్సి ఉంటుంది. క్లౌడ్ సర్వీసెస్ ఇందులో భాగమే. అందుకనే ఏఐ డేటా సెంటర్లు సాధారణ సెంటర్ల కన్నా పెద్దవిగా, సంక్లిష్టంగా ఉంటాయి. వీటిలో క్లిష్టమైన పరికరాలు వాడతారు కనుక అవసరమైన నీరు, విద్యుత్తు, కాలుష్యం సాధారణ డేటా సెంటర్ కన్నా చాలా ఎక్కువ ఉంటుంది.

ఇక, వ్యాసకర్త చెప్పినట్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పునరుత్పాదక విద్యుత్తు రంగంలో దేశంలో అగ్రస్థాయిలో లేదు. మార్చి 2024 నాటికి 11 గిగావాట్ల సామర్థ్యంతో ఏడవ స్థానంలో, దక్షిణ భారతంలో మూడవ స్థానంలో ఉంది. అలాగే, చైనాలో వేల సంఖ్యలో డేటా సెంటర్లు ఏమీ లేవు. అక్కడ సాధారణ డేటా సెంటర్లు 449, ఏఐ డేటా సెంటర్లు వంద దాకా ఉన్నాయి. అమెరికాలో ఏఐ డేటా సెంటర్లు పదుల సంఖ్యలోనే (20–30 మధ్యలో) ఉన్నాయి. గూగుల్ ఏఐ డేటా హబ్ విషయానికి వస్తే, పైన పేర్కొన్నట్టు ఇందులో వాడే పరికరాలు చాలా క్లిష్టమైనవి. వీటిల్లో గ్రాఫిక్ ప్రాసెసింగ్ యూనిట్స్ వాడతారు. ఇవి సంవత్సరం పొడుగునా పనిచేస్తూనే ఉండాలి కాబట్టి తొందరగా, తీవ్రంగా వేడెక్కుతాయి. ఆ వేడిని తగ్గించడానికి ముఖ్యమైనది కూలెంట్ నీరు. ఈ సెంటర్లలో వెలువడే విపరీతమైన వేడి ఒక సమస్య అయితే, సర్వర్లను చల్లబరచడానికి అత్యధిక మోతాదులో అవసరమయ్యే నీరు మరొక సమస్య. విశాఖపట్టణం ఉష్ణోగ్రతలకు ఈ నీటి అవసరం మరింత ఎక్కువ.



ఒక ఏఐ డేటా సెంటర్‌కు ఎంత నీరు అవసరమన్నదానిపై మన దగ్గర స్పష్టమైన లెక్కలు లేవు కానీ, ఒక గిగావాట్ సామర్థ్యం కలిగిన సాధారణ డేటా సెంటర్‌కు రోజుకు ఒక కోటి 11 లక్షల గ్యాలన్ల నీరు కావాలి. అంటే విశాఖపట్టణం మొత్తానికి రోజుకు అవసరమైన నీటిలో 11శాతం అన్న మాట. 'ఇంత నీరు ఎక్కడి నుంచి తీసుకువస్తారు' అనేదానికి ప్రభుత్వం ఏమీ చెప్పలేదు. వ్యాస రచయిత మాత్రం పోలవరం ఎడమ కాలువ అని చెప్పారు. పోలవరం ఇప్పటివరకు పూర్తవ్వనే లేదు, అప్పటివరకు అంత ఎక్కువ మొత్తంలో నీరు ఎక్కడి నుంచి లభిస్తుంది? ఒకవేళ పోలవరం పూర్తి అయినా దీనికి అవసరమైన కేటాయింపు ఆ ప్రాజెక్టులో ఉందా? కేవలం నీటితోనే ఆ సర్వర్లు, పరికరాలు చల్లబడవు. అనేక రసాయనాలు కలపాలి. మరి ఆ కాలుష్యమంతా ఎక్కడికి వెళ్తుంది? పూర్తిగా రీసైకిల్ చేస్తామనే ప్రకటన అయితే ఇస్తారు కానీ, అది సాధ్యపడని విషయం. దీని గురించి మనకు సమాచారం లేదు. పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక వంటిదేమీ అందుబాటులో లేదు. సమాచారం ఏమీ లేకుండా ఆశావాదం ప్రకటించడం సబబు కాదు.

ఈ సెంటర్‌కు అవసరమైన విద్యుత్తు అంతా పునరుత్పాదక విద్యుత్తు ద్వారా సమకూర్చుకుంటారని నరసింహారావు చెబుతున్నారు. అది అసాధ్యం. సంప్రదాయ విద్యుత్తు వాడవలసిందే. అందుకే, అమెరికాలోని డేటా సెంటర్ సంస్థలు తమ విద్యుత్ అవసరాల కోసం అణు విద్యుత్తు రంగంలో పెట్టుబడులు పెడుతున్నాయి. ఈ సెంటర్‌ను పూర్తిగా విశాఖపట్టణం, దాని పరిసరాలలోనే పెట్టబోతున్నారు. అంటే దానికి అవసరమయ్యే నీరు, విద్యుత్తు, కాలుష్యం అంతా కూడా ఆ నగరం, పరిసరాలపై ప్రభావం చూపెట్టే అంశం. ప్రపంచ డేటా సెంటర్ రాజధానిగా పేరున్న వర్జీనియా రాష్ట్రంలో ఉన్న డేటా సెంటర్ల మొత్తం సామర్థ్యం 2.5 గిగావాట్లు అయితే విశాఖపట్టణంలో నిర్మించదలుచుకున్న ఈ ఒక్క సెంటర్ సామర్థ్యమే 1 గిగావాట్. అంటే కేంద్రీకరణ ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. 'ఈ డేటా సెంటర్ వల్ల 2 లక్షల ఉద్యోగాలు వస్తాయి' అని రచయిత తెలిపారు. ఈ సంఖ్య ప్రభుత్వం మోడలింగ్ చేసి, 1,88,000 ఉద్యోగాలు వస్తాయి అని చెప్పిన సంఖ్యకు దగ్గరగా ఉంది. ప్రభుత్వం ఏమి మోడలింగ్ చేసిందో, ఏ ఇన్‌పుట్స్ తీసుకుందో తెలియదు. ఏ అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నారనేది చాలాసార్లు పక్షపాతంతో కూడి ఉంటుంది. కాబట్టి ఈ మోడలింగ్‌కు ఒక శాస్త్రీయ పునాది ఉన్నదని నమ్మటం కష్టం. 2023లో గూగుల్ సంస్థ విడుదల చేసిన ఒక నివేదికలో అమెరికాలో యాష్‌బర్న్, లీస్‌బర్గ్‌లలో ఉన్న తమ డేటా సెంటర్లలో మొత్తం 400 మంది పనిచేస్తున్నారని తెలిపింది. అదే విధంగా మెటా సంస్థ తాము లూసియానా రాష్ట్రంలో కట్టబోతున్న ఒక అతి పెద్ద డేటా సెంటర్‌లో ఇవ్వనున్న ఉద్యోగాలు 500 అని తెలిపింది. అమెరికా మొత్తం మీద సుమారు 5,500 డేటా సెంటర్లు ఉండగా, అందులో మొత్తం ఉద్యోగులు దాదాపు 5 లక్షలు. అంటే డేటా సెంటర్‌కు వందమంది.

అయితే 'ఇక్కడ రాబోయే ఉద్యోగాలు ఈ ఒక్క సెంటర్ కారణంగా కాక, ఎకో సిస్టమ్ ఆధారంగా వస్తాయి' అని వాదించవచ్చు. కానీ ఇది ఒక ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ సెంటరో, టెస్టింగ్ సెంటరో కాదు. కేవలం సర్వర్ సెంటర్. డేటా సెంటర్ చుట్టూ ఒక ఎకో సిస్టమ్ అభివృద్ధి చెందే అవకాశం ఉంటే అమెరికా టెక్నాలజీ పరిశ్రమ సిలికాన్ వ్యాలీని వదిలేసి ఎప్పుడో వర్జీనియాకు వచ్చేసి ఉండాల్సింది. ఇటువంటి పెద్ద ప్రాజెక్టుల గురించి, ప్రభుత్వం వాటికి అందిస్తున్న వేలకోట్ల రాయితీల గురించి, వాటి వెనుక ఉన్న భావజాల–రాజకీయ కారణాల గురించి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. అంతా మన మంచికే అని నమ్మే రోజులు పోయాయి.

• గుత్తా రోహిత్
మానవ హక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్)

విశాఖ సదస్సులో పెట్టుబడుల వెల్లువ

విశాఖ భాగస్వామ్య సదస్సు దిగ్విజయం కావడమేగాక, అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సులో ఏపీ ప్రభుత్వం ఆల్ టైం రికార్డును సృష్టించింది. దాదాపు 60 దేశాల నుంచి 4,975 మంది ప్రతినిధులు సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనడం ఒక రికార్డు. ఈ సదస్సుకు పలు దేశాల నుంచి 630 మంది విదేశీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సదస్సులో రూ.13.26 లక్షల కోట్ల పెట్టుబడులు పోటెత్తడం విశేషం. ఇది ప్రభుత్వ అంచనా కంటే 30 శాతం అదనం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచే పారిశ్రామికాభివృద్ధిపై దృష్టిపెట్టింది. సింగపూర్, యూఏఈ, లండన్ వంటి దేశాల్లో సీఎం చంద్రబాబు, అమెరికా, ఆస్ట్రేలియా, లండన్ వంటి దేశాల్లో ఐటీ మంత్రి నారా లోకేశ్ పర్యటించి, ఏపీలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా అక్కడి పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి ఆహ్వానించారు. దీంతో పెట్టుబడుల సదస్సుకు పారిశ్రామికవేత్తల నుంచి భారీ స్పందన లభించింది. రెండు రోజుల సీఐఐ సదస్సులో వైద్యారోగ్యం, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, పరిశ్రమలు, టెక్స్‌టైల్స్, పర్యాటక రంగాల్లోనూ, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ, హెట్రోడ్రగ్స్, భారత్ డైనమిక్స్, జేకే ఏరోస్పేస్, అదానీ విల్మర్, ఎన్ఎస్టీఎల్ క్వాంటమ్ కంప్యూటింగ్ స్టిమ్యులేటింగ్ సెంటర్, సిడాక్, పాస్కల్ తదితర సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయి.

సీఎం చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సహా మొత్తంగా మంత్రులందరూ కలిసి 490 ఎంఓయూల ద్వారా రూ.5,62,506 కోట్ల మేర ఒప్పందాలు కుదుర్చగలిగారు. 'క్లియర్ పాలసీ దిశ, ఫాస్ట్‌ట్రాక్ పరిశ్రమ అనుమతులు, పెట్టుబడిదారులకు గవర్నెన్స్ హామీ' ఇవి ఏపీని మళ్లీ జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడుల మ్యాప్‌లో ముందుకు తెచ్చాయి. అయితే, ఇప్పుడు ప్రభుత్వం మరింతగా దృష్టి సారించాల్సిన అంశాలు– ఒప్పందాలు జరిగిన పెట్టుబడులను గ్రౌండ్‌లోకి తేవడం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను వేగంగా విస్తరించడం, యువతకు ఇండస్ట్రీ స్కిల్ శిక్షణ ప్రోగ్రాం ఏర్పాటు, భవిష్యత్ టెక్నాలజీలకు ప్రత్యేక జోన్‌లు... వంటివి సదస్సు విజయాన్ని నిజంగా కొలిచే అంశాలు.

– నీరుకొండ ప్రసాద్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

ప్రజల్ని విడిచి పెట్టుబడికి వత్తాసు!

నేడు మన దేశ స్థూల జాతీయ ఉత్పత్తి 4.19 ట్రిలియన్ డాలర్లకు చేరుకుని, దేశం ప్రపంచంలోనే నాలుగవ అతిపెద్ద మార్కెట్ ఎకనామీగా అవతరించింది. కానీ దేశ పీడిత ప్రజలకు ఒరిగింది ఏమీ లేదు. భారతదేశానికి స్వాతంత్ర్యం రాక ముందు నుంచి నేటి వరకు కూడా భారత దేశ ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయమే. దేశ భూభాగంలో 60శాతం భూమి ఉన్నది (దాదాపు 140 మిలియన్ హెక్టార్ల వ్యవసాయ యోగ్యమైన భూమి). అందులో 44శాతం భూమి నేటికీ 2 లక్షల భూస్వాములు, 3 లక్షల నయా భూస్వాముల (బడా పెట్టుబడిదారులు, బహుళ జాతి సంస్థల) చేతుల్లో ఉన్నది. మిగతా 56శాతం భూమి దేశంలోని 93.03 మిలియన్ల పెద్ద, మధ్య తరగతి, చిన్న, సన్నకారు రైతుల చేతుల్లో ఉంది.

భారతదేశంలోని 6,40,932 గ్రామాల్లో, 7,933 పట్టణాల్లో, 4,000 నగరాల్లో 140.63 కోట్ల జనాభా జీవిస్తున్నది. ఇందులో 72.2శాతం జనాభా గ్రామాల్లో జీవిస్తుండగా, 27.8శాతం జనాభా పట్టణాల్లోను, నగరాల్లోను జీవిస్తున్నది. దేశ రాజ్యాంగంలోని ఐదవ, ఆరవ షెడ్యూల్‌లోని 14 రాష్ట్రాల్లో 705 గిరిజన తెగలు సుమారు 10 కోట్ల 40 లక్షలు జీవిస్తున్నాయి. వీరి ప్రధాన వృత్తి వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణ. వీరు దేశ జనాభాలో 8.6శాతం ఉన్నారు. దేశ వ్యాప్తంగా దళిత జనాభా 20 కోట్ల 14 లక్షలు కాగా, దేశ జనాభాలో వీరిది దాదాపు 16.6శాతం. దేశంలో ముస్లిం ప్రజలు దాదాపు 20 కోట్లుండగా, ఇది దేశ జనాభాలో 14శాతం. నేటికీ దేశంలో దాదాపు 49.25 కోట్ల అసంఘటిత–సంఘటిత కార్మికులుండగా ఇందులో సంఘటిత కార్మికులు కేవలం 2 కోట్ల 60 లక్షలు మాత్రమే. మిగతా 46 కోట్ల 40 లక్షల కార్మికులు అసంఘటిత కార్మిక రంగానికి చెందినవారే. ఇందులో భూమిలేని వ్యవసాయ కూలీలు 14 కోట్ల 40 లక్షలున్నారు. ఈ వ్యవసాయ కూలీలు గ్రామాల్లోనే జీవిస్తున్నారు.

సరిగ్గా 34 ఏళ్ళ క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం మొదలుపెట్టిన ప్రపంచీకరణ–సరళీకరణ–ప్రయివేటీకరణలను ఆ తర్వాత వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ దేశ కార్మిక రంగం తమ రక్త మాంసాలను ధారపోసి పోగుచేసిన 331 ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన దాదాపు 20 లక్షల కోట్ల ఆస్తులను కేవలం రూ.3,47,439 కోట్లకే దేశీయ బడా పెట్టుబడిదారులకు, బహుళ జాతి సంస్థలకు అమ్మివేసింది. ఫలితంగా గత మూడున్నర దశాబ్దాలుగా దేశ సంఘటిత కార్మిక రంగానికి చెందిన కోట్లాది కార్మికులు రోడ్డునపడ్డారు. దేశ పీడిత ప్రజలకు చెందిన ఈ ప్రభుత్వ ఆస్తులు బడా పెట్టుబడిదారుల, బహుళ జాతి సంస్థల వశమయ్యాయి. ఫలితంగా దేశీయ బడా పెట్టుబడిదారులు ముకేశ్ అంబానీ, అదానీ, టాటా గ్రూప్, రుస్తుంజీ తదితరుల ఆస్తులు దాదాపు రూ.20 లక్షల కోట్లకు చేరుకోగా, దేశంలోని 298 బడా పెట్టుబడిదారుల ఆస్తులు రూ.98 లక్షల కోట్లకు చేరుకున్నాయి.

ఈ 75 ఏళ్ళుగా స్వాతంత్ర ఉద్యమ ఫలితాలు ఈ దేశ 80శాతం ప్రజలకు అందలేదు. రోజురోజుకు ప్రభుత్వాల పని విధానం పేదలు, మరింత పేదలుగాను, ధనవంతులు మరింత కుబేరులుగాను మారేందుకు ఉపయోగపడుతున్నది. దేశ ప్రజల సకల సంపదను ప్రభుత్వాలు దేశీయ బడా పెట్టుబడిదారులకు, బహుళజాతి సంస్థలకు అప్పచెప్పాయి. ఇప్పుడు ఈ పెట్టుబడిదారులు, బహుళజాతి సంస్థలు దేశంలోని అడవి మీద, అడవిలోని ఖనిజ సంపద మీద కన్ను వేశాయి. దాన్ని దోచుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాయి. వీరికి ఆ వీలు కల్పిస్తూ ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలపై అణచివేతను కొనసాగిస్తున్నాయి.

> రోజురోజుకు ప్రభుత్వాల విధానం పేదలు, మరింత పేదలుగాను, ధనవంతులు మరింత కుబేరులుగాను మారేందుకు ఉపయోగపడుతున్నది. దేశ ప్రజల సకల సంపదను ప్రభుత్వాలు దేశీయ బడా పెట్టుబడిదారులకు, బహుళజాతి సంస్థలకు అప్పచెప్పాయి. ఇప్పుడు ఈ పెట్టుబడిదారులు, బహుళజాతి సంస్థలు దేశంలోని అడవి మీద, అడవిలోని ఖనిజ సంపద మీద కన్ను వేశాయి. వీరికి వీలు కల్పిస్తూ ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలపై అణచివేతను కొనసాగిస్తున్నాయి.




భారతదేశంలోని ఉత్పత్తి సాధనాలు ఉత్పత్తి శక్తులకు దక్కి, నిజమైన ప్రజాస్వామికస్ఫూర్తితో "సమ సమాజం" ఏర్పడాలన్న లక్ష్యంతో మార్క్సిజాన్ని ఆధారం చేసుకుని ఏప్రిల్ 22, 1981న ఉద్భవించిన పీపుల్స్‌వార్ పార్టీ, కాలక్రమేణా సీపీఐ (మావోయిస్టు) పార్టీగా మారి, దేశ ప్రజలకు తానున్నానని కొంత భరోసా ఇచ్చింది. కానీ 2004 నుండి ఆ పార్టీ నిత్య నిర్బంధాన్ని అనుభవిస్తూ దేశంలోని అయిదవ షెడ్యూల్‌కు మాత్రమే పరిమితమైంది. కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు మొదట గ్రీన్ హంట్, ఆపరేషన్ ప్రహార్, ఆపరేషన్ సమాధాన్‌లతో మావోయిస్టు పార్టీని నిర్మూలించే ప్రయత్నం చేశాయి. ఆ ప్రయత్నాలు ఫలించకపోవడం వలన, రెండు సంవత్సరాల నుండి 'ఆపరేషన్ కగార్' పేరుతో చుట్టివేత కార్యక్రమం మొదలైంది. అయిదవ షెడ్యూలులోని ఆదివాసీ ప్రాంతాలకు, అడవికి పరిమితమైన ఆ పార్టీ నాయకత్వాన్ని నిర్మూలించడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ వ్యూహం వలన అమాయక ఆదివాసులు, వారికి నాయకత్వం వహిస్తున్న మావోయిస్టు పార్టీ గత 45 సంవత్సరాలుగా మునుపెన్నడూ నష్టపోనివిధంగా నష్టపోతున్నది. ఈ అమానుష దారుణ మారణకాండ వలన దేశ పీడిత ప్రజల "సమ సమాజ ఏర్పాటు" కల చెదిరిపోతున్నది.

ఇంకొకవైపు ఈ అసాధారణ పరిస్థితుల్లో నిత్య దుర్భర జీవితాలు వెళ్ళదీస్తున్న దేశ మెజారిటీ పీడిత ప్రజలను ప్రస్తుత ప్రభుత్వం మతోన్మాదంతో నిట్టనిలువుగా చీల్చాలని చూస్తున్నది. చట్టబద్ధ పాలనకు చరమగీతం పాడి దేశాన్ని మధ్య యుగాలకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నది. ఈ మొత్తం దుర్మార్గాన్ని న్యాయ వ్యవస్థ కళ్లప్పగించి చూస్తున్నది కానీ నివారించడంలేదు. దేశంలో పాలక పార్టీలకు దీటుగా గత 75 ఏళ్ళుగా దేశ అశేష ప్రజల ఆకాంక్షలకు నిజమైన ప్రాతినిధ్యం వహించే లౌకిక ప్రజాస్వామ్య పార్టీ కానీ, వామపక్ష పార్టీ కానీ ఏర్పడకపోవటం పెద్ద లోటు. కనీసం వామపక్ష, లౌకిక ప్రజాస్వామ్య బలమైన ఐక్య సంఘటన కూడ దేశంలో లేకపోవడం వలన దేశ పీడిత ప్రజలు దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

అయితే గతితార్కిక నియమాల ప్రకారం సమాజం నిరంతరం చలనంలో ఉంటూ మార్పు చెందుతూ పాతది నశిస్తూ కొత్తది ఉద్భవిస్తుందనేది చారిత్రక వాస్తవం. బలమైన విప్లవ, ప్రజాస్వామిక పార్టీలు లేకుండానే మొన్న శ్రీలంక, నిన్న బంగ్లాదేశ్, నేపాల్ ప్రజలు ఉద్యమించి, తమ ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించారు. రేపు భారతదేశం అందుకు అతీతం కాదు. కాలం ప్రశ్నలకు కాలమే సమాధానం చెపుతుంది.

■ చిక్కుడు ప్రభాకర్
హైకోర్టు న్యాయవాది
కన్వీనర్, తెలంగాణ ప్రజాస్వామిక వేదిక





కానూరులోని న్యూ ఆటోనగర్‌లో మావోయిస్టులు అద్దెకు దిగిన భవనం

మావోయిస్టుల అరెస్టుతో విజయవాడ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఒకరు కాదు, ఇద్దరు కాదు ఏకంగా 32 మంది పట్టుబడ్డారు. కానూరు న్యూ ఆటోనగర్‌లోని ఓ భవనంలో 28 మంది, రామవరప్పాడులో నలుగురు 20 రోజులుగా తలదాచుకుంటున్నారు. పక్కా సమాచారంతో ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగి పట్టుకున్నాయి. విషయం బయటకురావడంతో బెజవాడ వాసులు భయాందోళనకు గురయ్యారు. మావోయిస్టు ఉద్యమంతో నాటి తరం నాయకులకు ఉన్న సంబంధాలు, వెలుగు చూసిన ఘటనలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు షెల్టర్ జోన్‌లో జరిగిన వాటిలో ఇదే మేజర్ ఆపరేషన్‌గా భావిస్తున్నారు.



మావోయిస్టులు ఉన్న భవనంలోకి ప్రవేశిస్తున్న ప్రత్యేక బలగాలు



డాగ్ స్క్వాడ్ తనిఖీలు



ఆ భవనం వైపు ఎవరూ వెళ్లకుండా భద్రతా ఏర్పాట్లు

షెల్టర్ జోన్‌లో..

మేజర్ ఆపరేషన్!

విజయవాడ సమీపంలోని కానూరులో సంచలన ఘటన

న్యూ ఆటోనగర్, రామవరప్పాడులో 32 మంది మావోయిస్టుల పట్టివేత

ఘటనాస్థలంలో కృష్ణాజిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): షెల్టర్ జోన్‌గా ఉన్న బెజవాడలో మావోయిస్టులను పట్టుకోవడంలో జరిగిన అతి పెద్ద ఆపరేషన్‌గా మంగళవారం నాటి ఘటన నిలిచింది. కానూరు ఆటోనగర్ అనేది బెజవాడ ఆటోనగర్‌ను ఆనుకుని ఉంటుంది. విద్యుత్ సబ్‌స్టేషన్ రోడ్డుకు ఆరవ అంతర్గత రోడ్డుగా ఉన్న జీ ప్లస్ 3 భవనంలో తలదాచుకున్న 28 మంది, రామవరప్పాడులో నలుగురు మావోయిస్టులను గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలు అరెస్టు చేయటం సంచలనంగా మారింది. గతంలో ఇంత పెద్ద సంఖ్యలో విజయవాడలో కానీ, ఉమ్మడి కృష్ణాజిల్లాలో కానీ మావోయిస్టులను పట్టుకున్న ఉదంతాలు లేవు. విజయవాడ నగరాన్ని మావోయిస్టులు కొన్ని దశాబ్దాల కాలంగా షెల్టర్‌జోన్‌గా ఎంపిక చేసుకున్నారు. ఇక్కడి నుంచి ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించిన దాఖలాలు లేవు కానీ, షెల్టర్‌గా మాత్రం ఉపయోగించుకుంటున్నారు. మావోయిస్టుల సానుభూతిపరులన్న అనుమానాలతో మిగతా 6లో..

- సుమారు 20 రోజులుగా తలదాచుకుంటున్నట్టు సమాచారం
- గతంలో ఒకరిద్దరిని పట్టుకున్నా.. ఆధారాలు లేక వదిలేసిన పోలీసులు
- 2006లో ఆటోనగర్‌లో రాకెట్ లాంచర్ల పట్టివేతతో ఉలిక్కిపడిన బెజవాడ
- అదే ఏడాది రాకెట్ లాంచర్లు, డిటోనేటర్లు, జిలెటిన్ స్టిక్స్ అనేక సార్లు దిగుమతి
- మావోయిస్టు ఉద్యమంలో నాడు కీలకపాత్ర పోషించిన జిల్లా వాసులు

భయం గుప్పిట్లో న్యూ ఆటోనగర్

విజయవాడ/కానూరు /పెనమలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు పట్టుబడటంతో పాత, కొత్త ఆటోనగర్ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఆటోనగర్, కానూరు న్యూ ఆటోనగర్ వరకు అనేక పరిశ్రమలు ఉన్నాయి. సుమారు 20 వేల యూనిట్లు ఆటోనగర్‌లోనే ఉండడంతో స్థానికులు, బయట ప్రాంతాలకు చెందిన సుమారు లక్షమంది ఇక్కడి ప్రతి రోజు ఉపాధి పొందుతారు. రెసిడెన్షియల్, ఇండస్ట్రీస్ ప్రాంతంగా గుర్తింపు పొందడంతో పాటు పారిశ్రామిక వేత్తలు కూడా ఇక్కడే ఉంటారు. ఇలాంటి ప్రాంతంలో మావోయిస్టులు 20 రోజులుగా ఇక్కడే ఉన్నారు. వారిని మంగళవారం గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలు అరెస్ట్ చేయడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. అసలు మావోయిస్టులు ఇక్కడ ఎందుకు ఉన్నారు? ఎన్ని రోజులు ఉండాలనుకున్నారు? ఎవరు, ఏ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని ఉంటున్నారనే సందేహాలు స్థానికుల్లో తలెత్తుతున్నాయి. ఇన్ని రోజులు వారు ఇక్కడే తలదాచుకుంటున్నా పోలీసులు ఎందుకు గుర్తించలేకపోయారనే అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు.



భారీగా తరలివచ్చిన మీడియా ప్రతినిధులు

ప్రజల భద్రత ప్రశ్నార్థకం
- పోలీస్ నిఘా నామమాత్రం
- వెలుగుచూస్తున్న భద్రతా వైఫల్యం

6

కారులో ఆహారం పంపిస్తున్నదెవరు?

అమ్మో.. ఆటోనగర్!
- అభయారణ్యం నుంచి.. జనావాసాల్లోకి మావోయిస్టులు
- కానూరు న్యూ ఆటోనగర్‌లో కొద్దిరోజులుగా మకాం!
- వలస కార్మికులకు ఆవాసంగా ఉండటంతో ఎంపిక
- పక్కా సమాచారంతో పట్టుకున్న ప్రత్యేక బలగాలు

6

ముగ్గురు పంచాయతీ సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

ఉత్తర్వులు జారీ చేసిన డీపీవో లావణ్య

- కంచికచర్ల పంచాయతీలో రూ.24.41 లక్షల నిధుల దుర్వినియోగం

కంచికచర్ల రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కంచికచర్ల గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ముగ్గురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. జూనియర్ అసిస్టెంట్ షేక్ నాగులు మీరా, బిల్ కలెక్టర్ జంగం వెంకట గుప్తా, జూనియర్ అసిస్టెంట్ ఇల్లా సుబ్బారావును సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి లావణ్య మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కంచికచర్ల గ్రామ పంచాయతీలో రూ.24.41 లక్షల నిధులు గోల్‌మాల్‌పై విజయవాడ డీఎల్‌పీవో ఎన్ఎల్వీ రాఘవన్ కంచికచర్ల పంచాయతీ కార్యాలయంలో గత అక్టోబర్ 17న విచారణ జరిపారు. ప్రజల నుంచి వివిధ రకాల పన్నుల రూపంలో వసూలు చేసిన నిధులతో పాటు పంచాయతీకి వచ్చిన వివిధ రకాల సొమ్ము రూ.24.41 లక్షలు దుర్వినియోగం అయినట్లు నిర్ధారించారు. కంచికచర్ల గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కాలంలో నిధులు దుర్వి నియోగానికి పాల్పడిన కంచికచర్ల పంచాయతీ అప్పటి జూనియర్ అసిస్టెంట్ నాగుల్, బిల్ కలెక్టర్ జంగం వెంకట గుప్తా, జూనియర్ అసిస్టెంట్ ఇల్లా సుబ్బారావుపై చర్యలకు డీఎల్‌పీవో రాఘవన్ జిల్లా ఉన్నతాధికారులకు సిఫార్సు చేశారు. పరిశీలించిన మిగతా 6లో..

భీతిల్లిపోయారు!

అనాసాగరం వద్ద లారీని ఢీకొన్న కె.కావేరి ట్రావెల్స్ బస్సు

- వెంట్రుకవాసిలో తప్పిన పెనుప్రమాదం
- ప్రాణనష్టం లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న వలస కూలీలు
- హైదరాబాద్ నుంచి శ్రీకాకుళం, ఒడిశాకు వెళ్తుండగా ఘటన

నందిగామ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నందిగామ సమీపంలోని అనాసాగరం బైపాస్ రోడ్డుపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోయినా ఘటనలో బాధితులు భీతిల్లిన తీరు అందరినీ కలచివేసింది. పొట్ట కూటి కోసం ఉన్న ఊరు వదలి హైదరాబాద్ తరలివెళ్లిన శ్రీకాకుళం వలస కార్మికులు సోమవారం సొంతూరు వెళ్లేందుకు బయలుదేరారు. సుదీర్ఘ ప్రయాణం కావడంతో వారంతా కె.కావేరి ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ కోచ్ బస్సును బుక్ చేసుకున్నారు. బస్సులో ఎక్కిన 35 మందిలో ఇరవై మందికి పైగా శ్రీకాకుళం, ఒడిశాకు చెందిన వలస కార్మికులే. సోమవారం సాయంత్రం ఏడు గంటలకు వారి ప్రయాణం ప్రారంభం కాగా, రాత్రి 12 గంటల సమయానికి నందిగామ చేరుకున్నారు. ప్రయాణికులలో ఒకరైన సవరం నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ శివారు అనాసాగరం వద్ద బైపాస్ రోడ్డుపైకి ఎక్కిన క్షణం నుంచి డ్రైవర్ మితిమీరిన వేగంతో బస్సును నడిపించసాగాడు. ఆ సమయంలో ముందు వెళుతున్న పంచదార లారీని ఢీకొట్టడంతో ఒక్కసారిగా భారీ శబ్దం వచ్చింది. అప్పటికే గాఢ నిద్రలో ఉన్న ప్రయాణికులు ఒక్క కుదుపుతో నిద్ర లేచారు. ప్రయాణికులు నిద్ర లేచిన తర్వాత కూడా బస్సు లారీని తాకుతూ ముందుకు కదులుతూనే



ప్రమాదానికి గురైన బస్సును పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

ఉంది. కటిక చీకట్లో తీవ్రమైన శబ్దాలు, క్షతగాత్రుల ఆర్తనాదాలతో మిగిలిన ప్రయాణికులు భీతిల్లిపోయారు. ఎవరికి వారు ఏం జరుగుతుందో తెలియక ఆహాకారాలు చేశారు. స్లీపర్ కోచ్ కావడం వల్ల సీట్ల మధ్య గ్యాప్ కూడా తక్కువగా ఉండటంతో పాటు ప్రమాదం జరిగిన వైపు ఉన్న బెర్త్‌లు, కిటికీ అద్దాలు కూడా దారిపై పడ్డాయి. కొద్దిగా లోపలవైపు ఢీకొని ఉంటే ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడేది. ప్రయాణికులు బెర్త్ నుంచి ఎలా దిగాలో అర్థం కాక ఇబ్బంది పడ్డారు. దీనికి తోడు బస్సులో లైట్లు కూడా ఆపి ఉండడంతో చీకటిలో మనోధైర్యం మిగతా 6లో..

మీడియాతో మాట్లాడుతున్న రైల్వే ఎస్పీ రత్నరాజు



రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్టు

నిందితులు తెనాలి, డోన్ వాసులుగా గుర్తింపు

రూ.6 లక్షలు విలువైన 26 సెల్‌ఫోన్లు స్వాధీనం

గుడివాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.6 లక్షలు విలువైన 26 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రైల్వే స్టేషన్‌లో విజయవాడ రైల్వే ఎస్పీ జి.రత్నరాజు కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. మచిలీపట్నం-ధర్మవరం రైలులో తమ సెల్‌ఫోన్‌లు చోరీకి గురైనట్లు రైల్వే పోలీసులకు ఫిర్యాదు అందాయి. రైల్వే డీఐజీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి విచారణ చేపట్టారు. గుడివాడలోని సీసీ కెమెరాల పరిశీలన ద్వారా వచ్చిన సమాచారం మేరకు ఏరియా ప్రభుత్వాస్పత్రి వద్ద ఉన్న తెనాలికి చెందిన ధర్మవరం రైలుబండిలో బెడ్ రోలర్ షేక్ కరీముల్లా, అనంతపురం జిల్లా, డోన్‌కు చెందిన ఆంథోని చిన్నప్పలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.6 లక్షలు విలువైన 26 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించడంలో ప్రతిభ చూపిన రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.వి.దుర్గారావు, ఎస్ఐ మహబూబ్ షరీఫ్, ఏఎస్ఐ షేక్ అక్బర్, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీబేగ్, ఎస్ఐ పి.రామకృష్ణను ఉన్నతాధికారులు అభినందించారు.

అనాదిగా షెల్టర్ జోన్ బెజవాడ | చరిత్ర మరువని జలప్రళయం | పారిశ్రామికాభివృద్ధి 8

అమ్మో.. ఆటోనగర్!

ఉలిక్కిపడిన శివారు ప్రాంతాలు



- అభయారణ్యం నుంచి.. జనావాసాల్లోకి మావోయిస్టులు
- కానూరు న్యూ ఆటోనగర్‌లో కొద్దిరోజులుగా మకాం!
- వలస కార్మికులకు ఆవాసంగా ఉండటంతో ఎంపిక
- ఇతర రాష్ట్రాల నుంచి హైర్ చేసుకుంటున్న యాజమాన్యాలు
- ఇక్కడే కార్మికులకు వసతి, భోజనం ఏర్పాట్లు
- పారిశ్రామిక వాడ కావటంతో పోలీసుల నిఘా తక్కువ

అభయారణ్యంలో ఉండే మావోయిస్టులు అడవిని విడిచి గుట్టుచప్పుడుగా జనావాసాల్లోకి అడుగుపెట్టడం తీవ్ర సంచలనంగా మారింది. అమరావతి రాజధాని చెంతన మావోయిస్టుల ఉనికిని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర బలగాలు పకడ్బందీగా ఆపరేషన్ నిర్వహించి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో నగరం ఉలిక్కిపడింది.

కానూరు న్యూ ఆటోనగర్‌లో మావోయిస్టులు తలదాచుకున్న భవనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడలోని కానూరు న్యూ ఆటోనగర్‌ను మావోయిస్టులు వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. వీరిలో సింహభాగం చత్తీస్‌ఘడ్‌కు చెందినవారేనని పోలీసువర్గాలు చెబుతున్నాయి. చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఎంతోమంది వలస కార్మికులు ఆటోనగర్, కొత్త ఆటోనగర్లలో పనిచేస్తున్నారు. బీహార్, కలకత్తాల నుంచి వచ్చిన వారు కూడా ఇక్కడ పనిచేస్తున్నారు. దీనిని మావోయిస్టులు తమకు అనుకూలంగా మలుచుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో వచ్చి ఇక్కడ పనిచేస్తుంటారు కాబట్టి ఎవరికీ అనుమానం కూడా రాలేదు. స్థానికంగా ఉండే లేబర్.. ఆటోనగర్లలో పనిచేయటానికి భారీ ఎత్తున రోజుకు రూ.2 కూలి డిమాండ్ చేస్తుండటంతో పరిశ్రమల యాజమానులు కూడా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. చత్తీస్‌ఘడ్ , బీహార్, కలకత్తాల నుంచి వచ్చిన వారికి రోజుకు రూ. 500 లు ఇస్తే సరిపోతుంది. కొంతమంది పెద్ద పారిశ్రామిక యాజమాన్యాలు అయితే గంపగుత్తగా ఆయా రాష్ట్రాల నుంచి కార్మికులను తెచ్చుకుని వారికి కొత్త ఆటోనగర్‌లోనే ఆవాసం కల్పిస్తున్నాయి. వారికి భోజనాలు, అల్పాహారాల వంటి బాధ్యతలను కూడా యాజమాన్యాలు తీసుకుంటున్నాయి. పరిశ్రమల చెంతనే ఉన్న భవనాలలో కార్మికులను ఉంచుతున్నారు. మావోయిస్టుల్లో సింహభాగం చత్తీస్‌ఘడ్, జార్ఖండ్ వంటి మిగిలిన రాష్ట్రాల వాళ్లు ఉండటంతో వ్యూహాత్మకంగా ఎంచుకున్నారు. కొత్త ఆటోనగర్‌లోని విద్యుత్‌సబ్‌స్టేషన్ రోడ్డుకు ఆరో అంతర్గత రోడ్డుగా ఉన్న జీప్లస్+3 భవనాన్ని అద్దెకు తీసుకున్నారు. భవన యజమాని అప్పలస్వామినాయుడు విజయవాడలో ప్రముఖ ఆర్కిటెక్ట్. ఆయన కొంతకాలంగా జర్మనీలో ఉంటున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మూడు ఫ్లోర్లు ఖాళీగా ఉన్నాయి. మావోయిస్టులు మూడో ఫ్లోర్‌ను అద్దెకు తీసుకున్నారు. ఈ ప్రాంతంలో ఇలాంటి తరహా భవనాలు అనేకం ఉన్నాయి. ఇతర రాష్ట్రాల వారంతా ఇదే తరహాలో ఉంటారు. ఎవరికీ అనుమానం ఉండదు. దీంతో తెలివిగా ఈ ప్రాంతాన్ని ముందుగా అధ్యయనం చేసిన తర్వాతే ఎంపిక చేసుకున్నట్టుగా తెలుస్తోంది. పెద్దగా పోలీసు నిఘా కూడా ఈ ప్రాంతాలపై ఉండదు. దీంతో కానూరు ఆటోనగర్ ప్రాంతాన్ని మావోయిస్టులు ఎంచుకోవటం గమనార్హం. విజయవాడలో జవహర్ ఆటోనగర్ విస్తరణ కాకపోవటం వల్ల కానూరులో కొత్త ఆటోనగర్ ఏర్పడింది. కానూరులో ఆటోనగర్ ఏర్పాటుకు 1995లో శ్రీకారం చుట్టడం జరిగింది. 1999లో కానూరు ఆటోనగర్‌లో ప్లాట్లు కేటాయించారు. మొత్తం 300 పైబడి ప్లాట్లు ఉన్నాయి. చిన్న, మధ్య తరహాతో పాటు భారీ యూనిట్లు కూడా కొత్త ఆటోనగర్‌లో ఉన్నాయి. కానూరు ఆటోనగర్ ఏర్పడి దాదాపుగా 26 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికీ మౌలిక సదుపాయాల పరంగా అభివృద్ధి కాలేదు. ప్రధాన రోడ్లు తప్పితే అంతర్గత రోడ్లన్నీ కూడా మట్టి రోడ్లే కావటం గమనార్హం. రోడ్లు కూడా ఎగుడు దిగుడులుగా ఉంటాయి. దీంతో ఈ ప్రాంతాలలోకి స్థానిక యూనిట్లతో అవసరం ఉన్నవారు తప్పితే మిగిలిన వారు ఇటు రారు. నిర్మానుష్యంగా ఉంటున్న ప్రాంతం కావటంతో ఇక్కడ కొంత కాలం తలదాచుకోవచ్చని మావోయిస్టులు ఎంపిక చేసుకున్నారు. అభయారణ్యాలను వదిలి జనారణ్యంలోకి వచ్చి మారుమూల ప్రాంతాలను ఎంచుకునే క్రమంలో కానూరు ఆటోనగర్‌ను ఎంచుకున్నారు.



ఆటోనగర్‌లో పోలీసు బలగాలు

హాట్ టాపిక్‌గా మావోల అరెస్టు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ /కానూరు/పెనమలూరు)

మావోయిస్టుల కదలికల నేపథ్యంలో విజయవాడ నగరం, శివారు ప్రాంతాలు అట్టుడికాయి.. చిన్న, మధ్య తరహాపరిశ్రమలు, నిరుపేదలు ఉండే కొత్తఆటోనగర్‌లో మావోయిస్టులు తలదాచుకుంటున్నారనే వార్త గుప్పుమనడంతో నగర ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. కూడళ్లలో మావోయిస్టుల ఉదంతం సంభాషణే వినిపిస్తోంది. నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు, కుటుంబ కలహాలు, చోరీలు, అగ్ని, రోడ్డు ప్రమాదాలు అరకొరగా హత్యలు మాత్రమే ఇప్పటి వరకు చోటు చేసుకున్నాయి. అయితే ఇటీవల కాలంలో క్రైం రేటు కొంత వరకు అదుపులోకి వచ్చింది. విధ్వంస ఘటనలకు తావులేని ఈ ప్రాంతంలో మావోయిస్టులు తలదాచుకుంటున్నారనే విషయం బహిర్గతం కావడం ప్రజలను ఒకింత భయాందోళనకు గురి చేసింది.

ప్రశాంత ప్రాంతం.. మావోల స్థావరం

విజయవాడ నగరంతో పోల్చితే నగర శివారులోని కానూరు, తాడిగడప, ఎనికేపాడు, నిడమానూరు, పోరంకి ప్రాంతాలు ప్రశాంతంగా ఉంటాయి. ఇక్కడ క్రైం రేటు కూడా తక్కువగానే ఉంటుంది. రైతులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలు అత్యధికంగా ఈ ప్రాంతంలో నివాసం ఉంటారు. గడిచిన దశాబ్ధ కాలంలో ఈ ప్రాంతాల్లో అత్యధికంగా విద్యా సంస్థలు స్థాపించబడ్డాయి. ఇక్కడే తాడిగడప 100 అడుగుల రోడ్డులో కొత్తగా ఆటోనగర్ ఏర్పాటు జరిగింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఉంటాయి. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు మాత్రమే ఆ ప్రాంతంలో ఉంటారు. ఎలాంటి అసాంఘిక ఘటనలు జరగని ప్రదేశం కావడంతో పోలీసులు సైతం అటు వైపు కన్నెత్తైనా చూడరు. ఈ నేపథ్యంలోనే మావోలు కొత్తఆటోనగర్‌ను స్థావరంగా ఎంచుకోవటంతో ఒక్కసారిగా ఈ ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కంగుతిన్న ప్రజలు

పనినిమిత్తం ఉదయమే కంపెనీలకు వచ్చిన వారు గుంపు గుంపులుగా ఉన్న పోలీసులను చూసి ఖంగుతిన్నారు. ముందుగా ఈ ప్రాంతంలో దొంగలు ఉన్నారని, పట్టుకునేందుకు వచ్చామని పోలీసులు తమతో చెప్పినట్టు పలువురు పేర్కొన్నారు. మావోలు ఉన్న భవనం రోడ్డు, ఈ భవనానికి నాలుగు దిక్కుల్లో ఉన్న రోడ్లలోని పరిశ్రమల్లోకి కూలీలను పోలీసులు అనుమతించలేదు. అయితే ఆ భవనంలో ఉన్నది మావోయిస్టులని ఉదయం 10 గంటల ప్రాంతంలో ప్రజలకు పూర్తి స్థాయిలో తెలిసి భయాందోళనకు గురయ్యామని పలువురు కార్మికులు తెలిపారు. నక్సలైట్లు పోలీసులపై ఎదురు కాల్పులు జరుపుతారనే భయం ప్రజలను వెంటాడింది. దీంతో పలువురు కార్మికులు పనివదిలేసి వెళ్లిపోయారు. మావోల వార్తతో నగర ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఇంకా ఏఏ ప్రదేశాల్లో ఉన్నారో.. అనే అనుమానం ప్రజలను తాజాగా వెంటాడుతోంది.

అప్రమత్తమైన అధికారులు

నగరం నలుమూలలా తనిఖీలు

ప్రముఖులు, రాజకీయ నాయకుల అలర్ట్

విజయవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నగరంలో మావోయిస్టుల కదలికల నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం న్యూ ఆటోనగర్‌లోని ఒక భవనంలో 28 మంది మావోయిస్టులను గ్రే హౌండ్స్, ఆక్టోపస్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ఘటనతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఉమ్మడి కృష్ణా జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు. ముఖ్యంగా విజయవాడలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రతి వాహనాన్ని తనిఖీచేస్తున్నారు. అనుమానస్పదంగా కనిపించిన ప్రతి వ్యక్తిని ప్రశ్నిస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా నగరంలో ఇంతమంది మావోయిస్టుల కదలికలతో రాజకీయ నాయకుల్లోను భయాందోళ మొదలైంది. రాజకీయ నాయకులు, ప్రముఖులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రిమోట్ ప్రాంతానికి వెళ్లే నాయకులకు అదనపు భద్రత కేటాయించారు. 15 రోజులుగా మావోయిస్టులు నగరంలోనే ఉండడంతో వారి కదలికలపై ఆరా తీస్తున్నారు. ఈ 15 రోజుల్లో వారు ఎక్కడెక్కడ తిరిగారు, ఎవరెవరిని కలిశారనే విషయాలను తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.





భవనం వెలుపల కేంద్ర సాయుధ బలగాలు

మావోల అరెస్టుతో షాక్‌లో.. స్థానికులు!

పెనమలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కానూరు కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేయడంతో స్థానికంగా ఒక్కసారిగా కలకలం చెలరేగింది. ఇరవై రోజులుగా తమ మధ్య ఇంతమంది మావోయిస్టులు ఆయుధాలతో ఆశ్రయం పొందారన్న విషయం తెలియగానే ఆటోనగర్‌లో కార్మికులు, పరిశ్రమల యజమానులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. జనసమ్మర్ధ ప్రాంతంలో ఆశ్రయం పొందారంటే నమ్మశక్యం కావడం లేదని పలువురు వ్యాఖ్యానించారు.

నమ్మలేకపోతున్నాం



- రమణ, వ్యవసాయ ఉత్పత్తుల యంత్రాల తయారీ కంపెనీ ఓనర్

ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఆశ్రయం పొందారని వినగానే మొదట మేము నమ్మలేదు. ఆటోనగర్‌కు పనుల నిమిత్తం వివిధ రాష్ట్రాల నుండి వర్కర్లు వస్తుంటారు. వారిలో ఎవరు నేరస్థులో, ఎవరు మావోయిస్టులో మాకు తెలియడం లేదు. పోలీసులు నిఘా పెంచాలి.

ఎప్పుడు ఆశ్రయం పొందారో తెలియదు



- రవిచంద్ర, ఫ్యాబ్రికేటర్

ఆటోనగర్‌లో మావోయిస్టులు ఆశ్రయం పొందారన్న విషయం పోలీసులు వచ్చేంత వరకు స్థానికులకు తెలియదు. తెలియగానే నమ్మలేకపోయాం. అడ్డరోడ్డులో వారు ఉంటున్న భవనం చాలా రోజులుగా ఖాళీగా ఉండేది. స్థానికంగా ఎవరు ఎక్కడి నుండి వచ్చిపోతున్నారో ఎవరికీ అర్థం కావడం లేదు. దీంతో మావోయిస్టులు ఉన్నారా అన్న అనుమానం కూడా రాలేదు.

ఎవరికీ వారి కదలికలు అర్థం కాలేదు



-ఎలక్ట్రికల్ షాపు ఓనర్ సురేష్

పొద్దుకూకిన వెంటనే కార్మికులు ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోతారు. దీంతో ప్రత్యేకంగా ఆటోనగర్‌లో సంచరించేవారు ఎవరు ఎక్కడి వారో పట్టించుకున్న నాధుడు లేడు.

కారులో టీ, క్యారేజీలలో ఆహారం వచ్చేది



- జయప్రసాద్, సెక్యూరిటీ గార్డు, లక్ష్మిచైతన్య మౌల్డింగ్ కంపెనీ

ప్రతి రోజూ ఒక కారులో ఉదయం కెటిల్‌లో టీ, పెద్ద పెద్ద క్యారేజీలలో భోజనం రావడం చాలా సార్లు చూశాను. మాకు అనుమానం వచ్చి కారులో క్యారేజీలు తెచ్చే వారిని అడగ్గా దూర ప్రాంతం నుండి కూలి పనుల నిమిత్తం కూలీలు వచ్చి ఆశ్రయం పొందారని చెప్పారు.

షెల్టర్ జోన్‌లో.. మేజర్ ఆపరేషన్!

(5వ పేజీ తరువాయి)

పూర్వం అరెస్టులు జరిగినా ఆ తర్వాత సహేతుక ఆధారాలు లేక వారిని వదిలేయటం జరిగింది. పూర్వపు రోజుల్లో నక్సల్స్ కదలికలు మాత్రం గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఉండేవి. ప్రధానంగా నక్సల్స్ తమ సాహిత్యాన్ని గ్రామాల్లో ఉన్న అభ్యుదయవాదులకు అందించటం జరిగేది. అభ్యుదయవాదులు ఈ సాహిత్యాన్ని అధ్యయనం చేయటం ద్వారా ప్రజలకు తెలియజేసేవారు. అప్పట్లో ఇప్పుడున్నంత దృష్టి పోలీసులకు ఉండేది కాదు. దీంతో నక్సల్స్ తమ కార్యక్రమాలను చాపకిందనీరులా చేసుకుంటూ పోయేవారు.

నాడు ఉలిక్కిపడిన బెజవాడ

2006-07 మధ్య కాలంలో ఓ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ వాహనంలో విజయవాడకు వచ్చిన రాకెట్ లాంచర్ల విడిభాగాలను పోలీసులు పట్టుకున్నారు. విజయవాడకు ట్రాన్స్‌పోర్ట్ చేసిన రాకెట్ లాంచర్లు ఓ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ గోడౌన్‌లో దిగుమతి అయ్యాయి. అయినా వాటిని తీసుకోవటానికి కొద్ది రోజులు ఎవరూ రాలేదు. ఈ సమాచారం పోలీసులకు తెలియటంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత కానీ అవి రాకెట్ లాంచర్ల విడిభాగాలని బయట ప్రపంచానికి తెలిసింది. ఈ పరిణామంతో విజయవాడ నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇదే సందర్భంలో మహబూబ్‌నగర్, ప్రకాశంజిల్లాలో రాకెట్ లాంచర్ల డంప్‌లను పోలీసులు సీజ్ చేశారు. దీంతో విజయవాడకు ఓ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ ద్వారా పంపిన రాకెట్ లాంచర్ల విడిభాగాలను తీసుకువెళ్లటానికి మావోయిస్టులు జాప్యం చేశారు. ఈ లోపే సమాచారం బయటకు రావటంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. మహబూబ్‌నగర్, ప్రకాశం జిల్లాల్లో దొరికిన రాకెట్ లాంచర్లు కూడా విజయవాడకు ముందుగా రవాణా అయ్యాయని అప్పట్లో పోలీస్ వర్గాలు నిర్ధారించాయి. 2006లో చెన్నై నుంచి దిగుమతి చేసుకున్న రాకెట్ లాంచర్ల విడిభాగాలను పొద్దుటూరుకు చేర్చి అక్కడి నుంచి అచ్చంపేట గిద్దలూరులలో ఎంపిక చేసిన ప్రాంతాలకు మావోయిస్టులు తరలించారు. ఆయా ప్రాంతాల్లో సీజ్ చేసిన వాటిలో భారీ సంఖ్యలో రాకెట్ లాంచర్ల విడిభాగాలతో పాటు జిలెటిన్ స్టిక్స్, డిటోనేటర్లు, ఇతర పేలుడు పదార్థాలు ఉన్నాయి. ఇవి కనుక వారి చేతికి చేరి ఉంటే భారీ స్థాయిలో మారణహోమాలు జరిగి ఉండేదని తెలిసింది.

కొండపల్లి సీతారామయ్య అంటే అభిమానంతో..

నాటి నక్సలైట్ ఉద్యమ అగ్రనాయకుడు కొండపల్లి సీతారామయ్య గుడివాడ సమీపంలోని జనార్ధనపురానికి చెందిన వ్యక్తి కావడంతో ఆయన ద్వారా సాయం పొందిన వారు, ఉన్నతస్థితికి ఎదిగినవారు ఆయన అనుచరులుగా ఉండి నేరుగా ఉద్యమంలో పాల్గొనకపోయినా సానుభూతిపరులుగా ఉండేవారు. మావోయిస్టులు ఇబ్బందికర పరిస్థితుల్లో చిక్కుకున్నపుడు విజయవాడ, గుడ్లవల్లేరు, ఘంటసాల, గూడూరు, కోడూరు, తదిత ప్రాంతాల్లో కొద్దిరోజులపాటు తలదాచుకునేవారు. మావోయిస్టు వ్యవస్థను వచ్చే ఏడాది మార్చి నెలాఖరు నాటికి తుదముట్టిస్తామని కేంద్రప్రభుత్వం తరచూ ప్రకటనలు చేస్తుండటం, ఇటీవల కాలంలో మావోయిస్టుల కదలికలపై నిఘా పెంచడం, దొరికిన వారిని దొరికినట్లుగా ఎన్‌కౌంటర్ చేస్తుండటంతో మావోయిస్టులు కృష్ణాజిల్లాకు తరలివచ్చారనే ప్రచారం జరుగుతోంది.

భీతిల్లిపోయారు!

(5వ పేజీ తరువాయి)

కోల్పోయిన ప్రయాణికులు తీవ్రంగా రోదించారు. తమ వారు ఎలా ఉన్నారో తెలియక ఆందోళన చెందారు. దాదాపు అరగంట సేపటి తర్వాతే ఎవరు ఏ పరిస్థితిలో ఉన్నారో చూసుకోగలిగారు. తెలియని ప్రాంతంలో చిమ్మచీకట్లో నిస్సహాయంగా మిగలడం వారిని కృంగదీసింది.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం : సీపీ

ఘటన జరిగిన వెంటనే స్పందించిన పోలీసులు బైపాస్ రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టారు. విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు సూచనల మేరకు సహాయక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ప్రమాదాల నివారణకు పోలీస్, రవాణా శాఖలు సంయుక్తంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కమిషనరేట్ పరిధిలో ఉన్న బ్లాక్ స్పాట్‌లు, తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలు గుర్తించినట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ బ్లింకర్లను, రంబుల్ స్టిక్కర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్లపై లారీలు, బస్సులు ఆపి డ్రైవర్లతో కొద్ది సేపు మాట్లాడడం, నీటితో కళ్లు తుడిపించడం వంటి కార్యక్రమాల ద్వారా ప్రమాదాలు నివారించినట్లు పేర్కొన్నారు. గత ఏడాది 420 మంది రోడ్డు ప్రమాదంలో మరణించగా, ఈ ఏడాది ఆ సంఖ్య 320కి తగ్గినట్లు తెలిపారు.

ముగ్గురు పంచాయతీ సిబ్బందిపై వేటు

(5వ పేజీ తరువాయి)

డీపీవో నిధులు దుర్వినియోగంపై సరియైన ఆధారాలు ఉండటంలో ముగ్గురు పంచాయతీ సిబ్బందిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, గ్రామ పంచాయతీ సిబ్బంది బదిలీల్లో భాగంగా జూనియర్ అసిస్టెంట్ షేక్ నాగులు మీరా ప్రస్తుతం గంప్రాయిలో, బిల్ కలెక్టర్ జంగం వెంకట గుప్తా పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్ ఇల్లా సుబ్బారావు ఇక్కడే పనిచేస్తున్నారు.

కొత్త ఆటోనగర్‌లో భద్రత ఎంత?

- పోలీసు నిఘా నామమాత్రం
- వెలుగుచూస్తున్న భద్రతా వైఫల్యం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కొత్త ఆటోనగర్ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. నగర శివారున ఉండే.. కొత్త ఆటోనగర్ పారిశ్రామికంగా విస్తరిస్తోంది. నిర్మానుష్యంగా, ప్రశాంతంగా ఉండే కానూరు ఆటోనగర్‌లో కొద్ది రోజుల కిందట గంజాయి గోడౌన్‌ను నిర్వహించటంతో పాటు రవాణా కార్యకలాపాలతో సంచలనమైంది. ఈ ఘటనతో కానూరు ఆటోనగర్ ఒక్కసారిగా వార్తల్లో నిలిచింది. ఇది జరిగి వారం కాక ముందే.. మావోయిస్టుల అడ్డాగా కానూరు ఆటోనగర్ భద్రత ప్రశ్నార్థకంగా మారింది. పోలీసు నిఘా తక్కువగా ఉండే ఈ ప్రాంతం అత్యంత ప్రమాదకరశక్తులకు అడ్డాగా మారటంతో ఆందోళన వ్యక్తమౌతోంది. కానూరు, ఆటోనగర్ భద్రత దిశగా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇక్కడ వందలాది సంఖ్యలో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు వీరితో సమస్యలు లేకపోయినా.. వీరి ముసుగులో ఇతర రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులు మకాం వేయటంతో.. ఎవరెవరు ఇక్కడ ఉంటున్నారన్నది అంచనా లేకుండా పోయింది. కొత్త ఆటోనగర్, ఆటోనగర్‌లలో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వారిని పనుల్లోకి తీసుకునే విషయంలో, వారికి ఆశ్రయం కల్పించే విషయంలో కానీ ఒక విధానం లేకుండా పోయింది. మావోయిస్టుల కదలికల నేపథ్యంలో, కానూరు ఆటోనగర్‌లో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులకు కానీ, స్థానికంగా కానీ పూర్తిగా వాకబు చేసిన తర్వాతే వారిని విధుల్లోకి తీసుకునే విధంగా ఐలా వంటి సంస్థలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. విజయవాడ నగరాన్ని సీసీ కెమెరాలతో జల్లెడపడుతున్న పోలీసు యంత్రాంగాలు ఇలాంటి ప్రాంతాలను వదిలేస్తున్నారు. పారిశ్రామిక ప్రాంతాలపై పోలీసులు పెద్దగా దృష్టిసారించకపోవటంతో.. నేరస్థులు, సంఘవిద్రోహ శక్తులు, మావోయిస్టుల కదలికలు సహజంగానే ఉంటాయి. పారిశ్రామికవాడల రాకపోకలపై కూడా నిఘా పెంచటానికి వీలుగా ప్రధాన మార్గాలు, ఇతర మార్గాలు, అంతర్గత మార్గాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. దీంతో పాటు పోలీసులు కార్డన్ సెర్చ్‌ల సెర్చ్‌ల ద్వారా పరిశ్రమలలో ఎవరెవరు ఉంటున్నారు? గోడౌన్ల మాటున ఏం జరుగుతోంది? ఇతర రాష్ట్రాల కూలీలకు ఆశ్రయం ఇస్తున్న గృహాలు, వారి కదలిలకలు అన్నవి తెలుస్తాయి. మావోయిస్టుల ఉదంతం నేపథ్యంలో పారిశ్రామికవాడలపై పోలీసులు సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



చికిత్స పొందుతున్న సవర డానియేల్, ఎస్.నరేష్, ధ్వంసమైన బస్సు

బస్సు ప్రమాద బాధితులకు

ప్రభుత్వాసుపత్రిలో చికిత్స

బస్టేషన్/ప్రభుత్వాసుపత్రి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లా నందిగామ సమీపంలోని అనాసాగరం ఫ్లైఓవర్‌పై మంగళవారం తెల్లవారు జామున జరిగిన బస్సు ప్రమాదంలో క్షతగాత్రులు ముగ్గురు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఒడిసాకు చెందిన మహిళకు రెండు కాళ్లు విరిగిపోగా, విజయనగరానికి చెందిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. 23 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి శ్రీకాకుళానికి వెళుతున్న కావేరి ట్రావెల్స్ బస్సు సోమవారం అర్థరాత్రి అనాసాగరం ఫ్లైఓవర్‌పై వద్ద షుగర్‌లోడ్ లారీని తప్పించబోయి ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొంది. ఈ ఘటనలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న నందిగామ పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి క్షతగాత్రులను నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ముద్దన దాసం (38) కుమారుడితో కలిసి హైదరాబాద్‌లో ఉన్న సోదరి వద్దకు వెళ్లి వస్తోంది. ఆమెకు రెండు కాళ్లు విరగ్గా.. కుమారుడికి స్వల్పంగా గాయాలయ్యాయి. విజయనగరం జిల్లా కొత్తూరు మండలం పెద్దగూడ ప్రాంతానికి చెందిన ఎస్.నరేష్ (35), సవర డానియేల్ (20) హైదరాబాద్‌లో కూలి పనుల నిమిత్తం వెళ్లారు. పనులు లేకపోవటంతో డానియేల్, నరేష్, మరో ఆరుగురు సొంతూరుకు బయలుదేరారు. డానియేల్‌కు తీవ్రగాయాలు కాగా, నరేష్, మరొకరికి స్వల్పంగా గాయాలయ్యాయి.

భవానీ భక్తులకు అమ్మ దర్శనం కల్పిద్దాం

- ఆరు లక్షల మంది భవానీలు వస్తారని అంచనా
- ఏర్పాట్లపై కలెక్టర్, సీపీ సమీక్ష

ఇంద్రకీలాద్రి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మాలధారణతో భవానీ దీక్షలను స్వీకరించి నియమనిష్ఠలతో 41 రోజుల పాటు పూజలు చేసి కనకదుర్గమ్మ దర్శనానికి తరలివచ్చే భవానీ భక్తులు సంతృప్తి చెందేలా అమ్మవారి దర్శనభాగ్యం కల్పిద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబులు అధికారులకు సూచించారు. డిసెంబరు 11 నుంచి 15 వరకు దుర్గగుడిలో జరగనున్న భవానీ దీక్షల విరమణ కార్యక్రమంపై మంగళవారం కలెక్టర్, సీపీలు సమన్వయ శాఖల జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డిసెంబరు 11 నుంచి 15 వరకు భవానీ దీక్షల విరమణలు జరుగుతాయన్నారు. గతేడాది దీక్షల విరమణకు 3.20 లక్షలమంది భవానీలు అమ్మ దర్శనానికి తరలివచ్చారని తెలిపారు. ఈ ఏడాది ఆరులక్షలకుపైగా భవానీ భక్తులు తరలివస్తారని అంచనా ఉందన్నారు. చివరి రెండు రోజుల్లో 1.50 లక్షల వరకు భవానీ భక్తులు రానున్న దృష్ట్యా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఏర్పాట్ల పర్యవేక్షణకు 36 సెక్టార్లను ఏర్పాటుచేసి ఒక్కో సెక్టార్‌కు ప్రత్యేక అధికారిని నియమించడం జరిగిందన్నారు. ఈ ఏడాది 10 వేలమందికి పైగా భక్తులు కలశ జ్యోతులను సమర్పిస్తారని ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. సీపీ ఎస్.వి.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సెక్టార్ అధికారులను సమన్వయం చేసుకొని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నగరంలో 300లకు పైగా సీసీటీవీలను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమైన ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తామన్నారు. ఆలయ ఈవో వీకే శీనానాయక్ మాట్లాడుతూ, దసరా ఉత్సవాల తరహాలోనే భవానీ దీక్షా విరమణలను విజయవంతం చేసేందుకు ప్రణాళికాయుత ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. జేసీ ఎస్.ఇలక్కియా, అదనపు డిప్యూటీ పోలీస్ కమిషనర్ జి.రామకృష్ణ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఈఈలు కె.కోటేశ్వరరావు, పి.రాంబాబు, సహాయ ఇంజనీర్లు, పర్యవేక్షకులు, వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక, నగరపాలక సంస్థ, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, మత్స్యశాఖ వీఎంసీ, సమాచార తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

దుర్గమ్మ సన్నిధిలో మంత్రి నిమ్మల



కనకదుర్గమ్మను మంత్రి నిమ్మల రామానాయుడు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో శీనానాయక్, ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణలు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. మంత్రి దంపతులు ఆలయంలో జరిగిన పంచహారతి సేవలో రుసుము చెల్లించి పాల్గొన్నారు.

కారులో ఆహారం పంపిస్తున్నదెవరు?

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కొత్త ఆటోనగర్‌లో జీ ప్లస్ త్రీ భవనంలో తలదాచుకుంటున్న మావోయిస్టులు బయటకు రావటం చూడలేదని అదే రోడ్డులోని స్థానికులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా ఉదయం, మధ్యాహ్నం వేళలో ఓ తెల్లటి కారు రావటంతో సమీపంలోని ఓ మౌల్డింగ్ కంపెనీ యజమాని గమనించారు. దీంతో ఆ కారు ఎందుకు వస్తుందో తెలుసుకోమని తమ కంపెనీ సెక్యూరిటీ గార్డుకు చెప్పడంతో సెక్యూరిటీ గార్డు కారులో ఇద్దరు వ్యక్తులతో ఆహారం ఎవరికి తీసుకు వెళుతున్నారని అడగ్గా.. తమ కంపెనీలో పనిచేసే కూలీలు ఈ భవనంలో వసతి కల్పించామని, వారికి ఆహారం ఇస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలో ఇలా కార్లలో యజమానులు తమ యూనిట్లలో పనిచేసే వారికి ఆహారాన్ని పంపిస్తారు. షిఫ్టుల వారీగా పనిచేసేవారు ఉంటారు కాబట్టి వాళ్లు ఉంటున్న ప్రాంతాలకు ఆహారం పంపుతారు. ఈ ప్రాంతంలో మామూలే కాబట్టి.. ఆ సెక్యూరిటీ అలాగా అని వెళ్లిపోయాడు. సెక్యూరిటీ గార్డును పెద్దగా కారులో ఉన్న సిబ్బంది పట్టించుకోలేదు. తర్వాత సెక్యూరిటీ గార్డుకు అనుమానం వచ్చింది. ఆహారం తీసుకుని వెళుతున్నారే తప్ప.. పై నుంచి పనులకు వెళ్లటానికి ఎవరూ దిగిరావటం లేదని గమనించాడు. అనుమానం వచ్చినా కారులో వారిని ప్రశ్నించలేదు. 'ఆంధ్రజ్యోతి' స్థానికులను ప్రశ్నిస్తున్న క్రమంలో సెక్యూరిటీ తాను గమనించిన విషయాలను చెప్పాడు.

మహిళా సానుభూతి పరురాలు ఎవరు?

కానూరు ఆటోనగర్‌లో తలదాచుకుంటున్న మావోయిస్టులకు విజయవాడ నగరానికి చెందిన ఓ మహిళా సానుభూతిపరురాలు సహాయం చేసినట్టు తెలుస్తోంది. ఆ మహిళను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టుల ఆశ్రయానికి ఆమె సహకరించారని తెలుస్తోంది. చత్తీస్‌ఘడ్, ఝార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన మావోయిస్టులకు తెలుగుభాష తెలియదు. అలాంటిది వీరు కొత్త ఆటోనగర్‌లో ఆశ్రయం పొందటానికి ఇల్లు తీసుకోవటం అసాధ్యం. పనులు కోసం వచ్చినట్టుగా కొత్త ఆటోనగర్‌లో తిరుగాడుతూ స్థానికంగా ఉన్న కొందరు చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన కార్మికులతో మాటలు కలిపి ఖాళీగా ఉంటున్న భవనాన్ని గుర్తించినట్టుగా ప్రచారం జరుగుతున్నా.. బెజవాడకు చెందిన మహిళా సానుభూతిపరురాలే ఈ భవనాన్ని వాచ్‌మెన్ ద్వారా తాత్కాలికంగా అద్దెకు ఇచ్చినట్టుగా పోలీసులు భావిస్తున్నట్టు తెలుస్తోంది. దీనిపై బుధవారం పోలీసులు మరింత స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. ఆహారం కూడా ఆ మహిళా సానుభూతిపరురాలే పంపిస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

రెక్కీకి వచ్చారా..!

మావోయిస్టులు ఇక్కడ తాత్కాలికంగా కొద్దిరోజులు ఉండి.. సేఫ్ ప్లేస్‌లకు వెళ్లిపోవాలన్న ఆలోచనలు చేస్తుండవచ్చన్న అనుమానాలను కూడా పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. అలా అని రెక్కీ నిర్వహించటానికి కూడా అవకాశం లేకపోలేదని చెబుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	130,139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 650

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

గుణదల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రమాదంలో చనిపోయిన కార్యకర్త దమిరి రత్నకుమారి కుమారుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసే కార్యక్రమం 2వ డివిజన్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగింది. టీడీపీ కార్యకర్త నాళం నరేంద్ర కుమారుడి కళాశాల ఫీజు నిమిత్తం రూ.15వేలు అందజేశారు. దమిరి రత్నకుమారి కుమారుడి కుటుంబానికి రూ. 15వేలు అందజేసి ఆ కుటుంబానికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు దాసరి గాబ్రియేలు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ రత్నశ్రీ, సుగసాని కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ -3 పరిధిలో పలు ప్రాంతాల్లో 20, 21తేదీల్లో తాగునీటి సరఫరా నిలిపివేత

విద్యాధరపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ సర్కిల్ -3 పరిధిలోని ఐటీఐ కాలేజీ సమీపంలో ఉన్న వాటర్ పైప్‌లైన్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు మంగళవారం వీఎంసీ విభాగం సంబంధిత అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న సాయంత్రం నుంచి 21న ఉదయం వరకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 4వ డివిజన్ పరిధి ఫిలిం కాలనీ, వరలక్ష్మీనగర్, సిరిపురం కాలనీ, శాంతినగర్, వెంకటేశ్వరనగర్‌లోని కొంతభాగం, 5వ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐసీ కాలనీ, మిథిలానగర్, జయప్రకాష్ నగర్, రేడియో కాలనీ, క్రీస్తురాజపురం మెయిన్ రోడ్డు, పాత 5వ నెంబరు రూట్, అశోక్‌నగర్, బ్యాంక్ కాలనీ-1 తదితర ప్రాంతాలలో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 21న సాయంత్రం నుంచి పాక్షికంగా నీటి సరఫరా ఉంటుందని తెలిపారు.



గుండు కోటయ్య వీధిలో శుభ్రం చేయిస్తున్న వార్డు మేస్త్రి

చెత్తాచెదారం తొలగింపు

కృష్ణలంక, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కృష్ణలంక 20వ డివిజన్ గుండు కోటయ్య వీధి, పాలపర్తి వారి వీధి, శంకరమఠం తదితర వీధుల్లో మంగళవారం వీఎంసీ సిబ్బంది రోడ్లను శుభ్రం చేయించారు. రోడ్డు కిరువైపులా మొలిచిన గడ్డి, పిచ్చిమొక్కలతో పాటు పూడుకుపోయిన ఓపెన్ డ్రెయినేజీని సైతం శుభ్రం చేయించారు.



కుళాయిని ప్రారంభిస్తున్న కొక్కెర తిరుపతయ్య తదితరులు

మంచినీటి కుళాయి ప్రారంభం

రాణిగారితోట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 18వ డివిజన్‌లోని సాయిబాబు గుడిలో ఏర్పాటు చేసిన మంచినీటి కుళాయిని మంగళవారం డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొక్కెర తిరపతయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సొంత నిధులు నుంచి ఈ కుళాయిని ఏర్పాటు చేయడం జరిగిందని, డివిజన్ లో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరెపల్లి వెంకటేశ్వర్లు, గండ్ర రాజు, గండ్ర వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



కృష్ణలంక ఫీడర్‌రోడ్డులో రోడ్డుకిరువైపులా పెరిగిపోయిన ఆక్రమణలు

పెరిగిన ఆక్రమణలు...ట్రాఫిక్ ఇబ్బందులు

● కుచించుకుపోయిన ఫీడర్ రోడ్డు ● పట్టించుకోని కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు

కృష్ణలంక, ఆంధ్రజ్యోతి : కృష్ణలంక ఫీడర్‌రోడ్డులో ఎం హోటల్ సెంటర్ నుంచి సత్యం హోటల్ సెంటర్ వరకు రోడ్డుకిరువైపులా ఆక్రమణలు పెరిగిపోవడంతో రోడ్డు కుచించుకుపోయింది. దీంతో వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్డుకిరువైపులా కార్లు, ఆటోలు, ఆటో రిపేర్లు, పండ్లు, తదితర వ్యాపారాలు చేస్తున్నారు.

ప్రతి వ్యాపారి వెనుక ఛోటా మోటా రాజకీయ నాయకులు ఉండటంతో కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు కూడా వారిని కదపలేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసులు అప్పుడప్పుడు వచ్చి ఆక్రమణలను తొలగించినా తిరిగి వారం పది రోజుల తర్వాత తీసిన చోటే ఆక్రమణలు తిరిగి వెలుస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు రోడ్డుకిరువైపులా వున్న ఆక్రమణలను తొలగించి రోడ్డుపై వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపైనే పార్కింగ్...వాహనదారుల పాట్లు



నిర్మలా కాన్వెంట్ రోడ్లో...

భారతీనగర్, ఆంధ్రజ్యోతి: ఐదో నెంబర్ రోడ్డు(రమేష్ ఆసుపత్రి సెంటర్), నిర్మలకాన్వెంట్ రోడ్డులో ఉదయం, సాయంత్రం సమయంలో ప్రయాణించాలంటే నరకప్రాయంగా మారుతోంది. ఈరోడ్డులో ఇరువైపులా పలు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు సంబంధించి కార్యాలయాలు, హోటల్స్, షాపింగ్ మాల్స్ ఉన్నాయి. వాటికోసం వచ్చే ప్రజలు తమ వాహనాలను సమీపంలోని రోడ్లో పార్కింగ్ చేస్తున్నారు. అంతే కాకుండా చిరు వ్యాపారులు కూడా ఈ రోడ్లో పెద్దసంఖ్యలో ఉండడంతో కొనుగోలుదారులు తమ వాహనాలను రోడ్డుమీద నిలిపివేస్తున్నారు. ఈ వాహనాలు గంటల కొద్ది నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు ప్రధాన రోడ్డు కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



రమేష్ ఆస్పత్రి రోడ్లో ..

ప్రజా చైతన్యంతోనే సైబర్ నేరాలకు కళ్లెం

● సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్



కరపత్రాన్ని అందజేస్తున్న గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్

గుణదల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు రోజు రోజుకు పెరిగిపోతున్న తరుణంలో ప్రజా చైతన్యంతోనే కళ్లెం వేయగల్గుతామని గుణదల పోలీస్ స్టేషన్ సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. సైబర్ నేరాలపై గుణదల్లోని ఎస్‌బీఐలో సిబ్బందికి మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. డిజిటల్ అరెస్టుల పేరుతో సైబర్ నేరస్తులు పెద్ద మొత్తంలో సొమ్ములు చేసుకుం టున్నారని వివరించారు. బ్యాంకు లింకుతోనే ఎక్కువ నేరాలు నమోదు అవుతున్నాయన్నారు. వినియోగదారులు, బ్యాంకు సిబ్బంది చైతన్యంతో ఉంటే సైబర్ నేరస్తులకు చెక్ పెట్టడం సులభం అని చెప్పారు. ఎవరి మీద అయినా అనుమానం వస్తే తక్షణమే తమకు సమాచారం అందించాలని సూచించారు.

ఆహార అలవాట్లతో ఊబకాయాన్ని అధిగమించొచ్చు

● ఎండోక్రైనాలజిస్ట్ అమూల్య



మాట్లాడుతున్న ఎండోక్రైనాలజిస్ట్ అమూల్య, చిత్రంలో డాక్టర్ సమరం

బెంజిసర్కిల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేటి కాలంలో చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు ఊబకాయం పెద్ద సమస్యగా మారిందని, జీవనశైలి, ఆహారపు అలవాట్లలో మార్పులతో ఊబకాయం సమస్యను అధిగమించవచ్చని ఎండోక్రైనాలజిస్ట్ వై. అమూల్య తెలిపారు. మంగళవారం వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన ఆరోగ్య సదస్సులో స్వచ్ఛందంగా బరువు తగ్గడం కష్టమా అనే అంశంపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫ్యాటీ ఫుడ్ తీసుకోవడం, వ్యాయామం లేకపోవడం ఊబకాయానికి ప్రధాన కారణమన్నారు. బరువు తగ్గడం నిదానంగానూ, ఓ పద్ధతిగానూ ఉంటేనే అది నిలకడగా ఉంటుందన్నారు. సదస్సులో పలువురు అడిగిన ప్రశ్నలకు ఆమె సందేహ నివృత్తి చేశారు.

అబాకస్ పోటీల్లో విజయవాడ విద్యార్థుల ప్రతిభ



భారతీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చెన్నైలో నిర్వహించిన అబాకస్ ఇంటర్నేషనల్ పోటీల్లో పటమట న్యూపోస్టల్ కాలనీలోని అబకస్ సెంటర్ విద్యారులు పలు అవార్డులు గెలుపొందారని సెంటర్ నిర్వాహకురాలు మానస మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ పోటీల్లో హన్విక సాయి మూడో బహుమతి, పూజేష్ రెండో బహుమతి గెలుపొందగా, రేవంత్, కీర్తిక, హృషికేష్, రేషికలు బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డులు అందుకున్నారని తెలిపారు.



ఆత్మహత్య నివారణపై అవగాహన

విజయవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మెడికల్ కాలేజీలో మంగళవారం ఆత్మహత్య నివారణ -వ్యక్తిగతంగా సహాయం పొందడమెలా అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.వై.రావు మాట్లాడుతూ, విద్యార్థుల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచడం, వారి స్నేహితులు, కుటుంబ సభ్యుల్లో మానసిక సమస్యలను గుర్తించే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో 200 మంది మెడికల్ విద్యార్థులు శిక్షణ పొందారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్, సూసైడ్ ప్రివెన్షన్ ఇండియా ఫౌండేషన్ గిరిషాజైన్, సైకియాట్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రామ్ నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలు రాకుండా చర్యలు తీసుకోండి

పలు సంస్థలకు వీఎంసీ నోటీసులు జారీ

కార్పొరేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థలు, ఆసుపత్రులు, క్రీడా సముదాయాలు, బస్‌స్టాండ్‌లు, డిపోలు (ఇంటర్-స్టేట్ బస్ టెర్మినల్స్ సహా) రైల్వే స్టేషన్ల ప్రాంగణాల్లోకి వీధి కుక్కలు రాకుండా చర్యలు తీసుకోవాలని మంగళవారం వీఎంసీ ప్రజారోగ్య విభాగం నోటీసులు జారీ చేశారు.

ఈ సందర్భంగా చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలో తమ ప్రాంగణాల్లోకి వీధి కుక్కలు రాకుండా కంచె ఏర్పాటు చేసుకోవాలని, ఆహార పదార్థాలు విచ్చలవిడిగా వేయకుండా, వీధి కుక్కలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 61 ఆహార కేంద్రాల్లోనే ఆహారం పెట్టలన్నారు. ప్రతి సంస్థ ఈ అంశాలపై ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించుకొని, ఆ నోడల్ ఆఫీసర్ బాధ్యత వహించాలన్నారు.

నోడల్ ఆఫీసర్ వివరాలను నగరపాలక సంస్థకి తెలియపరచాలన్నారు. ఈ నోటీసు అందిన 10 రోజుల్లో ఆయా సంస్థలు ఏర్పాట్లు చేసుకోవాలని నోటీసు జారీ చేశారు.

పుస్తక పఠనంపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవాలి

వైస్ ప్రిన్సిపాల్ విద్యాసాగర్



విజేతలతో వైస్ ప్రిన్సిపాల్ విద్యాసాగర్, తదితరులు

భారతీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నేటి డిజిటైజేషన్ వేగంగా పెరుగుతున్న ప్పటికి విద్యార్థులు పుస్తకపఠనంపై ఆసక్తి పెంచుకోవాలని ఆంధ్రా లయోలా ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.విద్యాసాగర్ తెలిపారు. మంగళవారం ఆంధ్ర లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో ఐక్యూఏసీ, గ్రంథాలయం విభాగం సంయుక్త ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైస్ ప్రిన్సిపాల్ వి.విద్యాసాగర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల ప్రగతికి, వ్యక్తిత్వ వికాసానికి ప్రధాన వనరులు అని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల సీఈవో ఫాదర్ ఇమ్మానుయేల్, డీన్ సిస్టర్ క్యాండీ డి కూనా, ఆంగ్ల అధ్యాపకుడు సుజీత్, గ్రంథాలయ విభాగం అధ్యాపకుడు స్వాతి కిరణ్, చైతన్యదాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

సూచిక బోర్డుల చుట్టూ పిచ్చిమొక్కల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఫిలింకాలనీ రెండో క్రాస్ రోడ్లో సూచిక బోర్డు చుట్టూ తొలగించిన పిచ్చిమొక్కలు

భారతీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫిలిం కాలనీలోని అంతర్గత రోడ్లో సూచిక బోర్డుల చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలను మంగళవారం వీఎంసీ సిబ్బంది తొలగించారు. 4వ డివిజన్‌లోని ఫిలిం కాలనీలో అడ్రస్ తెలిసేదెట్లా అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో కథనంలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు సిబ్బందిని పంపించి ఆ రోడ్డులోని పిచ్చిమొక్కలను తొలగించి సూచిక బోర్డులు కనిపించేలా చేసి సమస్యను పరిష్కరించారు.

విజయవాడ రైల్వే డివిజన్ సమస్యలను పరిష్కరించండి

డీఆర్‌ఎం మోహిత్ సోనాకియాను కోరిన ఎంపీ కేశినేని శివనాథ్



డీఆర్‌ఎం మోహిత్ సోనాకియాతో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్

రైల్వేస్టేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని దక్షిణమధ్య రైల్వే డీఆర్‌ఎం మోహిత్ సోనాకియాను ఎంపీ కేశినేని శివనాథ్ కోరారు. మంగళవారం విజయవాడ డీఆర్‌ఎం మోహిత్ సోనాకియాను ఆయన చాంబర్‌లో ఎంపీ కేశినేని శివనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ విజయవాడ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు, కొండపల్లి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ విస్తరణ పనులతో పాటు లెవల్ క్రాసింగ్ గేట్ల అంశంపై డీఆర్‌ఎంతో చర్చించారు. వాంబే కాలనీ - మధురానగర్ మధ్య ఎల్‌హెచ్‌ఎస్ నిర్మాణం త్వరగా చేపట్టాని కోరారు. కేఎల్ రావు బ్రిడ్జి (ఎర్రకట్ట) వద్ద ఆర్‌యూబీలు నిర్మించాలని కోరారు. ఆర్‌వోబీ, ఆర్‌యూబీల నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చిన లెవెల్ క్రాసింగ్ నెం. 316, 147, 148, 8 నిర్మాణానికి త్వరగా టెండర్లు పిలిచి, ప్రాజెక్ట్ పనులను ప్రారంభించాలన్నారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం సానుకూలంగా స్పందించారు.

మర్యాదపూర్వక కలయిక



వన్‌టౌన్: విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారిణి ఎస్.విజయలక్ష్మిని బందరు రోడ్డులోని ఆమె కార్యాలయంలో మంగళవారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ ఆమెకు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలో ప్రజలకు అందిస్తున్న సేవలను ఎంపీకి వివరించారు.

దుర్గగుడిలో సహస్ర లింగార్చన



ఇంద్రకీలాద్రి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడిలో మంగళవారం రాత్రి సహస్రలింగార్చన సేవ, సహస్రదీపార్చన, ఊంజల్ సేవలు అత్యంత భక్తి నిష్ఠలతో జరిగాయి. ముఖ్య అర్చకుడు ఆర్.శ్రీనివాస శాస్త్రి సహస్రలింగార్చన చేశారు. అర్చకులు సహస్రలింగార్చనలో బిల్వ పత్రాలు, వివిధ రకాల పుష్పాలను సమర్పించారు. సహస్ర లింగార్చన, సహస్ర దీపార్చన, ఊంజల్ సేవలలో దేవస్థానం ఛైర్మన్ బొర్రా రాధాకృష్ణ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ప్రతిరోజూ సాయంత్రం శ్రీమల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం వద్ద దీపోత్సవం నిర్వహిస్తున్నారు.

చరిత్ర మరువని జలప్రళయం

● శవాల దిబ్బగా దివిసీమ ● ఉప్పెనకు 48 ఏళ్లు

(నాగాయలంక - ఆంధ్రజ్యోతి)

దివిసీమ వాసులు 1977 నవంబరు 19న విరుచుకుపడిన జలప్రళయాన్ని తలచుకుంటే నేటికీ వణికిపోతుంటారు. 1977 నవంబరు 19 శనివారం కాళరాత్రిగా మారింది. పెను ఉప్పెన గ్రామాలకు గ్రామాలను సముద్ర గర్భంలోకి ఈడ్చుకుపోయింది. 30 మీటర్ల ఎత్తున ఎగసిపడిన రాకాసి నిముషాల్లోను గ్రామాలను తుడిచిపెట్టేసింది. దివిసీమ శవాల దిబ్బగా మారింది. 10 వేల మందికి పైగా ప్రజలు విగతజీవులయ్యారు. వేలాది పశు సంతతి మృత్యువాత పడింది. కోట్లాది రూపాయలు విలువ ఆస్తినష్టం జరిగింది. నాగాయలంక, కోడూరు మండలాల తీర ప్రాంత గ్రామాలలో ఎక్కడ చూసినా శవాల గుట్టలే. పోయిన వారి ఆప్తుల రోదనలు, ఆర్తనాదాలు సముద్రుడి హోరులో కలిసిపోయాయి. నాగాయలంక మండలంలోని ఎదురుమొండి, ఈలచెట్లదిబ్బ, నాచుగుంట, దీనదయాళ్‌పురం, కమ్మనమోలు, సొర్లగొంది, సంగమేశ్వరం, ఏటిమొగ, గుల్లలమోద, భావదేవరపల్లి, కోడూరు మండలంలోని గొల్లపాలెం, ఊటగుండం, బసవన్నవానిపాలెం, హంసలదీవి, పాలకాయితిప్ప, ఉల్లిపాలెం, ఇరాలి తదితర గ్రామాలు ఉప్పెన విలయానికి ప్రత్యక్ష సాక్ష్యాలు. నాటి ఉప్పెనలో ప్రాణాలు కోల్పోయిన వారిని ఏడాదికొకసారి స్మరించుకోవటం మానవీయ ధర్మం. అప్పటి ఉప్పెన మృతుల జ్ఞాపకాల చిహ్నంగా దివిసీమ ముఖద్వారం వద్ద నిర్మించిన పైలాన్ స్తంభం ఎప్పటికీ ప్రజలను హెచ్చరిస్తూనే ఉంది. దివిసీమ గాంధీ, మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు దివిసీమ ఉప్పెన బాధితులకు అందించిన సేవలు అనిర్వచనీయం, నిత్యస్మరణీయం.

జ్ఞాపకం



మచిలీపట్నం టౌన్ : దివిసీమ ప్రళయాన్ని కళ్లారా చూసిన శారదనాగర్‌లోని ప్రత్యక్ష సాక్షుల అనుభవం వారి మాటల్లోనే..

ఒళ్లు గగుర్పొడుస్తుంది



పెనుగాలులు వీచాయి. ఇళ్లల్లోకి నీరు వచ్చేసింది. తల మునిగిపోయే నీరు. భార్యను బుజాన వేసుకుని తీసుకుని వెళ్లా ఎత్తైన ప్రదేశానికి వెళ్లాం. ఎలా బతికిబయపడ్డామో తలుచుకుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది.

- కంఠంనేని నాగభూషణం, శారదానగర్

పెళ్లయిన వెంటనే జరిగిన సంఘటన



పెళ్ళయిన వెంటనే జరిగిన సంఘటన ఇది. ఇల్లు మొత్తం కొట్టుకుపోయింది. అప్పుడు మా ఇల్లు మేడింపేటలో ఉండేది. ఇళ్ల పైకి వెళ్లి ప్రాణాలు కాపాడుకున్నాము. కూలిపోయిన ఇళ్లలో 80 మంది చనిపోయారు.

- రాంవరపు నతానియేలు

స్నేహితులు చనిపోయారు



మా పేటలోకి 10 అడుగుల ఎత్తున సముద్రపు నీరు వచ్చింది. మా స్నేహితులు నలుగురు చనిపోయారు. చెట్లు, పుట్టలు ఎక్కి కొందరు బతికారు. కొడాలి వజ్రం చనిపోయింది. కొడాలి సుందరరావు చెట్టు ఎక్కి బతికాడు.

- రాంవరపు తాతయ్య

ఆడవాళ్లను బతికించారు



మా ఆయన కరుణాకరరావు వాసాలు పగుల కొట్టి ఇంట్లో నీళ్లలో ఇరుక్కుపోయిన మమ్మల్ని బతికించాడు. ఒక చంటి పిల్లను బతికించుకోగలిగాను.

- జూనపూడి దేవనమ్మ

ఏవీఎస్ రెడ్డి, మండలి కృష్ణారావు సేవలు చిరస్మరణీయం



దివిసీమ ఉప్పెన సమయంలో గ్రామాలకు గ్రామాలకు కొట్టుకుపోయాయి. సర్వేకు వెళ్లాం గ్రామాలు పునర్నిర్మించేందుకు రెండేళ్లు పట్టింది. ఏవీఎస్ రెడ్డి వంటి కలెక్టర్లు, మండలి వెంకటకృష్ణారావు వంటి నాయకు లు దివిసీమను మళ్లీ పునర్నిర్మించారు.

- ఎండి సిలార్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్

అనాదిగా షెల్టర్‌జోన్ బెజవాడ

● ఎప్పుడూ విజయవాడనే ఎంచుకున్న మావోయిస్టులు ● కొండపల్లి సీతారామయ్య ఉద్యమ ప్రస్థానం ఇక్కడి నుంచే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడ కమ్యూనిస్టు ఉద్యమ కేంద్రంగా ఉన్న దశలో కొండపల్లి సీతారామయ్య విద్యార్థి, యువజన పోరాటాలు చేశారు. ఆ తర్వాత రివల్యూషనరీ యూత్ అసోసియేషన్ (ఆర్‌వైఏ) వంటి సంస్థల ద్వారా సభ్యత్వాన్ని గణనీయంగా పెంచుకున్నారు. 1980లో పీడబ్ల్యూజీ ఏర్పడటంలో కూడా విజయవాడ కీలక పాత్ర పోషించింది. విజయవాడ నగరంతో కొండపల్లి సీతారామయ్యకు అవినాభావ సంబంధం ఉంది. ఉద్యమం ప్రారంభ రోజులు ఆయన బెజవాడ నుంచి సాగిస్తే.. ఆయన చివరి రోజులు కూడా విజయవాడలోనే గడిచాయి. తన మనవరాలు సంధ్య ఇంట్లో కొండపల్లి సీతారామయ్య చనిపోయారు. ఆ తర్వాత క్రమంలో నక్సల్‌బరీ ఉద్యమం ఊపందుకున్న తరుణంలో కూడా ఎందరో అగ్రనేతలు విజయవాడకు వస్తూ పోతూ ఉండేవారు. ముఖ్యంగా షెల్టర్ కోసం రాకపోకలు సాగించే వారు. అజ్ఞాతవాసం చేయాల్సి వచ్చిన ప్రతిసారీ కూడా నక్సల్స్ విజయవాడకే వచ్చేవారు. సుదీర్ఘ సాయుధపోరాటంలో కొంత కాలం విశ్రాంతి తీసుకోవటానికి వచ్చే వారు. అనారోగ్యానికి గురైన సందర్భంలో చికిత్స తీసుకోవటానికి కూడా వైద్యానికి కేంద్రమైన బెజవాడకే వచ్చేవారు. అప్పట్లో కమ్యూనిస్టు నేపథ్యం కలిగిన వారు ప్రజలకు సేవ చేయటానికి ఆసుపత్రులు నిర్వహించే వారు. అలాంటి ఆసుపత్రులకు నక్సల్స్ వచ్చి చికిత్స తీసుకునేవారు.

> మావోయిస్టులకు బెజవాడ ఎప్పుడూ షెల్టర్ జోన్‌గానే నిలిచింది. కొండపల్లి సీతారామయ్య స్థాపించిన పీపుల్స్ వార్ గ్రూప్ మొదలు నక్సలైట్లు, నేటి మావోయిస్టుల వరకు పేరేదైనా పూర్వం నుంచి బెజవాడను షెల్టర్‌జోన్‌గా చేసుకున్నారు. కృష్ణాజిల్లా గుడివాడ మండలం జొన్నపాడు గ్రామానికి చెందిన పీపుల్స్ వార్ గ్రూప్ (పీడబ్ల్యూజీ) అధినేత కొండపల్లి సీతారామయ్య ఉద్యమాన్ని తీవ్రతరం చేయటానికి ముందుగా ఎంచుకున్నది విజయవాడనే!

తాత్కాలికంగా జనారణ్యంలో ఉండాలంటే విజయవాడ సురక్షిత ప్రాంతంగా భావించేవారు. పీపుల్స్ వార్ గ్రూప్ ఇక్క డే పుట్టినా.. నక్సలిజం, మావోయిస్టులు ఇలా పేర్లు ఏవైనా సరే.. విజయవాడ కేంద్రంగా మారణహోమా లు ఎప్పుడూ జరగలేదు. ఒక్కసారి మాత్రమే సున్నపుబట్టీల సెంటర్ దగ్గర నక్సలైట్లు హత్య చేశారు. అది తప్ప ఎప్పుడూ ఈ ప్రాంతం కేంద్రంగా మారణహోమాలు జరగలేదు. మిలీనియంలో మావోయిస్టులు బలం పెంచుకునే క్రమంలో తాము అత్యంత సురక్షిత ప్రాంతంగా భావించే విజయవాడకు రాకెట్ లాంచర్లు, పేలుడు పదార్థాలు, డిటొనేటర్లు, జిలెటిన్ స్టిక్స్ వంటివి దిగుమతి చేసుకున్నారు. ఇది భారీ ఆపరేషన్‌గా నిలిచిపోయింది.

విజయవాడకు దిగుమతి చేసిన వీటిని అడవుల లోకి తీసుకువెళ్లే క్రమంలో నిజామాబాద్, ప్రకాశం జిల్లా వంటి ప్రాంతాలకు తరలించిన క్రమంలో పోలీసులకు చిక్కడం జరిగింది. విజయవాడలో ఓ ప్రైవేటు ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసుకు వచ్చిన రాకెట్ లాంచర్ల విడిభాగాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇవి కనుక మావోయిస్టులకు చేరి ఉంటే మరింతగా నరమేధ జరిగి ఉండేది. ఎన్నో మారణహోమాలు చూసి ఉండేవాళ్లం. చరిత్ర చూస్తే ఎన్నో మార్పులకు, మావోయిస్టులకు కార్యస్థలంగా, షెల్టర్‌జోన్‌గా, ఆయుధాల దిగుమతి కేంద్రంగా, సురక్షిత ప్రాంతంగా ఉండేది. అలాంటి విజయవాడ కాలక్రమంలో సెక్యూరిటీ పరంగా దుర్భేద్యంగా మారింది. ఎప్పటిలా తాము సురక్షితంగా భావించే విజయవాడ నగరాన్ని అణువణువూ పోలీసులు సీసీ కెమెరాలతో దిగ్బంధించటంతో నగర శివారుకు మావోయిస్టులు రూటు మార్చారు. కానూరు కొత్త ఆటోనగర్‌ను ఎంపిక చేసుకున్నారు. ఇంటెలిజెన్స్ వ్యవస్థల కారణంగా కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు పెద్ద సంఖ్యలో మంగళవారం పోలీసులకు చిక్కారు. దీంతో రానున్న రోజులలో విజయవాడ, శివారు ప్రాంతాలను మావోయిస్టులు సురక్షిత ప్రాంతాలుగా భావించే పరిస్థితి ఉండకపోవచ్చు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి

● అరెస్టు చేసిన మావోయిస్టు నేతలను కోర్టులో హాజరుపర్చాలి

● పౌరహక్కుల సంఘం నేతల డిమాండ్

గాంధీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : మారేడుపల్లిలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘం నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం నేతలు మాట్లాడారు.

ఎన్‌కౌంటర్ పేరుతో మావోయిస్టు నాయకుడు హిడ్మా, మరో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకుని చిత్రహింసలకు గురిచేసి కాల్చిచంపి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పోలీసులు అదుపులోకి తీసుకున్న మావోయిస్టు పార్టీ నేతలను వెంటనే కోర్టులో హాజరుపర్చా లన్నా రు. వీరిని కూడా ఎన్‌కౌంటర్ చేసి చంపే అవకాశం ఉన్నందున న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకుని జీవించే హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు. పౌరహక్కుల సం ఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలుక చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి టి.ఆంజనేయులు, విరసం అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ, పీడీఎం రాష్ట్ర నేత జీవీ వెంకటేశ్వరరావు, పీకేఎస్ రాష్ట్ర నేత బి.కొండారెడ్డి పాల్గొన్నారు.

పారిశ్రామికాభివృద్ధిలో రోల్‌మోడల్ చేద్దాం

● ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్ఫూర్తితో అడుగులేద్దామని, పారిశ్రామిక అభివృద్ధిలో జిల్లాను రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడంలో సమిష్టిగా కృషి చేద్దామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం మంగళవారం జరిగింది. పారిశ్రామిక అనుమతులు, పరిశ్రమలకు ప్రోత్సాహకాలు తదితరాలతో పాటు వివిధ పథకాల అమలుపై సమావేశంలో చర్చించారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఇటీవల విశాఖలో జరిగిన పెట్టుబడుల సదస్సులో ఎన్టీఆర్‌జిల్లాకు సంబంధించి దాదాపు రూ.69 వేల కోట్లతో 100 ఎంవోయూలు కుదిరాయన్నారు. అన్ని కోణాల్లో పెట్టుబడిదారులకు అవసరమైన సహాయ సహకారాలను అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర సాకారానికి పారిశ్రామిక అభివృద్ధి కీలకమన్నారు. ఇటీవల విజయవాడ సెంట్రల్, మైలవరం నియోజకవర్గాల్లో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్సులతో పాటు జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కుకు శంకుస్థాపన జరిగినట్లు తెలిపారు. వివిధ అనుమతులకు సంబంధించి ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి నవంబరు 17 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 6,037 దరఖాస్తులు రాగా 5,949 దరఖాస్తులు పరిష్కారమయ్యాయన్నారు. మిగిలిన వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. వివిధ పారిశ్రామిక అభివృద్ధి విధానా ల కింద 18 క్లెయిమ్‌లకు రూ.1.54 కోట్ల మేర పారిశ్రామిక ప్రోత్సాహకాలకు కమిటీ ఆమోదం తెలిపింది. పరిశ్రమల ఏర్పాటుకు అత్యుత్తమ వాతావరణం రాష్ట్రంలోనూ జిల్లాలోనూ వుందన్నారు. ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త కార్యక్రమాన్ని ముం దుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. 2025-26కు సంబంధించి పీఎంఈజీపీ, పీ ఎం విశ్వకర్మ పథకాల అమలులో పురోగతి ని కమిటీలో చర్చించి, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు, యూనిట్ల ప్రారంభానికి కలెక్టర్ లక్ష్మీశ దిశానిర్దేశం చేశారు. రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎం ఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ (ర్యాంప్)కు సంబంధించి షెడ్యూల్ ప్రకారం వర్క్‌షాపులను నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. జిల్లా పరిశ్రమల అధికారి ఎం.మధు, డీపీవో పి.లావణ్య కుమారి, సాంఘిక సంక్షేమ అధికారి రమాదేవి, ఎల్‌డీఎం కె.ప్రియాంక, పీసీబీ ఈఈ పి.శ్రీనివాసరావు, ఏపీఐఐసీ, వివిధ శాఖల అధికారులు, పారిశ్రామిక అసోసియేషన్ల ప్రతినిధులు కనకదుర్గ, మురళీకృష్ణ, వక్కలగడ్డ భాస్కరరావు, బుచ్చిబాబు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ


సాంస్కృతిక సమాఖ్య సేవలు అభినందనీయం



ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న న్యాయాధికారి దేవు నరసింహారావు

విజయవాడ కల్చరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : కళా, సాంస్కృతిక రంగాల్లో అఖిల భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య సేవలు అభినందనీయమని విజయవాడ మొదటి మెట్రోపాలిటన్ స్పెషల్ మెజిస్ట్రేట్ దేవు నరసింహారావు అన్నారు. గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. సమాజ అభివృద్ధిలో కళలు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. సామాజిక సేవలు చిరస్మరణీయంగా నిలుస్తాయన్నారు. నిరంతరం సే లందించడంలో డాక్టర్ గణగళ్ల విజయకుమార్ సఫలీకృతమయ్యారన్నారు. భారతదేశంలోని 16 రాష్ట్రాల్లో ఘనత సాధించిన విజయకుమార్ అభినందనీయుడని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రీజినల్ జా యింట్ డైరక్టర్ సిహెచ్.వి.ఎస్.ఎన్ కుమార్ అన్నారు ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, ఒడిస్సాల నుంచి వచ్చిన రంగాల ప్రముఖులను విశిష్ట అవార్డులతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో షర్మిల సంపత్, కిల్లాడ అమ్మాజీ, ఏడుకొండలు, జగదీశ్వర శర్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక ప్రదర్శన, సినీ సంగీత విభావరి ఆకట్టుకున్నాయి.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండండి



సైబర్ నేరాలపై బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

విజయవాడ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ పెట్టుబడులు, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు సిబ్బందికి, ఖాతాదారులకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ యంత్రాంగం సూచించింది. విజయవాడని 277 బ్యాంకు శాఖల్లో మంగళవారం సైబర్ సురక్ష కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించారు. సైబర్ చట్టాలపై శిక్షణ తీసుకున్న పోలీసు అధికారులు వారికి నిర్దేశించిన బ్యాంకులకు వెళ్లి ప్రజలకు, బ్యాంకు సిబ్బందికి అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్ట్ అనేదే లేదని, వీడియో కాల్స్ ద్వారా వచ్చే బెదిరింపులకు భయపడొద్దని సూచించారు. సీబీఐ, పోలీస్, కస్టమ్స్, ఈడీ, జడ్జిలు అంటూ నేరగాళ్లు వీడియో కాల్ ద్వారా భయపెడతారని హెచ్చరించారు. ఆన్‌లైన్ పెట్టుబడుల మోసాలపైనా అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులను నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. ఫేస్‌బుక్, టెలిగ్రామ్, వాట్సాప్, ఇన్‌స్టా వంటి సోషల్ మీడియాలో వచ్చే పెట్టుబడి ప్రకటనలు చూసి మోసపోవద్దని సూచించారు.

పరీక్షలకు ముందే విద్యార్థులు రికార్డుల్లోని తప్పులను సరిదిద్దుకోవాలి : డీఈవో

విజయవాడ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు తమ వివరాలు పాఠశాల రికార్డులో ఉన్న విధంగా ఉన్నాయో లేదో యు డైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో సరిచూసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా డీఈవో యూవీ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వివరాలను ఒకసారి సరిచూసుకుని, తప్పులకు ఆస్కారం లేకుండా ప్రధానోపాధ్యాయులకు తెలియపరిస్తే వారు అప్‌లోడ్ చేస్తారని పేర్కొన్నారు. ఒకవేళ విద్యార్థుల వివరాలు తప్పులు నమోదై ఉంటే ఆధార్ కార్డు సరిచేసుకుని, అపార్ ఐడీ, యుడైస్ ప్లస్ వెబ్‌సైట్‌లో తప్పులు సరిచేసుకోవడానికి పాఠశాల విద్యాశాఖ అవకాశం కల్పించిందన్నారు. పరీక్షల అనంతరం ఎటువంటి తప్పులు సరిచేసుకోవడానికి ఉండదన్నారు. ఇప్పుడే తప్పులను సరిదిద్దుకోవాలని ఆయన వెల్లడించారు. పరీక్ష ఫీజులు కూడా చెల్లించుకోవాలని, రూ.125 కంటే ఎక్కువ వసూలు చేసినట్టయితే తమకు ఫిర్యాదు చేస్తే అటువంటి పాఠశాలలపై చర్యలు తీసుకుంటామన్నారు.

డబ్బు కోసం కన్న తండ్రి కక్కుర్తి

● మైనార్టీ తీరకుండానే కూతురికి వివాహం
● బాలికకు మద్యం తాగించి కాపురానికి పంపినవైనం
● తండ్రి, వివాహం చేసుకున్న వ్యక్తి అరెస్టు
● గణపవరంలో ఆలస్యంగా వెలుగులోకి

మైలవరం రూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలో డబ్బుకోసం కక్కుర్తిపడిన తండ్రి మైనరైన కూతురుకు రెండు సార్లు వివాహం చేశాడు. మద్యం అలవాటు చేసిన తండ్రి, 43 ఏళ్ల ఉన్న వ్యక్తితో పెళ్లి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మైలవరం ఎస్సై కె.సుధాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గణపవరానికి చెందిన ఏరువ జమలారెడ్డికి భార్యతో మూడు సంవత్సరాల క్రితం విడాకులు అయ్యాయి. ఒంటరిగా ఉంటున్న జమలారెడ్డి మద్యానికి బానిసై ఉన్న పొలాన్ని అమ్ముకొని వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే బెల్లంకొండ నాగరాజు తన కుమార్తె(15)ను ఇచ్చి పెళ్లి చేస్తానంటూ జమలారెడ్డి వద్ద పలుమార్లు రూ.20 లక్షలు తీసుకున్నాడు. ఆ డబ్బుతో నాగరాజు కార్లు, తదితర వస్తువులు కొన్నాడని చెప్పాడు నాగరాజు ఇచ్చిన మాట ప్రకారం జమలారెడ్డితో కూతురు(15)కు వివాహం చేశాడు. వివాహం ఇష్టం లేని బాలిక పుట్టింటికి వచ్చేసింది. ఈనెల 12వ తేదీన నాగరాజుకు మళ్లీ డబ్బులు అవసరపడి జమలారెడ్డిని అడగ్గా, కూతురిని కాపురానికి పంపిస్తేనే డబ్బులు ఇస్తానని చెప్పాడు. నాగరాజు పథకం ప్రకార తన కూతురితో మద్యం తాగించి జమలారెడ్డి వద్ద రూ.10 వేలు నగదు తీసుకొని కూతురును కాపురం చేసుకోమని చెప్పి వదిలేసి వచ్చాడు. జమలారెడ్డి అసభ్యకరంగా ప్రవర్తించడంతో బాలిక చుట్టుపక్కల వారి సహాయంతో అక్కడ నుంచి బయటపడి పోలీసులను ఆశ్రయించినట్లు ఎస్సై సుధాకర్ వివరించారు. బాలిక ఫిర్యాదు మేరకు జమలారెడ్డి, నాగరాజులపై పోక్సో కేసు నమోదు చేసి, సోమవారం రిమాండ్‌కు పంపించినట్లు చెప్పారు.

బాలికతో బలవంతంగా వ్యభిచారం చేయించిన
నిందితురాలికి పదేళ్ల జైలు

విజయవాడ లీగల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : బాలికతో బలవంతంగా వ్యభిచారం చేయించిన కేసులో నిందితురాలిపై నేరం రుజువుకావడంతో పదేళ్ల జైలుశిక్ష, రూ.23 వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలో బాధితురాలైన బాలిక (17) తల్లి చిన్న తనంలో చనిపోవడంతో అమ్మమ్మ వద్ద పెరుగుతోంది. కొంత కాలం తర్వాత అమ్మమ్మ తాను పెంచలేనని చెప్పడంతో చెల్లి (16)తో కలిసి బాలిక ఆటోనగర్‌లోని ఓ ఇంటిలో ఉంటోంది. ఈ క్రమంలో 2016లో సింగ్ నగర్ ప్రాంతానికి చెందిన షేక్ జమాల్‌బీ, ఆమె భర్త కమల్ బాషా పరిచయమై తమ ఇంటిలో ఉండమని, జాగ్రత్తగా చూసుకొంటామని చెప్పడంతో బాలికలిద్దరూ వారింటికి వెళ్లారు. కొన్ని రోజులు బాగానే చూసుకొన్న తర్వాత వారితో బలవంతంగా వ్యభిచారం చేయిస్తుండడంతో తప్పించుకోవడానికి ప్రయత్నించారు. కమాల్‌బీ దంపతులు బాలికలను పట్టుకొని కొట్టి తాళం వేసి ఇంటో బంధించారు. బాధితురాలి చెల్లిని కమల్‌బాషా హైదరాబాద్ తీసుకెళ్లి అక్కడ ఒక రూమ్‌లో పెట్టి వ్యభిచారం చేయించాడు. పారిపోవడానికి ప్రయత్నిస్తే చెల్లిని అక్కడ చంపేస్తామంటూ బెదిరించినట్లుగా బాధితురాలు 2017 అక్టోబరు 14న సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు భార్యభర్తలిద్దరిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ఇదిలా వుండగా 2024 మే 15న కమల్‌బాషా ఆత్మహత్య చేసుకొని చనిపోయాడు. ప్రాసిక్యూషన్ తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గద్దం రాజేశ్వరరావు 17 మంది సాక్షులను విచారించగా కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి, నిందితురాలిపై నేరం రుజువుకావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. బాలికలు ఒక్కొక్కరికి రూ.2.50 లక్షల చొప్పున ఇద్దరికి కలిపి రూ.5 లక్షలు నష్టపరిహారం వచ్చేలా చూడాలని జిల్లా లీగల్‌సెల్ అథారిటీని న్యాయమూర్తి ఆదేశించారు.



కృష్ణాడెల్టా చీఫ్ ఇంజనీర్ రాంబాబును కలిసి వినతిపత్రం అందజేస్తున్న బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు

వరద నష్టం పునరుద్ధరణ పనుల్లో అవకాశం ఇవ్వాలి

● ఏపీ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వినతి

గవర్నర్‌పేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం సెప్టెంబరులో సంభవించిన వరదల కారణంగా జరిగిన నష్టాన్ని పునరుద్ధరించే పనుల పనుల్లో ఉమ్మడి కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఉన్న చిన్న, మధ్య తరహా కాంట్రాక్టర్స్‌కు అవకాశం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఇరిగేషన్ అధికారులను కోరారు. సివిల్ కోర్టుల సమీపంలోని ఇరిగేషన్ కార్యాలయంలో కృష్ణాడెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజనీర్ రాంబాబును అసోసియేషన్ ప్రతినిధులు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. వివిధ నియోజకవర్గాల్లో చేపట్టబోయే రూ.30 కోట్ల పనుల్లో టెండర్లను ప్యాకేజీలుగా కాకుండా విడివిడిగా పిలవాలని కోరారు. చిన్నచిన్న పనులు చేసుకునే కాంట్రాక్టర్లను దృష్టిలో పెట్టుకుని పనులకు టెండర్లు పిలవాలని, డివిజన్ స్థాయిలోనే టెండర్లు ఖరారు చేయాలని, టెండర్లు పారదర్శకంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులను కలిసిన వారిలో అసోసియేషన్ మండల స్థాయి అధ్యక్షుడు సబ్బా కృష్ణ, ట్రెజరర్ వెంకటేశ్వరరాజు, జాయింట్ సెక్రటరీ భూపతిరెడ్డి, ఈసీ మెంబరు వీరంకి శ్రీధర్ తదితరులు ఉన్నారు.



శాప్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ప్రకాశం జిల్లా కబడ్డీ క్రీడాకారులు

మాకు తెలియకుండానే హైకోర్టులో కేసులు!

● శాప్ అధికారులకు ప్రకాశం కబడ్డీ క్రీడాకారుల ఫిర్యాదు

విజయవాడ(స్పోర్ట్స్), నవంబరు18 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రమేయం లేకుండా, తమ సంతకాలు లేకుండా హైకోర్టులో తాము కేసులు వేసినట్లు కొంతమంది వ్యక్తులు ఆరోపణలు చేస్తున్నారని ప్రకాశం జిల్లా కబడ్డీ క్రీడాకారులు కె.హరిప్రసాద్ రెడి, జి.సమరసింహరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తెలియకుండా తమ సంతకాలతో కేసులు ఏవిధంగా కేసులో వేశారో అర్థం కావడం లేదన్నారు., దీనిపై విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం శాప్ కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీల ఎంపికకు వెళ్లిన తాము అర్హత సాధించలేదన్నారు. ఆ సమయంలో కబడ్డీ క్రీడాకారులు కొందరు వ్యక్తులు తమతో మాట్లాడడం జరిగిందన్నారు. ఆ తరువాత కొన్ని రోజులకు తమను ఎందుకు ఎంపిక చేయలేదని ప్రశ్నిస్తూ హైకోర్టులో తమ పేరుతో కేసు వేసినట్లు నోటిసులు రావడంతో ఆశ్చర్యపోయామన్నారు. ఈ విషయాన్ని శాప్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఇటువంటి చర్యలతో ప్రతిభగల క్రీడాకారులకు అన్యాయం జరుగుతుందని అవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు. ఇటువంటి చర్యలతో క్రీడాకారుల భవిష్యత్తుతో ఎవరూ ఆడుకోవద్దని వేడుకుంటున్నామన్నారు.

లేబర్ కోడ్‌లు, రైతు వ్యతిరేక చట్టాల రద్దు కోరుతూ నిరసన ప్రదర్శనలు 26న

గాంధీనగర్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నాలుగు లేబర్ చట్టాలను, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు, కలెక్టర్లకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు అందజేయాలని కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల నేతలు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయా సంఘాల సమావేశం మంగళవారం జరిగింది. ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు బడా కార్పొరేట్ కంపెనీలకు రాష్ట్ర వనరులను పప్పుబెల్లాలుగా పంచుతున్నారని విమర్శించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను వైట్ ఎలిఫెంట్ అని, కార్మికులు పని చేయని దొంగలని, వారిపై పీడీ యాక్ట్ పెడతానని చంద్రబాబు హెచ్చరించడం సరైందికాదన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆర్.రవీంద్రనాథ్, వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు, చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలో తొక్కుతున్నాయని ధ్వజమెత్తారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ.నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రైతు సంఘం నేత కేశవరావు, రైతుకూలీ సంఘం అధ్యక్షులు సింహాద్రీ ఝాన్సీ, ఏఐకెఎఫ్‌టీయూ అధ్యక్షుడు వెంకటరెడ్డి, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి రామకృష్ణ, టీయూసీఐ అధ్యక్షుడు మరీదు ప్రసాద్‌బాబు, సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు వెంకటసుబ్బమ్మ, చలసాని రామారావు పాల్గొన్నారు.



అలరించిన జపాన్ డ్రమ్ టావో ప్రదర్శన

లబ్బీపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన జపాన్ డ్రమ్ టావో బృందం విజయవాడలో మంగళవారం నిర్వహించిన ప్రదర్శనతో ఆకట్టుకుంది. బందర్ రోడ్డులోని పీవీపీ మాల్‌లో టయోటా కిర్లోస్కర్ మోటర్ డ్రమ్ టావో ప్రదర్శనను తిలకించి నగరవాసులు అభినందించారు. నిర్వాహకులు మాట్లాడుతూ భారతదేశ పర్యటనలో బెజవాడలో నిర్వహించిన ప్రదర్శన ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. భారత్, జపాన్ మధ్య కళాత్మక బంధం, దీర్ఘకాల సాంస్కృతిక సంబం ధాలు లక్ష్యంగా ఈ ప్రదర్శనలు నిర్వహిస్తున్నామని తెలిపారు. శక్తివంతమైన టైకో డ్రమ్మింగ్, కచ్చితమైన సమకాలీకరణ, దృశ్యపరంగా అద్భుతమైన ప్రదర్శనను నగరవాసులు తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. భారత్ 14 రోజుల పాటు పలు నగరాలలో ప్రదర్శనలిస్తామని, నవంబర్ 20న చెన్నైలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో ప్రదర్శన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

15 కిలోల కంద



ఉయ్యూరు సీడీసీ కార్యాలయం సమీపంలోని వాటర్‌ట్యాంక్ రోడ్డులో లంక ప్రసాద్ పెరటిలో పెరిగిన కంద దుంప 15 కిలోల బరువుతో అబ్బురపరుస్తోంది. ఏవిధమైన ఎరువులు వేయకుండానే నేల సారంతోనే పెరిగిన కంద దుంపను తవ్వి బయటకు తీయగా 15 కిలోలు ఉందని ప్రసాద్ తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, ఉయ్యూరు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
బుధవారం
19 నవంబరు 2025



చలి చంపడం మొదలుపెట్టేసింది. అలాగని స్వెటర్ వేసుకుందామంటే అది అన్ని డ్రస్సులకూ అనువుగా ఉండదు. అలాంటప్పుడు చుడీదార్ మీద చున్నీకి బదులుగా హాయిగొలిపే శాలువాను వాడుకోవచ్చు. చలికాలం అక్కరకొచ్చే వెచ్చని కశ్మీర్ శాలువాలు, వాటిలోని వెరైటీస్ ఇవే.

చలికి చెక్ పెట్టే శాలువా



శాలువా అనగానే ఎవరికైనా కశ్మీర్ శాలువాలు గుర్తుకొస్తాయి. వెచ్చదనంతో పాటు ఆకర్షణను కూడా తెచ్చిపెట్టే శాలువాలు నేటి తరం అమ్మాయిలకు ఎంతో బాగా నప్పుతాయి. సుతిమెత్తగా, సౌకర్యంగా ఉండే కశ్మీరు శాలువాలు పలు రకాల ఎంబ్రాయిడరీల్లో, పలురకాల పనితనాలతో తయారవుతూ ఉంటాయి.

జర్దోజీ: జర్దోజీ అనే పర్షియా పదానికి, బంగారాన్ని కుట్టడమని అర్థం. ఈ పనితనంలో బంగారం, వెండి దారాలను ఉపయోగిస్తారు. ప్రారంభంలో రాజ కుటుంబాలకే పరిమితమైన ఈ పనితనం క్రమేపీ శాలువాలు, చీరలకూ విస్తరించింది. పూలు, పక్షులు, జామెట్రీ డిజైన్లలో రూపొందే ఈ తరహా శాలువాలు, సంక్లిష్టమైన పనితనానికి అద్దం పడుతూ ఉంటాయి.

క్రెవెల్: ఊలుతో విభిన్నమైన డిజైన్లను రూపొందించే ప్రక్రియ ఇది. జానపద కళారూపాల నుంచి ప్రేరణ పొందిన ఈ శైలిలో తయారైన ఎంబ్రాయిడరీలో పూలు, పక్షులు, జంతువులు కనిపిస్తూ ఉంటాయి. అలాగే దీన్లో భిన్నమైన కుట్లను కూడా ఉపయోగిస్తారు. శాటిన్ స్టిచ్, స్టెమ్ స్టిచ్, ఫ్రెంచ్ నాట్ వీటిలో అత్యంత ప్రత్యేకమైనవి.



కషిద: పట్టు దారంతో త్రీడీ డిజైన్లతో కూడిన కషిద పనితనంలో ప్రకృతి ప్రతిబింబిస్తూ ఉంటుంది. ఆకులు, పూలు, పండ్లు కషిద ఎంబ్రాయిడరీలో కనిపిస్తూ ఉంటాయి. ఉబ్బెత్తుగా కనిపించే ఈ తరహా ఎంబ్రాయిడరీ కోసం ఎంతో సమయం వెచ్చిస్తారు కాబట్టి కషిద శాలువాల ధర కూడా కాస్త ఎక్కువగానే ఉంటుంది.

తెల్లని దంతాల కోసం

పోషకాహార లోపం, సరైన పద్ధతిలో శుభ్రం చేసుకోకపోవడం లాంటి కారణాల వల్ల కొంతమందిలో దంతాలు పసుపురంగులోకి మారతాయి. కొన్ని చిట్కాలు పాటించి దంతాలను తెల్లగా మెరిపించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

- చిన్న గిన్నెలో ఒక చెంచా అల్లం పేస్టు, అర చెంచా నిమ్మరసం, పావు చెంచా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని టూత్‌బ్రష్‌తో అద్ది దానితో దంతాలపై వృత్తాకారంలో మెల్లగా తోమి, గోరువెచ్చని నీటితో పుక్కిలించాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తూ ఉంటే క్రమంగా దంతాలపై పసుపుదనం తొలగిపోతుంది.
- తరచూ జామ, యాపిల్, స్ట్రాబెర్రీ, రేగు, నారింజ, బత్తాయి, ద్రాక్ష లాంటి పండ్లను తినడం వల్ల వాటిలోని పోషకాలు లాలాజలంతో కలిసి దంతాలను తెల్లగా మారుస్తాయి.
- అప్పుడప్పుడు నిమ్మ, నారింజ, అరటిపండు తొక్కలతో తోముతూ ఉంటే వాటిలోని సిట్రిక్ యాసిడ్, డి-లిమోనినే సమ్మేళనాలు కలిసి దంతాలను తెల్లగా మెరిపిస్తాయి.
- బొప్పాయిలోని పపైన్, అనాసలోని బ్రోమలైన్ ఎంజైమ్‌లు దంతాల పసుపుదనాన్ని తగ్గిస్తాయి. తరచూ ఈ పండ్లు తినడంతోపాటు ఈ ఎంజైమ్స్ ఉన్న టూత్‌పేస్టును ఉపయోగిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.



- కాఫీ, టీ, రెడ్‌వైన్ లాంటివి తాగినప్పుడు అలాగే బీట్‌రూట్, బ్లూ బెర్రీ లాంటి పండ్లు తిన్నప్పుడు కొద్దిసేపటి తరువాతనైనా దంతాలను శుభ్రం చేసుకోవడం మంచిది.
- వారానికి ఒకసారి దంతాలను యాక్టివేటెడ్ చార్‌కోల్‌తో తోముకున్నా ప్రయోజనం ఉంటుంది.
- ఒక గిన్నెలో రెండు చెంచాల బేకింగ్ సోడా, ఒక చెంచా హైడ్రోజన్ పెరాక్సైడ్ వేసి తగినన్ని నీళ్లు చిలకరించుకుంటూ పేస్టులా చేయాలి. ఈ పేస్టుతో తోముకుంటే వెంటనే దంతాల పసుపుదనం మాయమవుతుంది.
- యాపిల్ సైడర్ వెనిగర్ లేదా కొబ్బరినూనెలో చూపుడు వేలును ముంచి దానితో పళ్లను రుద్దితే సమస్య తీరుతుంది.

సంకల్పం



కొంతమంది విద్యార్థులు అన్నింట్లో అల్లుకుపోతారు. కానీ సైన్స్ అనగానే భయపడతారు. అలాంటి పిల్లలను గుర్తించి... వారిలో బెరుకు పోగొడుతున్నారు **సరయూ గార్గ్**. ఐఏఎస్ అధికారి అయిన తన భర్తతో కలిసి... సైన్స్‌ను ఒక పాఠ్యాంశంలా కాకుండా... ఆడుతూ పాడుతూ చదివేలా బోధిస్తున్నారు. చిన్నారులను ప్రయోగాల బాట పట్టించి... వారిలో ఆసక్తిని రేకెత్తించి ఆలోచన పెంచుతున్న సరయూ కథ ఇది.

ఆసక్తిగా.. ఆలోచనాత్మకంగా

"ఒక చిన్న అడుగు... ఎంతోమంది విద్యార్థుల భవితవ్యానికి బలమైన పునాదులు వేసింది. సైన్స్ అంటే అదేదో బ్రహ్మ పదార్థంలాగా భావించి దూరం పెట్టే వారి ఆలోచనా ధోరణిని మార్చేసింది. అందుకు నేను, మావారు అభిజీత్ కారణమైనందుకు ఆనందంగా ఉంది. మా ఇద్దరి నేపథ్యాలు వేరైనా మేం పుట్టి పెరిగింది చండీగఢ్‌లోనే. నేను 'పంజాబ్ టెక్నికల్ యూనివర్సిటీ'లో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ చదివాను. 2018లో మొహాలీ 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్' నుంచి వాతావరణ శాస్త్రంలో పీహెచ్‌డీ చేశాను. మెకానికల్ ఇంజనీరింగ్ చదివిన అభిజీత్ 2015లో సివిల్స్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం పంజాబ్ రాష్ట్రం ముక్తసర్ డిప్యూటీ కమిషనర్‌గా ఉన్నారు. రాష్ట్ర గనుల శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయనకున్న ఒకే ఒక్క, అతిముఖ్యమైన అభిరుచి... పుస్తకాలు చదవడం. అంతేకాదు... ఎక్కడ పని చేసినా కొంత సమయాన్ని విద్యార్థులతో గడుపుతుంటారు. పాఠశాలలను సందర్శించినప్పుడు తనతో పాటు నేను కూడా వెళుతుండేదాన్ని.



అక్కడ మొదలైంది...

ముక్తసర్ రావడానికి ముందు అభిజీత్ ఫాజిల్కా అదనపు కమిషనర్‌గా పని చేశారు. ఆ సమయంలో కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లారు. విద్యార్థులతో మాట్లాడారు. అప్పుడు తను గమనించింది ఏంటంటే... చాలామంది సైన్స్ అంటే భయపడుతున్నారని. దాని వల్ల క్రమంగా వారికి ఆ సబ్జెక్ట్‌పై ఆసక్తి తగ్గిపోతోందని. టీచర్లను అడిగితే... మార్కుల రేసులో బట్టీ పట్టించడంవల్ల వారు పాఠ్యాంశాలు అర్థం చేసుకోలేకపోతున్నారని చెప్పారు. పైతరగతుల్లో సైన్స్ అత్యంత కీలకమైన పాఠ్యాంశం. అందులో వెనకబడితే అది వారి భవిష్యత్తుపై ప్రభావం చూపుతుంది. ఇదే మా ఆందోళన. దీనికి సరైన పరిష్కారం కనుగొనాలని అనుకున్నాం.

పాఠంలా కాకుండా...

మొదటి ప్రయత్నంగా నేను, మావారు స్థానిక ప్రభుత్వ పాఠశాలలు అన్నీ తిరిగాం. అక్కడి సైన్స్ ల్యాబ్‌లు పరిశీలించాం. టీచర్లతో మాట్లాడాం. పిల్లలు ఆ సబ్జెక్ట్‌ను అంత దూరం పెట్టడానికి కారణాలను తెలుసుకున్నాం. వారిని ఆవహించిన భయాన్ని పోగొట్టి, సైన్స్‌పై తిరిగి ఆసక్తి కలిగించాలని అనుకున్నాం. దాన్ని ఒక పాఠంలా కాకుండా... సరదాగా సాగిపోయే ఒక కథలా బోధిస్తే మంచి ఫలితాలు ఉంటాయని అనిపించింది. పాఠ్య పుస్తకాల్లో చూసినప్పుడు కొత్త అంశం ఏదైనా కాస్త క్లిష్టంగానే అనిపిస్తుంది. ముఖ్యంగా సైన్స్, మ్యాథమెటిక్స్ విషయంలో చాలామంది విద్యార్థులు కంగారుపడుతుంటారు. అలాంటివారిలో ఆసక్తిని రేకెత్తించి, ఆలోచన పెంచేలా బోధిస్తే మంచి ఫలితాలు వస్తాయి. మేం చేసింది అదే. చండీగఢ్‌లో 'క్యూరియస్ ప్లే ల్యాబ్స్' నెలకొల్పాం. దాని ద్వారా పిల్లలకు పాఠ్యాంశాలను ఒక సిలబస్‌లా కాకుండా ల్యాబ్‌ల్లో ప్రయోగాలతో వివరించి చెప్పాం. ఆ ప్రయోగాల్లో వారిని భాగస్వాములను చేశాం. అది విద్యార్థుల్లో ఎనలేని ఉత్సాహం నింపింది. కొత్త విషయాలు తెలుసుకోవాలన్న ఉత్సుకత పెరిగింది.

మార్పు రావాలి...

దాదాపు నాలుగేళ్ల కిందట ప్రారంభించిన 'క్యూరియస్ ప్లే ల్యాబ్స్'కు వచ్చేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. దీంతో ఒకప్పుడు ఇంటికే పరిమితమైన నేను... ల్యాబ్ కోసం పూర్తి సమయాన్ని కేటాయించాను. దాన్ని ఒక రిజిస్టర్ సంస్థగా మార్చాను. ఇక్కడ కేవలం పాఠ్యాంశాల బోధనే కాదు, మానసికంగానూ విద్యార్థులను దృఢంగా తీర్చిదిద్దడంలోనూ శ్రద్ధ పెట్టాం. ఎంతటి క్లిష్టమైన సబ్జెక్ట్ అయినా అర్థం చేసుకొనేలా వారిలో ఆలోచనాశక్తిని, తద్వారా ఆత్మవిశ్వాసాన్ని పెంచుతున్నాం. ఒక్కసారి పిల్లల్లో పాతుకుపోయిన భయం పోగొడితే... విద్యాభ్యాసం ఆటలాగా ఉల్లాసంగా సాగిపోతుందనేది మా నమ్మకం. ఆ దిశగా విద్యావిధానంలో మార్పు తేవడానికి మేం కృషి చేస్తున్నాం.

ఆటలూ ముఖ్యమే...

విచ్చలవిడిగా కార్పొరేటు బడులు వచ్చాక పిల్లలు ఆటలకు దూరమైపోతున్నారు. విద్యతోపాటు క్రీడలు కూడా వారికి ఎంతో ముఖ్యం. అందుకే అభిజీత్ ప్రస్తుతం ముక్తసర్ జిల్లాలో విద్యార్థులను క్రీడల్లో కూడా ప్రోత్సహిస్తున్నారు. 'చాలామంది పిల్లలు ఆటల్లో అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. సరైన సదుపాయాలు కల్పిస్తే వారు మెరికల్లా తయారవుతారు' అంటారు అభిజీత్. అలాంటివారిని ఒకచోటకు చేర్చి, మెరుగైన శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రభుత్వం, వివిధ సంస్థల సహకారంతో సుమారు ముప్పై లక్షల నిధులు సమీకరించి టేబుల్ టెన్నిస్, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ తదితర క్రీడల కోసం ఆటస్థలాలు ఆధునీకరించారు. స్విమ్మింగ్‌పూల్స్ ఏర్పాటు చేశారు. పేద విద్యార్థులకు ఆట సామగ్రి అందిస్తున్నారు. అంతేకాదు... మేం ఇద్దరు పేద పిల్లలను దత్తత తీసుకున్నాం. వారికి విద్యతోపాటు కావల్సినవన్నీ సమకూరుస్తున్నాం. ఏదిఏమైనా మేం కోరుకున్న మార్పు దిశగా విద్యార్థులు అడుగులు వేస్తున్నందుకు ఎంతో సంతృప్తిగా ఉంది."

రాత్రిపూట ఈ పండ్లు తినాలి

పలు కారణాల వల్ల పగటిపూట పండ్లు తినడం వీలు కాని వారు రాత్రిపూట తినవచ్చని నిపుణులు చెబుతున్నారు. రాత్రి సమయంలో ఏ పండ్లు తినాలో తెలుసుకుందాం...

- రాత్రి భోజనం తరువాత కివి పండ్లు తింటే ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. శరీరంలో సెరటోనిన్ ఉత్పత్తి పెరిగి చక్కగా నిద్ర పడుతుంది. కివి పండ్లలో ఉండే పీచు పదార్థాలు జీర్ణక్రియను వేగవంతం చేసి మలబద్ధకం రాకుండా కాపాడతాయి.
- చెర్రీ పండ్లు తినడం వల్ల శరీరంలో మెలటోనిన్ ఉత్పత్తి అవుతుంది. దీంతో వెంటనే నిద్ర ముంచుకొస్తుంది. చెర్రీలలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలో రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరుస్తాయి. చలికాలంలో తరచూ వచ్చే జలుబు, దగ్గు, తలనొప్పి లాంటి సమస్యలు తగ్గుతాయి.
- అరటి పండ్లను కూడా రాత్రిపూట తినవచ్చు. అరటి పండ్లలో అధికంగా ఉండే మెగ్నీషియం, పొటాషియం లాంటి మినరల్స్ శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరిగేలా చేస్తాయి. నిద్రలో కండరాలు పట్టేయకుండా, బీపీ పెరగకుండా కాపాడతాయి. రోజూ రాత్రిపూట అరటిపండు తినడం వల్ల గుండె జబ్బులు రావు.





- బ్లూ బెర్రీ, రాస్ బెర్రీలు తినడం వల్ల మనసు ప్రశాంతంగా మారుతుంది. నిద్రలేమితో బాధపడేవారికి ఇవి ఔషధంలా పనిచేస్తాయి. కేన్సర్ రాకుండా కాపాడతాయి.
- రాత్రి భోజనంలో అవకాడో చేర్చుకోవడం వల్ల అతిగా తినాలనే కోరిక తగ్గుతుంది. దీంతో శరీర బరువు నియంత్రణలో ఉంటుంది.
- పుచ్చకాయలు, తర్బూజా పండ్లను కూడా రాత్రి సమయంలో తినవచ్చు. వీటిలోని పోషకాలు జీవక్రియలను వేగవంతం చేస్తాయి. శరీరంలోని ద్రవాలు సమతుల్యంగా ఉండేలా చూస్తాయి.

పసుపులో కల్తీని గుర్తించేదెలా?

రోజూ వంటకాల్లో పసుపును ఉపయోగిస్తూ ఉంటాం. పసుపులో సి, బి6, కె విటమిన్లతోపాటు కర్కుమిన్ సమ్మేళనం, ప్రొటీన్, పీచుపదార్థాలు, ఇతర పోషకాలు ఉంటాయి. ఇవి ఎన్నో ఆరోగ్య సమస్యలను నివారిస్తాయి. అదే కల్తీ పసుపును వినియోగిస్తే ఆరోగ్యం పాడవుతుంది. కల్తీ పసుపును ఎలా గుర్తించాలో తెలుసుకుందాం...

- ఒక గ్లాసు నీటిలో పసుపు పొడి వేసి బాగా కలపాలి. గ్లాసులో పసుపు అడుగుకు చేరి నీళ్లు లేత పసుపు రంగులోకి మారితే దాన్ని స్వచ్ఛమైన పసుపుగా పరిగణించవచ్చు. పసుపు నీటి మీద తేలుతూ ఉన్నా, నీళ్లు పూర్తిగా ముదురు పసుపు రంగులోకి మారినా అది కల్తీ పసుపుగా నిర్ధారించుకోవాలి.
- నిజమైన పసుపును అరచేతిలో వేసి రుద్దితే అది చర్మంలోకి ఇంకడాన్ని చూడవచ్చు. అలాగే అరచేతిలో పసుపు మరక ఏర్పడుతుంది. దీన్ని నీటితో కడిగినా రెండు రోజుల వరకూ పోదు. అదే కల్తీ పసుపును తాకితే పొడిలా చేతికి తగులుతుంది.
- స్వచ్ఛమైన పసుపును నీళ్లతో కలిపి ముద్దలా చేసి పట్టిస్తే ముఖంపై పసుపు రంగు అంటదు. ముఖంపై పచ్చని మరకలు ఏర్పడితే ఆ పసుపులో రంగు కలిపారన్ని తెలుసుకోవచ్చు.
- నిజమైన పసుపుకు ఘాటైన వాసన ఉంటుంది. కల్తీ పసుపుకు వాసన ఉండదు.





- చిన్న గిన్నెలో ఒక చెంచా పసుపు, రెండు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. పసుపు రంగు మారకపోతే అందులో కల్తీ లేదని గుర్తించాలి. అదే ఎరుపు లేదా గులాబీ రంగులోకి మారితే ఏదైనా పిండి లేదా పొడి కలిపినట్లు తెలుసుకోవాలి.
- బియ్యప్పిండి లేదా జొన్న పిండిని నీళ్లతో కలిపి పేస్టులా చేసి పసుపు కొమ్ములకు పట్టిస్తుంటారు. కాబట్టి పసుపు కొమ్ములను కొనేముందు వాటిపై ఏదైనా పూత ఉందేమో పరిశీలించాలి.
- పసుపు పొడి లేదా పసుపు కొమ్ములు ప్రకాశవంతంగా కనిపించవు. అలా కనిపిస్తే అవి కల్తీవని తెలుసుకోవాలి.

"కష్టసాధ్యమైన కార్యాన్ని ఎంచుకున్నాను. కానీ 'నన్ను బలపరిచే క్రీస్తుద్వారా నేను సమస్తమును చేయగలను' అనే బైబిల్‌లోని వాక్యం నన్ను ముందుకు నడిపించింది" అంటున్నారు బయ్యా శాంతకుమారి. విశ్రాంత ఉపాధ్యాయిని అయిన ఆమె బైబిల్‌ను మూడు భాషల్లో... 8,843 పేజీలను చేతితో రాశారు. ఆ విశేషాలు 73 ఏళ్ల శాంతకుమారి మాటల్లోనే.



మూడు భాషల్లో రాసేశారు

"బైబిల్‌ను పవిత్ర దినాల్లో చేతితో రాయడం కొత్త విషయం కాదు. సాధారణంగా ఏదైనా చెడు వ్యసనాన్ని దూరం చేసుకోవడానికి, ఏదైనా కోరుకున్న పనిని సాధించుకోవడానికి అలా చేస్తూ ఉంటారు. అయితే అలా రాసే వాటిలో పూర్తయ్యేవి చాలా తక్కువ. అలాంటి మూడు భాషల్లో బైబిల్‌ను చేత్తో రాయగలిగానంటే... అదంతా దేవుని సంకల్పమేనని భావిస్తున్నాను. నేను చదువుకుంటున్న రోజుల్లో చక్కటి చేతిరాతకు చాలా ప్రాధాన్యత ఉండేది. రాజమండ్రిలోని షాడే గర్ల్స్ హైస్కూల్‌లో చదువుతున్నప్పుడు... కృప, రుడా, రామకృష్ణ టీచర్లు నాకు అందమైన చేతిరాతను నేర్పారు. అందులో బహుమతులు కూడా తీసుకున్నాను. ఇంటర్మీడియెట్ చదివేటప్పుడు... పాఠ్య పుస్తకాలకు కొరతగా ఉండేది. అప్పుడు సెకెండియర్ ఫిజిక్స్ పాఠ్య పుస్తకం మొత్తం చేత్తో రాసుకున్నాను. దాన్ని చూసి లెక్చరర్లు ఆశ్చర్యపోయారు. తోటి విద్యార్థులతో చప్పట్లు కొట్టించి నన్ను అభినందించారు.

సమయం సద్వినియోగం చేస్తూ...

ఎంఏ పూర్తి చేసిన తరువాత... 1983లో కొత్తపేట సమితిలోని కొమరాజు లంక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించాను. వాడవాడలా తిరిగి పిల్లలను బడిలో చేర్పించేదాన్ని. నా నిబద్ధతను గుర్తించిన అధికారులు... బొమ్మూరులోని ఎర్రకొండ ప్రాంతంలో పాఠశాల ఏర్పాటు చేసి, దాని బాధ్యతలు నాకు అప్పగించారు. 2006లో రాష్ట్ర స్థాయిలో, 2008లో జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయురాలిగా పురస్కారాలు అందుకున్నాను. 2010లో పదవీవిరమణ చేశాను. ఖాళీగా గడపడం నాకు ఇష్టం ఉండదు. పొద్దున్నే అయిదు గంటలకు లేస్తాను. ఇంట్లో పనులన్నీ నేనే చేస్తాను. తీరిక దొరికితే న్యూస్ పేపర్లు, మ్యాగజైన్లు చదువుతాను. వాటిలో వచ్చే ఆరోగ్య చిట్కాలు, వంటలు, స్ఫూర్తిదాయక కథనాలను కట్ చేసి... పుస్తకాలుగా రూపొందిస్తాను. వాటిని ఆసక్తి కలిగినవారికి, విద్యార్థులకు ఇస్తూ ఉంటాను. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం అంటే... ఖాళీ సమయాన్ని కూడా ఉత్తమంగా వినియోగించుకోవడం అని నా అభిప్రాయం. నా భర్త జోసెఫ్ రాజు (జోషి) పేపర్ మిల్లులో కార్మిక నాయకుడిగా ఎన్నో విజయాలు సాధించారు. ఇప్పటికీ కార్మికులు ఆయనకు కష్టసుఖాలు చెప్పుకుంటారు. మా అబ్బాయి రిషి.. అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో పని చేస్తున్నాడు. మా అమ్మాయి ఎంఏ పూర్తిచేసి, మా దంపతులకు చేదోడుగా ఉంటోంది.

ఆ బాధ దైవానికే చెప్పుకున్నాను...

బైబిల్‌ను చేత్తో రాయాలన్న ఆలోచన ఎలా వచ్చిందంటే... నా తమ్ముడు సుధీర్‌కుమార్ ఏదో కార్యం నిమిత్తం తెలుగులో బైబిల్‌ను రాస్తూ ఉంటే చూశాను. అది నన్ను ఎంతో ఆకర్షించింది. నేను కూడా రాయాలనే ఆలోచనతో... ముందు తెలుగులో మొదలుపెట్టి పూర్తి చేశాను. తరువాత ఇంగ్లీష్, హిందీ భాషల్లో ఉన్న బైబిల్ గ్రంథాలను చూసి, చేత్తో రాశాను. దీనికి సరైన పెన్నులు ఉండడం చాలా ముఖ్యం. లేకపోతే రాత సరిగ్గా సాగదు. నాకు లావుగా రాసే పెన్నులు ఇష్టం. దానికోసం మా అమ్మాయి ఎన్నో దుకాణాలు తిరిగినా ప్రయోజనం లేకపోయింది. అయితే మా అబ్బాయి అమెరికా నుంచి పంపిన పెన్నుల్లో ఒకటి సరిపడింది. ఆ తరువాత తను అక్కడినుంచే పెన్నులు పంపేవాడు. నాకు తెలుసు... నేను చాలా పెద్ద పని తలపెట్టానని. దాన్ని ఎంతో నిష్ఠగా కొనసాగించాను. పండగలు వచ్చినా, వేడుకలు జరిగినా, ఆరోగ్యం బాగోలేకపోయినా, ఆఖరికి బంధువులతో మా ఇల్లు నిండిపోయినా... ఈ యజ్ఞాన్ని ఎన్నడూ ఆపలేదు. అయితే హిందీలో బైబిల్ రాస్తున్న సమయంలో... నా మోకాళ్ళ సమస్య తీవ్రమయింది. 'ఇక రాయలేకపోతానేమో?' అని భయపడ్డాను. నా బాధను ఆ దైవానికే చెప్పుకున్నాను. ఆయన కృపతో... మూడు భాషల్లో చేతిరాతతో బైబిల్ లేఖనం పూర్తి చేశాను. దీనితో నా జీవితం ధన్యమయిందని అనుకుంటున్నాను."

● **రమేశ్ నాగేంద్ర పలస**, రాజమండ్రి

బైబిల్ లాంటి పవిత్ర గ్రంథాలను చేతితో రాయడం మాటల్లో చెప్పినంత సులభం కాదు. అక్షరం పొల్లు పోకుండా, ఎక్కడా తప్పు రాకుండా చూసుకోవాలి. మూడు భాషల్లో చిన్న పొరపాటు కూడా రాకుండా రాయగలిగానంటే... అందులో నా గొప్పతనం ఏమీ లేదు. ఆ ప్రభువే నాతో ఈ పని చేయించుకున్నాడు. తెలుగు బైబిల్‌ను 2016 అక్టోబర్ 17 నుంచి 2018 అక్టోబర్ 17 వరకూ, ఇంగ్లీషు బైబిల్‌ను 2019 ఫిబ్రవరి 16 నుంచి 2020 నవంబర్ 3 వరకూ, హిందీలో 2023 ఏప్రిల్ 23 నుంచి 2024 జూలై 28 వరకూ రాశాను. తెలుగులో 2,414, ఇంగ్లీషులో 3,435, హిందీలో 2,994 పేజీలు రాశాను. పాత నిబంధన గ్రంథంలోని 39, కొత్త నిబంధన గ్రంథంలోని 27 అధ్యాయాలను... మూడు భాషల్లో 8,843 పేజీల్లో పూర్తి చేశాను. రోజూ ఇంటి బాధ్యతలు ముగించి, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటలవరకూ ఏకధాటిగా రాసేదాన్ని.



ఇంధన సామర్థ్య చర్యల్లో ఏపీ భేష్

- ఎనర్జీ ఎఫిషియన్సీ కాన్ఫరెన్స్‌లో రాష్ట్రానికి ప్రశంస
- అరకులో జియో థర్మల్ టెక్నాలజీ అమలు
- 6 లక్షల ఇళ్లకు బీఈఈ స్టార్ రేటెడ్ గృహోపకరణాలు: అజయ్ జైన్

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఇంధన సామర్థ్య(ఈఈ) చర్యలను వేగవంతం చేయడంలో ఏపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సౌత్-వెస్ట్ రీజినల్ ఎనర్జీ ఎఫిషియన్సీ కాన్ఫరెన్స్ ప్రశంసించింది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సదస్సులో ఏపీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడారు. పీఎంఏవై లబ్ధిదారులకు బీఈఈ స్టార్ రేటెడ్ గృహోపకరణాలను అందించేందుకు ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్‌తో ఏపీ ప్రభుత్వం కలసి పనిచేస్తోందని, సుమారు 6 లక్షల గృహాలకు ఈ ఉపకరణాలను అందించడం ద్వారా ఏడాదికి సుమారు 10.24 మిలియన్ కిలోవాట్ పర్ హవర్ విద్యుత్తును ఆదా చేస్తారని తెలిపారు. అలాగే ఈఈఎస్ఎల్, ఏపీ టూరిజంతో కలసి అరకులో ప్రపంచ స్థాయి జియో థర్మల్ టెక్నాలజీని అమలు చేసేందుకు సిద్ధమవుతోందన్నారు. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ జాతీయ సలహాదారు ఎ.చంద్రశేఖర్ రెడ్డి, మంత్రి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నితీశ్ ప్రమాణస్వీకారానికి చంద్రబాబు, లోకేశ్

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బిహార్ సీఎంగా ఈనెల 20న నితీశ్ కుమార్ ప్రమాణస్వీకారం చేయనున్న కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ హాజరవుతున్నారు. అదే రోజు చంద్రబాబు, లోకేశ్ పట్నా వెళ్లనున్నారు. బిహార్ ఎన్నికల్లో ఎన్డీయే తరఫున లోకేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్య బీమా కూటమి లక్ష్యం!

- నూతన సంవత్సర కానుకగా హెల్త్ పాలసీ: నీలాయపాలెం

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 'ప్రజల ఆరోగ్య భద్రత కూటమి ప్రభుత్వం లక్ష్యం. నూతన సంవత్సర కానుకగా యూనివర్సల్ హెల్త్ పాలసీని అమలు చేస్తున్నాం. ఇది రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా అందించేందుకు దోహదం చేస్తుంది' అని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ పేర్కొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఎన్టీఆర్ వైద్య సేవ ఆగిపోతుందని కొందరు చేస్తున్న ప్రచారం సత్యదూరం. పేద, మధ్యతరగతి తేడా లేకుండా రాష్ట్రంలోని ప్రతి కుటుంబం యూనివర్సల్ హెల్త్ పాలసీ కిందకు వస్తుంది. రూ.5 లక్షల లోపు వార్షికాదాయం ఉన్న కుటుంబాలకు ఏడాదికి రూ.2.50 లక్షల వరకు బీమా సంస్థ ద్వారా నగదు రహిత వైద్యం, రూ.2.50 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ భరిస్తుంది. 1.63 కోట్ల కుటుంబాలకు మేలు కలుగుతుంది. 2,493 నెట్‌వర్క్ ఆసుపత్రుల్లోని 31 సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయి' అని విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

ఏపీని డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేద్దాం

- నషా ముక్త్ భారత్ అభియాన్‌లో మంత్రి డోలా



విజయవాడలోని నీట్, ఐఐటీ ఎక్సలెన్స్ సెంటర్‌ను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదామని సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. నషా ముక్త్ భారత్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా విజయవాడలోని లయోలా కళాశాల ఆడిటోరియంలో ఆ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. దీనికి పెద్ద ఎత్తున విద్యార్థులు హాజరుకాగా, వారినుద్దేశించి మంత్రి స్వామి మాట్లాడారు. చెడు వ్యసనాలకు బానిసైన యువత కోసం జిల్లాకొక డీఅడిక్షన్ కేంద్రం ప్రారంభించామన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపామని, వాటి నిర్మూలనకు ఈగల్ వ్యవస్థను తీసుకొచ్చామని తెలిపారు. డ్రోన్‌ల ద్వారా గంజాయి సాగును గుర్తించి తోటలను నాశనం చేశామన్నారు. డ్రగ్స్‌ను అరికట్టేందుకు సమాజంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు వ్యసనాల జోలికి పోకుండా, తమ లక్ష్యం మేరకు విద్య, వ్యాపార రంగాల్లో రాణించాలన్నారు. ఈ సందర్భంగా సభలో ఉన్న విద్యార్థులందరి చేత మాదక ద్రవ్యాలు సేవించబోమని, వాటిని అరికట్టేందుకు తమ వంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు మాట్లాడుతూ క్షణికమైన సంతోషం కోసం జీవితాలను నాశనం చేసుకోవద్దని పిలుపునిచ్చారు. ఈగల్ ఎస్పీ నగేష్‌బాబు, రాష్ట్ర స్థాయి కోఆర్డినేటర్ ఉమారాజ్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ డైరెక్టర్ రవిప్రకాష్‌రెడ్డి ప్రసంగించారు.

ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై చిన్నచూపు!

70-90% పూర్తయినా జగన్ హయాంలో ముందుకు సాగని నిర్మాణాలు

- కూటమి పాలనలోనూ అదే తీరు
- కొద్ది నిధులతోనే పూర్తవుతాయని తెలిసినా పైసా విదిల్చని ఆర్థిక శాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం కొనసాగుతోంది. 70 నుంచి 93 శాతం పనులు జరిగిన ప్రాజెక్టులకు కొద్దిపాటి నిధులిస్తే పూర్తవుతాయి. ఇది తెలిసినా ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 2019-24 కాలంలో జగన్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా ప్రాజెక్టులను ధ్వంసం చేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వాటిలో కదలిక వస్తుందని సాగునీటి రంగ నిపుణులు ఆశించారు. కానీ స్వల్ప ఖర్చుతోనే సాగు నీరందించే ప్రాజెక్టులపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వంశధార ఫేజ్-2, స్టేజ్ -2

ఉత్తరాంధ్రలో బీఆర్ అంబేడ్కర్ వంశధార ప్రాజెక్టు అత్యంత ముఖ్యమైనది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో కాట్రగడ సమీపంలో వంశధార నదిపై హిరమండల రిజర్వాయరులో 19.05 టీఎంసీలను నింపి.. వరద కాలువ ద్వారా సింగిడి, పారాపురం వరకూ వంశధార జలాలను తరలించాలన్న లక్ష్యంతో దీనిని చేపట్టారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2,624.50 కోట్లు కాగా.. ఇప్పటికే 93.5 శాతం పనులు పూర్తి చేశారు. మరో రూ.171.91 కోట్లు వ్యయం చేస్తే వంశధార ప్రాజెక్టు భూసేకరణ సహా పూర్తవుతుంది. 20 వేల ఎకరాలు కొత్తగా సాగులోకి వస్తాయి. నాలుగున్నర లక్షల మందికి తాగునీరందుతుంది.

తోటపల్లి బ్యారేజీ..

దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న తోటపల్లి బ్యారేజీ నిర్మాణాన్ని నాగావళి నదిపై రూ.1,250.79 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించారు. 2019 నాటికే పనులు 84.77 శాతం పూర్తయ్యాయి. రూ.263.36 కోట్లను వ్యయం చేస్తే ప్రాజెక్టు పూర్తవుతుంది. 84,033 ఎకరాల కొత్త ఆయకట్టు వస్తుంది. మరో 84 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. 4.69 లక్షల మందికి తాగునీరు అందుతుంది.

తారకరామ తీర్థసాగర్..

విజయనగరం జిల్లా గుర్ల మండలం కోటగండ్రేడు వద్ద చంపావతి నదిపై దీనిని రూ.739.90 కోట్ల అంచనాతో ప్రారంభించారు. రూ.337.67 కోట్లతో 45 శాతం పనులు పూర్తయ్యాయి. రూ.808.36 కోట్లు ఖర్చుచేస్తే ప్రాజెక్టు పూర్తవుతుంది. విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గంలో 16,538 ఎకరాల కొత్త ఆయకట్టు, డెంకాడ ఆనకట్ట పరిధిలోని 8,172 ఎకరాలకు ప్రయోజనం కలుగుతుంది. విజయనగరం మున్సిపాలిటీతోపాటు భోగాపురం విమానాశ్రయానికి తాగునీటిని అందించే వీలుంది. ఉత్తరాంధ్రలో మహేంద్ర తనయ నదిపై ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్మాణం దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంది. 48 శాతం పనులు పూర్తయ్యాయి. మరో 506.68 కోట్లిస్తే భూసేకరణ, ప్రాజెక్టు పూర్తవుతుంది.

హిరమండలం ఎత్తిపోతల..

గొట్టా బ్యారేజీ ద్వారా హిరమండలం రిజర్వాయరులో 10 నుంచి 12 టీఎంసీలు నిల్వ చేసేందుకు ఉద్దేశించిన ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.176.35 కోట్లు మాత్రమే. ఇప్పటికే 45 శాతం పనులు పూర్తయ్యాయి. నిర్మాణంలో తీవ్ర జాప్యం వల్ల అంచనా వ్యయం రెట్టింపైంది. శ్రీకాకుళం జిల్లా హిరమండలం హైలెవల్ కెనాల్ ద్వారా వంశధార-నాగావళి నదుల అనుసంధానం ప్రాజెక్టును రూ.145.34 అంచనా వ్యయంతో ప్రారంభించారు. 2019 నాటికే 73 శాతం పనులు పూర్తయ్యాయి. మరో రూ.108.17 కోట్లు వ్యయం చేస్తే చాలు. శ్రీకాకుళం జిల్లాలో మడ్డువలస స్టేజ్-2 ప్రాజెక్టును రూ.99.77 కోట్లతో చేపట్టారు. ఇప్పటికే 79.97 శాతం పూర్తయింది. అంచనా వ్యయం పెరగడంతో మరో రూ.79.77 కోట్ల వ్యయం చేస్తే ప్రాజెక్టు పూర్తవుతుంది. 2026 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని కూటమి సర్కారు లక్ష్యంగా నిర్దేశించుకుంది.

రాష్ట్రానికి 3 జాతీయ జల పురస్కారాలు

- ఢిల్లీలో అందుకున్న రాష్ట్ర అధికారులు
- ఉత్తమ గ్రామపంచాయతీలు మురుగుమ్మి, దుబ్బిగానిపల్లి..
- వ్యక్తిగత విభాగంలో పాదిలి రాజశేఖరరాజుకు పురస్కారం



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డులు అందుకుంటున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ప్రకాశం జిల్లాకు చెందిన పాదిలి రాజశేఖరరాజు



కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ నుంచి అవార్డులు అందుకుంటున్న నెల్లూరు కలెక్టర్ హిమాన్షు శుక్లా, ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

న్యూఢిల్లీ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆరో జాతీయ జల పురస్కారాలలో ఆంధ్రప్రదేశ్ మూడింటిని దక్కించుకుంది. మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆరో జాతీయ జల పురస్కారాలు, జల్ సంచయ్-జన్ భాగీదారీ అవార్డులను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. నీటి సంరక్షణకు విశేషంగా కృషి చేసినందుకు అత్యుత్తమ గ్రామపంచాయతీ విభాగంలో ప్రథమ సంయుక్త విజేతగా నిలిచిన దుబ్బిగానిపల్లి తరఫున అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ రాష్ట్రపతి ముర్ము నుంచి జల పురస్కారాన్ని అందుకున్నారు. ఇదే విభాగంలో ద్వితీయ సంయుక్త విజేతగా నిలిచిన మురుగుమ్మి తరఫున ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు జల పురస్కారాన్ని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే, వ్యక్తిగతంగా నీటి రంగంలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చినందుకుగాను ప్రకాశం జిల్లాకు చెందిన పాదిలి రాజశేఖరరాజు రాష్ట్రపతి నుంచి జల పురస్కారాన్ని అందుకున్నారు. మరోవైపు, నీటి సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం, వర్షపు నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇచ్చినందుకుగాను దేశవ్యాప్తంగా టాప్ 10 మునిసిపల్ కార్పొరేషన్లలో నాలుగో ర్యాంకు దక్కించుకున్న రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్‌కు, దక్షిణ జోన్‌లో కేటగిరి-3 కింద 12వ ర్యాంకు సాధించిన నెల్లూరు జిల్లాకు జల్ సంచయ్-జన్ భాగీదారీ అవార్డులు లభించాయి. నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా కేంద్ర మంత్రి పాటిల్ నుంచి అవార్డు అందుకున్నారు.

నీటి వనరులను గౌరవించటం మన సంస్కృతి: రాష్ట్రపతి ముర్ము

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ వ్యక్తులు, కుటుంబాలు, సమాజం, ప్రభుత్వ భాగస్వామ్యం ద్వారానే సమర్థ నీటి నిర్వహణ సాధ్యమన్నారు. నదీ పరివాహక, సముద్ర తీర ప్రాంతాలు, నీటి లభ్యత ఉన్న ప్రాంతాల చుట్టూనే మానవ నాగరికత అభివృద్ధి చెందిందని చెప్పారు. నీటివనరులను గౌరవించటం మన సంస్కృతి అన్నారు. వాతావరణ మార్పులు జలచక్రాన్ని ప్రభావితం చేస్తున్నాయని.. నీటి లభ్యత, నీటిభద్రతకు ప్రభుత్వం, ప్రజలు కలిసి పనిచేయాలని సూచించారు.

'సైనికులకు' భూకేటాయింపు తప్పేమీ కాదు

- తిరుపతి కలెక్టర్ నిర్ణయం సరికాదు
- ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించండి
- 3 నెలల్లో అమలు చేయాలి... హైకోర్టు ఆదేశం

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల్లో సేవలు అందిస్తున్న సైనికులకు, మాజీ సైనికోద్యోగుల కోటా కింద భూకేటాయింపు చేయడం చట్టవిరుద్ధం కాదని హైకోర్టు స్పష్టత ఇచ్చింది. కేవలం మాజీ సైనికులకు మాత్రమే భూమిని కేటాయించాలనే చట్టనిబంధన ఏదీ లేదని తేల్చిచెప్పింది. సర్వీసులో ఉన్న సైనికులు, మాజీ సైనికోద్యోగులు కూడా భూకేటాయింపు కోసం జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని భూపరిపాలన ప్రధాన కమిషనర్ 2022లో సర్క్యులర్ జారీ చేశారని గుర్తు చేసింది. సర్వీసులో ఉన్న సమయంలో భూకేటాయింపు చేశారనే కారణంతో భూములను వెనక్కి తీసుకోవడానికి వీల్లేదని తెలిపింది. సాయుధ దళాల్లో సేవలందిస్తున్న వారిని ప్రోత్సహించేందుకు, దేశ సరిహద్దులను, ప్రజలను కాపాడుతున్నందుకు కృతజ్ఞతగా మాజీ సైనికులకు భూకేటాయింపు విధానాన్ని తీసుకొచ్చారని పేర్కొంది. నిబంధనలు అడ్డుపెట్టుకొని మంచి ఉద్దేశాన్ని దెబ్బతీయడానికి వీల్లేదని తెలిపింది. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద పిటిషనర్‌కు కేటాయించిన 4.35 ఎకరాల తక అడవి భూమిని అడవి పోరంబోకుగా పేర్కొంటూ రిజిస్ట్రేషన్ నిషేధిత భూముల జాబితా(22ఏ) నుండి తొలగించడానికి తిరుపతి జిల్లా కలెక్టర్ నిరాకరించడాన్ని తప్పుపట్టింది. తహశీల్దార్ ఇచ్చిన నివేదికలో భూమి అడవి పోరంబోకు అని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ లేనప్పటికి పిటిషనర్ భూమిని అడవి పోరంబోకుగా నిర్ధారిస్తూ జిల్లా కలెక్టర్ ఎలా ఉత్తర్వులు ఇచ్చారో అర్థం కావడం లేదని పేర్కొంది. మూడు నెలల్లో భూమిని నిషేధిత జాబితా నుండి తొలగించాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఆ లోపు నిషేధిత జాబితా నుండి భూములు తొలగించకుంటే భూముల బదిలీ/విక్రయం నిమిత్తం దస్త్రాలను సంబంధిత సబ్ రిజిస్ట్రార్ వద్ద ఉంచవచ్చని పిటిషనర్‌కు తెలిపింది. వాటిని పరిగణనలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సబ్‌రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ సుభేందు సమంతో ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది.

మైనార్టీల సంక్షేమమే లక్ష్యం

- మంత్రి ఫరూక్

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని, అందుకు అనుగుణంగా అధికార యంత్రాంగం తమ శాఖల పరిధిలో సంక్షేమ ప్రణాళికలను ముందుకు తీసుకెళ్లాలని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సూచించారు. మంగళవారం అమరావతి సచివాలయంలో మైనార్టీ సంక్షేమశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఉర్దూ అకాడమీ, కేంద్ర పథకాల సమర్థ వినియోగం, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, ఉపాధి, రుణాలు, హజ్-2026 యాత్ర ముందస్తు చర్యలు, ప్రణాళికలు తదితరాలపై సమీక్షించారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా హైటీ కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ శేఖర్‌ను మంత్రి ఫరూక్ ఆదేశించారు.

45 రోజుల్లో ఎస్సీ గురుకులాల్లో ఆర్వో ప్లాంట్లు

అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ గురుకులాలు, రెండు ఏపీ స్టడీ సర్కిళ్లలో ఏర్పాటు చేయదలచిన ఆర్వో ప్లాంట్లను 45 రోజుల్లో పూర్తి చేయాలని సాంఘిక సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్, గురుకుల సొసైటీ కార్యదర్శి ఇప్పటికే 311 హాస్టళ్లకు గాను ఒక్కో హాస్టల్‌లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు రూ.2 లక్షల చొప్పున మొత్తం రూ.6.22 కోట్లు, 49 గురుకులాల్లో ఒక్కో గురుకులానికి రూ.6 లక్షలతో పాటు రెండు ఏపీ స్టడీ సర్కిళ్లను కలిపి రూ.3.06 కోట్లు మంజూరుచేశారు. ఈ పనులను ఏపీఈడబ్ల్యూడీఐసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

'ఉపాధి' పనిదినాల్లో కోత!

- ఈ ఏడాది 18 కోట్లకు పరిమితం చేసిన కేంద్రం.. గత ఏడాది 24 కోట్ల పనిదినాలు మంజూరు
- మెటీరియల్ నిధులు కూడా తగ్గే అవకాశం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద కేంద్ర ప్రభుత్వం అందించే పనిదినాల సంఖ్యను తగ్గిస్తోంది. గతేడాది మన రాష్ట్రానికి 24 కోట్ల పనిదినాలను మంజూరు చేయగా.. ఈ ఏడాది మొత్తంగా 18 కోట్ల పనిదినాలు మాత్రమే మంజూ రు చేసింది. మొదటి విడతలో కేటాయించిన 15 కోట్ల పనిదినాలు నెల కిందటే పూర్తయ్యాయి. దీంతో మరో 9 కోట్ల పనిదినాలు మంజూరు చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖకు ప్రతిపాదనలు పంపారు. ఉన్నతాధికారులు ఢిల్లీకి వెళ్లి కేంద్ర అధికారులకు విజ్ఞప్తి చేశారు. అయితే కేంద్రం ఈ ఏడాది నుంచి దేశవ్యాప్తంగా పనిదినాల సంఖ్యను తగ్గించాలన్న యోచనతో మన రాష్ట్రానికి 3 కోట్ల పనిదినాలు మాత్రమే మంజూరు చేశారు. తెలంగాణకు గతంలో 6 కోట్ల పనిదినాలు కల్పించగా, తాజాగా ఒక కోటి పనిదినాలు మాత్రమే అదనంగా మంజూరు చేశారు. కాగా, ఇతర రాష్ట్రాల కంటే కొంత మెరుగ్గానే మన రాష్ట్రానికి పనిదినాలు మంజూరయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు. ఉపాధి హామీ పథకం అమల్లోకి వచ్చి 20 ఏళ్లు అయింది. ప్రతి ఏటా పనిదినాలను పెంచడం ద్వారా చాలా రాష్ట్రాలు దుర్వినియోగం చేస్తున్నట్లు కేంద్రం గుర్తించింది.

ఐదేళ్లతో పోలిస్తే తగ్గిన లేబర్ బడ్జెట్

గత ఐదేళ్లతో పోలిస్తే కేంద్రం రాష్ట్రానికి కేటాయించే లేబర్ బడ్జెట్ (పని దినాల సంఖ్య) ఈ ఏడాది తగ్గింది. 2021-22, 2022-23ల్లో 24 కోట్లు, 2023-24లో 25.54 కోట్లు, 2024-25లో 24.22 కోట్లు లేబర్ బడ్జెట్‌ను కేంద్రం కేటాయించింది. 18 కోట్ల పనిదినాలకు తగ్గించారు. అంటే 25 శాతం లేబర్ బడ్జెట్ తగ్గించినట్లయింది. మెటీరియల్ నిధుల కేటాయింపులూ 25 శాతం తగ్గే పరిస్థితులు ఏర్పడ్డాయి. కాగా, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి, అదనపు పనిదినాలు సాధిస్తామని అధికారులు చెప్తున్నారు.

మెటీరియల్ పనులూ తగ్గుముఖం

ఉపాధి హామీ పథకంలో కూలీలు పనులు చేయడం ద్వారా ఖర్చు చేసే మొత్తానికి అనుగుణంగా కేంద్రం మెటీరియల్ నిధులను రాష్ట్రాలకు మంజూరు చేస్తుంది. లేబర్ బడ్జెట్, మెటీరియల్ నిధులను 60:40 నిష్పత్తిలో కేటాయిస్తుంది. దీంతో 25 కోట్ల మేర పనిదినాలను ప్రతి ఏటా వినియోగిస్తున్న క్రమంలో రాష్ట్రానికి ఏటా రూ.3 వేల నుంచి రూ.4 వేల కోట్ల దాకా మెటీరియల్ నిధులు అందేవి. లేబర్ బడ్జెట్ కేటాయింపు తగ్గుదలకు అనుగుణంగా మెటీరియల్ నిధులూ తగ్గే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★



అద్భుతంగా ఉంటుంది

అల్లరి నరేశ్

'నేను ఇప్పటిదాకా 64 సినిమాలు చేశా. అయినా, ప్రతీ చిత్రం విడుదలకు ముందు టెన్షన్ ఉంటుంది. అలాంటిది మొదటి సినిమా అయినా దర్శకుడు నాని కాసరగడ్డ చాలా కూల్‌గా ఉండడం ఆశ్చర్యం. ఈ కథపై మాకు పూర్తి నమ్మకం ఉంది. సినిమా అద్భుతంగా ఉండబోతోంది' అని అల్లరి నరేశ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం '12 ఏ రైల్వే కాలనీ'. శ్రీనివాస సిల్వర్‌స్క్రీన్ బేనర్‌పై శ్రీనివాస చిట్టూరి నిర్మించారు. ఈ నెల 21న చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఆయన మాట్లాడుతూ 'థియేటర్లలో ప్రేక్షకులను థ్రిల్‌కు గురిచేసే చిత్రమిది. అందరినీ మెప్పిస్తుంది' అని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన దర్శకుడు హరీశ్ శంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమా పొలిమేరలు దాటి డబుల్ ధమాకా సౌండ్ ఇవ్వాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

ఉస్తాద్ నుంచి పాట అప్పుడే

ఇదే ఈవెంట్‌లో 'ఉస్తాద్ భగత్‌సింగ్' గురించి అప్డేట్ ఇచ్చారు హరీశ్ శంకర్. డిసెంబరులో ఈ సినిమా నుంచి తొలి పాటను విడుదల చేస్తామని చెప్పారు. అలాగే అతి త్వరలోనే సినిమా విడుదల తేదీని కూడా ప్రకటిస్తాం అని చెప్పి పవన్ అభిమానులను ఖుషీ చేశారు. హరీశ్ శంకర్ తెరకెక్కిస్తోన్న ఈ చిత్రంలో పవన్‌కల్యాణ్ శక్తిమంతమైన పోలీస్ అధికారిగా కనిపించనున్న సంగతి తెలిసిందే.

ఆ చిత్రాలకు మించి ఉంటుంది



రవి బస్రూర్

జూనియర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు మొదలైనప్పటి నుంచి ఎన్టీఆర్ అభిమానులు అప్డేట్స్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో సంగీత దర్శకుడు రవి బస్రూర్ ఓ అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు. 'కేజీఎఫ్', 'సలార్'కు మించి ఎన్టీఆర్- ప్రశాంత్ నీల్ సినిమా ఉంటుందని చెప్పి అందరికీ ఆనందం కలిగించారు. తాజాగా ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'ఎన్టీఆర్‌తో నీల్ తెరకెక్కిస్తోన్న చిత్రంలో విజువల్స్‌తో పాటు సంగీతం కూడా భారీస్థాయిలో ఉండనుంది. భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేశారు. ప్రశాంత్ నీల్ గత చిత్రాలు 'కేజీఎఫ్', 'సలార్'కంటే కూడా ఈ సినిమాలో సంగీతం భిన్నంగా ఉండనుంది. అందుకోసం కొత్త పరికరాలు ఉపయోగిస్తున్నాం' అని తెలిపారు. కాగా, ఈ సినిమాలో ఎన్టీఆర్ సరసన రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.



బాలకృష్ణ సినిమాలో నయనతార

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా గోపీచంద్ మలినేని ఓ చిత్రం తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. 'ఎన్‌బీకే 111' అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ సినిమా త్వరలోనే ప్రారంభం కానుంది. వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మంగళవారం నయనతార పుట్టినరోజు. ఈ సందర్భంగా ఈ సినిమాలో ఆమె నటిస్తున్నారని ప్రకటించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. చారిత్రక కథాంశం నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రంలో ఆమె రాణి పాత్రను పోషిస్తున్నారు. ఇంతవరకూ పోషించని సరికొత్త అవతార్‌లో బాలకృష్ణ కనిపించనున్నారు. 'సింహా', 'జై సింహా', 'శ్రీరామరాజ్యం' సినిమాల తర్వాత బాలయ్యతో కలసి ఆమె నటిస్తున్న చిత్రమిది.



హిందీ వాళ్లకు మన దెబ్బేంటో చూపించాం

నందమూరి బాలకృష్ణ

'మన దెబ్బేంటో ముంబైలో హిందీ వాళ్లకు చూపించాం (టైటిల్ సాంగ్‌ని ముంబైలో విడుదల చేయడాన్ని ఉద్దేశించి). ఇంట గెలిచి రచ్చ గెలవాలంటారు. 'అఖండ' తొలి భాగం ఎంత హిట్ అయ్యిందో అందరూ చూసే ఉంటారు. ఇప్పుడు దానికి సీక్వెల్‌గా 'అఖండ 2' పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్‌బస్టర్ కాబోతోంది' అని అన్నారు బాలకృష్ణ. ఆయన కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన చిత్రం 'అఖండ 2: తాండవం'. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బేనర్‌పై రామ్ అచంట, గోపీ అచంట నిర్మించారు. డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ సందర్భంగా వైజాగ్‌లో నిర్వహించిన వేడుకలో ఈ చిత్రం నుంచి 'జాజికాయ..' అంటూ సాగే గీతాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'ఇది కేవలం సినిమా కాదు. మన భారతీయ సనాతన హైందవ ధర్మం, శక్తి పరాక్రమాన్ని చాటి చెప్పే చిత్రం. మన భారతీయ మూలాలు ఏంటో తెలియజేసే సినిమా. అందుకే అన్ని భాషల్లో సినిమాను ప్రమోట్ చేస్తున్నాం' అని చెప్పారు. చిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'ఇది సినిమాలో ఉన్న ఒకే ఒక్క మాస్ పాట. అనంతపూర్‌లో జరిగే పుట్టిన రోజు వేడుకలో వచ్చే పాట ఇది. సంయుక్త మేనన్ చేసిన తొలి మాస్ సాంగ్ ఇది. నాకు ఊపిరి ఉన్నంత వరకూ, బాలయ్య బాబుకు ఓపిక ఉన్నంత వరకూ మా ఇద్దరి కాంబినేషన్ రిపీట్ అవుతూనే ఉంటుంది' అని అన్నారు.



గ్రామీణ నేపథ్యంలో...

శివాజీ, నవదీప్, నందు, బిందు మాధవి ప్రధాన పాత్రధారులుగా మురళీకాంత్ తెరకెక్కిస్తున్న చిత్రం 'దండోరా'. లౌక్య ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై రవీంద్ర బెనర్జీ ముప్పనేని నిర్మిస్తున్నారు. డిసెంబరు 25న చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా చిత్రం టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ ముప్పనేని మాట్లాడుతూ 'సామాజిక స్పృహతో తెరకెక్కించిన ఈ సినిమాలోని భావోద్వేగాలు ప్రేక్షకుల హృదయాన్ని బరువెక్కిస్తాయి. తప్పకుండా చూడాల్సిన చిత్రమిది' అని చెప్పారు. 'తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో మన ఆచారాలను, సంప్రదాయాలను ఆవిష్కరించే చిత్రమిది' అని మురళీకాంత్ చెప్పారు.



ఐ బొమ్మ రవిని ఎన్‌కౌంటర్ చేయాలి

నిర్మాత సి. కల్యాణ్

ఐ - బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని ఎన్‌కౌంటర్ చేయాలంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు నిర్మాత సి. కల్యాణ్. రవిని అరెస్ట్ చేసి, పైరసీని అరికట్టడంలో కీలకపాత్ర పోషించిన తెలంగాణ ప్రభుత్వానికి, పోలీసులకు ధన్యవాదాలు తెలిపేందుకు తెలుగు చిత్ర పరిశ్రమ తరఫున మంగళవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సి. కల్యాణ్ మాట్లాడుతూ 'రవి లాంటివాళ్ల వల్ల జనాలు థియేటర్లకు రాకుండా, ఇంట్లో పిల్లా పాపలతో కూర్చొని పకోడి తినుకుంటూ హ్యాపీగా హెచ్‌డీ క్వాలిటీలో సినిమాలు చూస్తున్నారు. ఇలాంటి దుర్మార్గులకు అరెస్టులు, శిక్షలు సరిపోవు. ఎన్‌కౌంటర్ చేయాలి. పోలీసులు చేయకపోతే కనీసం సినిమావాళ్లైనా చేయాలి. రూ. వందల కోట్ల ఖర్చుతో వందలాది మంది శ్రమతో రూపొందిన సినిమాను పైరసీ చేసినవాడి రక్తం చూడడం అవసరం. ఇలాంటి వాళ్లని ఒకరిని ఎన్‌కౌంటర్ చేస్తే భవిష్యత్‌లో ఇలా చేయాలనుకునేవాళ్లు భయపడతారు. త్వరలో సీపీ సజ్జనార్‌ను ఘనంగా సత్కరిస్తాం' అని చెప్పారు. ఛాంబర్ అధ్యక్షుడు భరత్‌భూషణ్ మాట్లాడుతూ 'సీనియర్ పోలీస్ అధికారులు చాలా కష్టపడి రవిని పట్టుకున్నారు. ఛాంబర్ తరఫున నిర్వహిస్తున్న పైరసీ సెల్ కూడా ఈ దిశగా కృషి చేస్తోంది. పైరసీని అరికట్టేందుకు బలమైన చట్టాలు తేవాలి' అని ప్రభుత్వాన్ని కోరారు. 'క్యూబ్, యూఎఫ్ఓ లాంటి డిజిటల్ సినిమా పంపిణీ సంస్థలు తమ సర్వర్లను మరింత జాగ్రత్తగా చూసుకోవాలి, వారి దగ్గర కనుక సినిమాలు పైరసీ అయితే ఇకపై వారే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది' అని చదలవాడ శ్రీనివాసరావు హెచ్చరించారు. పైరసీకి పాల్పడేవారిని పట్టుకునేందుకు ప్రత్యేకంగా ఒక విభాగాన్ని ఏర్పాటు చేయాలని పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను నిర్మాత ప్రసన్న కుమార్ కోరారు.

అమ్మ మాట.. అరణ్య రోదన

'ఇంటికి రా కొడుకా' అంటూ ఇటీవల హిడ్మాను కోరిన తల్లి

చింతూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 'లోన్ వర్ర తమ్మా' (ఇంటికి రా కొడుకా) అని మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా తల్లి ప్రసార మాధ్యమాల ద్వారా ఇటీవల హిడ్మాను కోరారు. ఇది జరిగి వారం గడవక ముందే హిడ్మా ఎన్‌కౌంటర్ అయ్యాడు. వారం కిందట ఛత్తీసగఢ్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి విజయశర్మ హిడ్మా తల్లితో కలిసి భోజనం చేశారు. ఆ సమయంలో ఆమె ప్రసార మాధ్యమాలతో మాట్లాడుతూ హిడ్మాను ఇంటికి రావాలని, ఇంటి వద్దనే ఏదొక పనిచేసుకొని బతుకుదామని కోరారు. ఏదైనా పరిస్థితిలో హిడ్మా బయటకు రాలేని పరిస్థితి ఉంటే తానే అక్కడకు చేరుకొని వెంట తీసుకొని ఇంటికి వస్తానని కూడా అన్నారు.



ప్రసార మాధ్యమాల ద్వారా తన కొడుకును ఇంటికి రమ్మని కోరుతున్న హిడ్మా తల్లి

ఒంటరైన హిడ్మా తల్లి

సాయుధ పోరాటంలో హిడ్మా కుటుంబం మొత్తం అసువులు బాసింది. హిడ్మా చిన్నప్పుడే తండ్రి మృతి చెందారు. తల్లి, ఇద్దరు అన్నలు, అక్కతో హిడ్మా కుటుంబం పూవర్తి గ్రామంలో జీవనం సాగించేది. పీపుల్స్ వార్ పార్టీ గ్రామాల్లో జననాట్యమండలి వారు సభలు సమావేశాలు నిర్వహించేవారు. ఈ క్రమంలో హిడ్మా సోదరులు పార్టీ వైపు ఆకర్షితులై అందులో చేరారు. 2008లో హిడ్మా అక్క మృతి చెందగా, 2015లో హిడ్మా అన్న ఎన్‌కౌంటర్‌లో మరణించాడు. ఆయనకు గుర్తుగా పూవర్తిలో హిడ్మా భారీ స్థూపం నిర్మించాడు. ఆ తర్వాత గ్రామంలో క్యాంప్ పెట్టిన భద్రతా బలగాలు ఆ స్థూపాన్ని కూల్చివేశాయి. ప్రస్తుతం హిడ్మా తల్లి ఒక్కరే పూవర్తిలో ఉన్నారు.

గెరిల్లా గుండెలయ హిడ్మా

దండకారణ్యంలో అలజడి రేపిన ఆదివాసీ నేత.. సాధారణ వ్యక్తిగా మొదలై మిలిటరీ చీఫ్‌గా ఎదిగి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మడివి హిడ్మా...ఈ పేరు నిన్నటిదాకా కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు ఓ పెద్ద సవాల్. దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత కోసం పనిచేస్తున్న సీఆర్పీఎఫ్, గ్రేహౌండ్స్, డీఆర్‌జీ, ఇతర బలగాలకు ఈ ఆదివాసీ నేత వేసే వ్యూహాలంటే వెన్నులో వణుకు. ఎందుకంటే అయన చరిత్ర అలాంటిది. ఆయన తమకు దొరకాలని లేదా ఆయన విసిరే అంబుష్‌లో తాము పడకూడదని, కూంబింగ్ ఆపరేషన్‌కు బయలుదేరిన తాము క్షేమంగా తిరిగి క్యాంప్‌కు చేరుకోవాలని బలగాలు వెయ్యి దేవుళ్లను కోరుకునేవి. దండకారణ్యం ఆయనకు ఇల్లు లాంటిది. ఎక్కడి నుంచి మొదలుపెట్టి...ఎక్కడ ముగించాలో ఆయనకు తెలుసు. 2004 నుంచి 2025 ఏప్రిల్ వరకు దండకారణ్యంలో జరిగిన వరుస సంఘటనలతో హిడ్మా వణుకు పుట్టించాడు. గెరిల్లా యుద్ధరంగంలో సుదీర్ఘకాలం ప్రభుత్వ బలగాలతో పోరాడుతున్న పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) ముఖ్యనేత హిడ్మా. చివరకు ఏపీ గ్రేహౌండ్స్‌తో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. దండకారణ్యంలో మావోయిస్టు పార్టీ ఆయువుపట్టును దెబ్బకొట్టగలిగామని ఆంధ్రా పోలీసువర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. దండకారణ్యంలో మావోయిస్టు పార్టీ ఉనికి పీఎల్‌జీఏ (మావోయిస్టు పార్టీ సాయుధ సైన్యం) కార్యకలాపాలపైనే ఎక్కువగా ఆధారపడింది. దాన్ని ముందుండి నడిపించే సేనానే ఎన్‌కౌంటర్ కావడం ఆ పార్టీకి కోలుకోలేని షాక్ ఇచ్చిందని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. అయితే, దేశంలో మావోయిస్టులను 2026 మార్చి చివరి నాటికి లేకుండా చేస్తామని ప్రధానమంత్రి బిహార్ వేదికగా ప్రకటించిన కొద్దిరోజుల వ్యవధిలోనే హిడ్మా ఎన్‌కౌంటర్ కావడం మరింత సంచలనంగా మారింది. ఆపరేషన్ కగార్‌తో తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంటూ మావోయిస్టు పార్టీ కీలక నేతలను కోల్పోయింది. ఈ ఏడాదిలో ఇప్పటికే ఆ పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి బస్వరాజ్, ఇంకా 8 మంది కేంద్ర కమిటీ సభ్యులను కోల్పోయింది. సాయుధపోరాటం విరమిస్తున్నామని, ఇప్పుడు యుద్ధం కన్నా శాంతి సాధనే ముఖ్యమనే నినాదాలతో ఆ పార్టీ అగ్రనేతలు సోను, ఆశన్న సహా అనేక మంది ఇటీవల ప్రభుత్వం ముందు లొంగిపోయారు. అయితే, సాయుధ పోరాటం విరమించాలన్న ప్రతిపాదనను తిరస్కరిస్తున్నామని, సాయుధ పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వం శాంతిచర్చలకు సిద్ధం కావాలని మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రకటించిన కొద్దిరోజుల వ్యవధిలోనే హిడ్మా ఎన్‌కౌంటర్ జరగడం మావోయిస్టు శ్రేణులు, ప్రజాసంఘాలను సైతం తీవ్ర కలవరానికి గురిచేస్తోంది.

ఎవరీ హిడ్మా?

2017లో మావోయిస్టు పార్టీలో నాయకత్వ మార్పిడి భారీగా జరిగింది. కేంద్ర కమిటీ కార్యదర్శిగా గణపతి తప్పుకొని ఆ బాధ్యతలను బస్వరాజ్‌కు (నంబాల కేశవరావు) అప్పగించారు. బస్వరాజ్ అప్పటివరకు సెంట్రల్ మిలిటరీ కమిషన్ బాధ్యతలను చూశారు. ప్రధాన నాయకత్వంలోకి వెళుతూ...ఆ బాధ్యతలను తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీకి ఆయన అప్పగించారు. ఇదే సమయంలో.. అప్పటిదాకా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా ఉన్న హిడ్మాను కేంద్ర కమిటీలోకి తీసుకున్నారు. దేవ్‌జీకి మిలిటరీ వ్యవహారాల్లో సహాయకుడిగా, హిడ్మా ఉండేవాడు. ఈ ఏడాది మే 21వ తేదీన బస్వరాజ్ ఎన్‌కౌంటర్ తర్వాత దేవ్‌జీ ఆయన స్థానంలో ప్రధాన కార్యదర్శి అయ్యారని, అప్పటివరకు ఆయన చూసిన బాధ్యతలను హిడ్మాకు పార్టీ అప్పగించిందని ప్రచారం జరిగింది. హిడ్మా అసలు పేరు హిడ్మాలు. నిజానికి మధ్యం హిడ్మా పేరుతో దండకారణ్య రీజనల్ కమిటీలో, దక్షిణ బస్తర్ డివిజన్ కమిటీలో ఓ సభ్యుడు ఉండేవాడు. ఆయన మరణం తర్వాత హిడ్మాలు పేరును హిడ్మాగా పార్టీ మార్చింది. 1981లో ఛత్తీస్‌గఢ్ లోని దక్షిణ సుకుమా జిల్లా పువర్తిలో హిడ్మా జన్మించాడు. తల్లి బిజ్జా ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉండగా, హిడ్మా చిన్నతనంలోనే తండ్రి మృతి చెందాడు. హిడ్మా కేవలం ఐదో తరగతి వరకే చదివాడు. దండకారణ్యంలో పీపుల్స్‌వార్ బలంగా విస్తరిస్తోన్న సమయంలోనే 17 ఏళ్ల వయసులో హిడ్మా సాయుధబాట పట్టాడు. నాటి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ నేత రామన్నకు శిష్యుడిగా ఎదిగాడు. ఒక పర్యాయం ఛత్తీస్‌గఢ్ పోలీసులకు హిడ్మా చిక్కాడని, అప్పటికి చెప్పుకోదగ్గ నేరారోపణలు లేకపోవడంతో ఆయన బెయిల్‌పై బయటకు వచ్చినట్టు సమాచారం. 2004లో మావోయిస్టు పార్టీ ఆవిర్భావం అనంతరం, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీలో (పీఎల్‌జీఏ) క్రియాశీల వ్యక్తిగా మారాడు. వడ్కాపూర్ చంద్రమౌళి (బీకే, దేవన్న, బాలకృష్ణ)) సెంట్రల్ మిలిటరీ కమిషన్ ఇన్‌చార్జిగా ఉన్న సమయంలో హిడ్మాకు కీలక బాధ్యతలు అప్పగించారు. దండకారణ్యంలో కీలక దాడుల కోసం మెరికల్లాంటి మిలీషియాతో పీఎల్‌జీఏ విభాగంలో ఏర్పాటుచేసిన బెటాలియన్-1కు ఆయనను తీసుకున్నారు. ఈ బెటాలియన్‌లో 185 మంది గెరిల్లా సభ్యులు ఉండేవారు. చివరకు దానికి చీఫ్ కమాండర్‌గా ఎదిగాడు.

> **గుండెలయ చెల్లాచెదురు**
>
> మావోయిస్టు పార్టీ మూల సిద్ధాంతం సాయుధ పోరాటం ద్వారా రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడం. అందుకోసం 2000లో పీపుల్స్ గెరిల్లా ఆర్మీని(పీజీఏ) ఏర్పాటు చేశారు. 2004లో పీపుల్స్‌వార్, ఎంసీసీల విలీనంతో ఏర్పడిన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) తన సైనిక నిర్మాణం పేరును పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ(పీఎల్‌జీఏ)గా మార్చింది. ఈ విభాగంలో బెటాలియన్-1యే కీలకం. 2019 వరకు పీఎల్‌జీఏ చీఫ్‌గా బస్వరాజ్ ఉన్నారు. ఆ తర్వాతనుంచి హిడ్మాయే సారథ్యం అందిస్తున్నాడు. బెటాలియన్-1 లోని కీలక సభ్యులు పోలీసులకు చిక్కడమో, ఎన్‌కౌంటరు కావడమే జరిగింది. ఇక ఇప్పుడు అధినేతే నేలకొరగడంతో పీఎల్‌జీఏ ఇక నామరూపాల్లేకుండా పోయింది.

భయంకర దాడులు

బెటాలియన్-1తో దండకారణ్యం పరిధిలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, బీజాపూర్, దంతేవాడలో హిడ్మా దారుణమైన సంఘటనలకు తెగించాడని పోలీసువర్గాలు చెబుతున్నాయి. 2010లో మావోయిస్టులు డీకే పరిధిలోని తాడిమెట్లలో భద్రతా బలగాలపై దాడులు జరిపి 73 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు, అధికారులను అంతమొందించారు. 2013లో సల్వాజుడుం అధినేత, కాంగ్రెస్ నేత మహేంద్ర కర్మతోపాటు మరో 23 మందిని హతమార్చారు. దీన్నే జీరంవాలీ ఊచకోతగా పిలుస్తున్నారు. 2017లో బుర్కాపూల్ అంబుష్ దాడిలో 23 మంది సీఆర్పీఎఫ్ జవాన్లను చంపేశారు. 2012లో సుకుమా కలెక్టర్ కిడ్నాప్‌తోపాటు అదే జిల్లాలో 13 మంది సీఆర్పీఎఫ్ కోబ్రాలను అంతమొందించిన సంఘటనలకు హిడ్మానే నాయకత్వం వహించాడని కేంద్ర హోమ్‌శాఖ రికార్డులు చెబుతున్నాయి. దండకారణ్యంలో మావోయిస్టు గెరిల్లా చర్యలు, ప్రత్యేకించి హిడ్మా నేతృత్వంలోని బెటాలియన్-1 చర్యల వల్ల 2015లో 120 మంది, 2017లో 160 మంది, 2018లో 87 మంది, 2019లో 65 మంది, 2020లో 42 మంది సీఆర్పీఎఫ్ బలగాలు మరణించారు.

కర్రెగుట్టల్లో మిస్ అయినా ఏపీలో చిక్కాడు..

తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ అటవీప్రాంతంలోని కర్రెగుట్టలు గత కొంతకాలంగా హిడ్మాకు అడ్డాగా మారాయి. అయితే, భద్రతా బలగాలు ఆ ప్రాంతాన్ని ఛేదించడంతో ఆయన తన మకాంను తొలుత ఏఓబీకి, అక్కడి నుంచి ఏపీకి మార్చినట్లుగా తెలుస్తోంది. ఏపీలోకి గత నెల 28నే వచ్చినట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే పోలీసులకు సమాచారం అంది ఉంటుందని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఏపీలో గత 14 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమం లేదు. ఈ నేపథ్యంలో ఏపీని సేఫ్‌జోన్‌గా భావించి హిడ్మా వచ్చి ఉంటాడని భావిస్తున్నారు. కర్రెగుట్టలలో తప్పించుకున్నా ఏపీ పోలీసులకు చిక్కడం అంతుచిక్కని అంశం.

భీకర దాడులకు వ్యూహకర్త

తాడిమెట్లలో ఐఈడీ బాంబులు పేల్చి 2010లో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను చంపేసిన ఘటనతో హిడ్మా పేరు బయటకొచ్చింది. అప్పటినుంచి హిడ్మా ఎలా ఉంటాడన్నదానిపై సీఆర్పీఎఫ్‌తోపాటు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, ఏపీ, తెలంగాణ బలగాలు చేయని ప్రయత్నం లేదు. లొంగిపోయిన నేతలు ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసు బలగాలు హిడ్మా ఆనుపానులపై కొన్ని స్కెచ్‌లు వేశాయి. కాగా, భీకర దాడులకు హిడ్మా వ్యూహకర్త.

అగ్రనేతగా ఎదిగిన తొలి ఆదివాసీ

హిడ్మా 17 ఏళ్ల వయస్సులో పీపుల్స్‌వార్ రాజకీయాలకు ఆకర్షితులయ్యాడు. సుకుమా ప్రాంతంలో క్రియాశీలక ఆదివాసీ గ్రామ ఆర్గనైజర్‌గా మొదలైన ఆయన ప్రస్థానం ఆ తర్వాత దళ సభ్యుడిగా, యాక్షన్ టీమ్ ఇన్‌చార్జి దాకా ఎదిగాడు. హిడ్మాకు గోండి, హిందీ, బెంగాలీ, కోయ, ఒడియా, కోయ భాషలు వచ్చు. దండకారణ్యంలోని 18 ఆదివాసీ తెగల భాషల్లో అనర్గళంగా మాట్లాడగలడని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పైగా కేంద్ర కమిటీకి ఎదిగిన తొలి ఆదివాసీ కూడా హిడ్మాయే. మావోయిస్టుల ఏరివేత కోసం కూంబింగ్ జరుగుతోందంటే ఆ ప్రాంతాలను ఖాళీ చేయడం సర్వసాధారణం. కానీ, హిడ్మా శైలినే వేరు. తాము ఫలానా అటవీ ప్రాంతంలో ఉన్నామని భద్రతా బలగాలకు లీకులు పంపించి వారిని మాటువేసి చంపుతాడని పోలీసువర్గాలు చెబుతున్నాయి. దంతేవాడ (2010) బీజాపూర్ (2011) జైరామ్ ఘాటీ (2013), బీజాపూర్-సుకుమా ఏరియా దాడులు(2021)ఈ కోవకు చెందినవే. వీటికి సంబంధించి ఆయనపై 26 కేసులు ఛత్తీస్‌గఢ్‌లో ఉన్నాయి. కూంబింగ్ ఆపరేషన్లలో ఉన్న భద్రతా బలగాలను దారి మళ్లించి, వారికి తనే ఓ అడ్డాను చూపించి, వారు అక్కడికి చేరుకునే క్రమంలో మాటువేసి విల్లంబులు, బాంబులు, ఐఈడీలతో విరుచుకుపడి ఊచకోతలు కోసినసందర్భాలు అనేకం ఉన్నాయి. అందుకే హిడ్మా ఉన్నాడన్న సమాచారం చేరిందంటే ఒకటికి పదిసార్లు తనిఖీ చేసుకున్నాకే ఆ దిశగా బలగాలు కదిలేవి. ఇటీవలి కాలంలో మానవ రహిత విమానాలు, డ్రోన్లు రావడంతో వాటి ద్వారా ఆయన ఆచూకీని నిర్ధారించుకునే ప్రయత్నాలు చేశారు. 2023 జనవరిలో బీజాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో బెటాలియన్ 1లోని 11 మంది ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. అందులో హిడ్మా ఉన్నాడని ప్రచారం జరిగింది. కానీ, దాడికి కొద్ది నిమిషాల ముందే అక్కడి నుంచి ఆయన తప్పించుకున్నట్లు ఆ తర్వాత బలగాలు గుర్తించాయి. మవోయిస్టు పార్టీకి సొంత క్యాడర్, ప్రజాసంఘాల ద్వారా డీకే పరిధిలో సొంత నిఘా వ్యవస్థ ఉంటుంది. అవి కాకుండా హిడ్మాకు ప్రత్యేక నిఘా వ్యవస్థ ఉందని చెబుతున్నారు. తనకోసం బలగాలు రాబోతున్నాయని ముందుగానే తెలుసుకొని ప్రతి దాడులకు సిద్ధమయ్యేలా ఆయన దండకారణ్యంలో ఎదిగారు. ఆ పార్టీ డిఫెన్స్ రీసోర్స్, రీసెర్చ్ విభాగాలను ఆయనే నిర్వహిస్తున్నారని తెలిసింది. ఎన్‌కౌంటర్‌లో మరణించేనాటికి ఆయన మిలిటరీ కమిషన్ ఇన్‌చార్జి, పీఎల్‌జీఏ చీఫ్‌గా వ్యవహరిస్తున్నారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

ఏపీలో వరుస ఎన్‌కౌంటర్లు

» దండకారణ్యాన్ని జల్లెడపట్టిన గ్రేహౌండ్స్

» నల్లమల నుంచి ఏవోబీకి పరిమితమైన నక్సల్స్

అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏవోబీ) అడవుల్లో మావోయిస్టుల కదలికలు మరోసారి అలజడి రేపాయి. పార్టీ మిలిటరీ చీఫ్ హిడ్మాతో పాటు ఆరుగురు మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోవడంతో మన్యం మరోసారి ఎరుపెక్కింది. పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్ బరీలో పుట్టిన మావోయిజం మన రాష్ట్రంలోని శ్రీకాకుళం జిల్లా నాయకత్వంలో బలపడింది. ఉమ్మడి ఏపీ నుంచి ఎక్కువ మంది మావోయిస్టు పార్టీ అగ్రనాయకులుగా ఎదగడంతో ఏపీ నుంచే గ్రేహౌండ్స్ పుట్టుకొచ్చింది. దశాబ్దాలుగా పోలీసులు దండకారణ్యాలను జల్లెడపడుతున్నా మావోయిస్టు పార్టీ ఉనికి పూర్తిగా కనుమరుగవలేదు. నల్లమల నుంచి తగ్గినా ఏవోబీలో మావోయిస్టుల ఉనికి ఉండేది. ఏపీలో బలిమెల ఎన్‌కౌంటర్‌లో ఎక్కువ మంది పోలీసుల్ని కోల్పోగా... 2017లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 32 మంది మావోయిస్టులు హతమయ్యారు. తాజాగా హిడ్మా ఎన్‌కౌంటర్... రాష్ట్రంలో కొన్నేళ్లుగా జరిగిన ఎన్‌కౌంటర్లను గుర్తుచేసింది.

అడ్డతీగల అడవుల్లో 2025 మే 7న ఎన్‌కౌంటర్

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని యర్రమ్మవరం-అడ్డతీగల అడవుల్లో ఈ ఏడాది మే 7న జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కకూరి పాం దన్న అలియాస్ జగన్ (57)తో పాటు మరో సీనియర్ క్యాడర్ వంగా పొడియామి అలియాస్ రమేశ్ హతమయ్యాడు. వారిలో జగన్‌పై రూ.20 లక్షల రివార్డు ఉంది. ఆయన 30 ఏళ్లుగా మావోయిస్టుల్లో కీలకపాత్ర పోషించాడు.

మారేడుమిల్లిలో 2025 జూన్ 18న..

మారేడుమిల్లి అరణ్యంలో ఈ ఏడాది జూన్ 18న మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇందులో సీపీఐ మావోయిస్టు సెంట్రల్ కమిటీ సభ్యుడు గజర్ల రవి అలియాస్ ఉదయ్ హతమైనట్టు పోలీసులు భావించారు. ఆయనతోపాటు రావి వెంకటలక్ష్మి చైతన్య అలియాస్ అరుణ, మరో వ్యక్తి మృతి చెందారు. రవిని నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) మోస్ట్ వాంటెడ్‌గా ప్రకటించింది. దండకారణ్యంలో రవి కీలక మిలిటరీ వ్యూహకర్తగా పేరుపొందాడు.

కొయ్యూరులో 2001 జూన్ 16న ఆరుగురు హతం

తీగలమెట్ట అడవిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో సండే గంగయ్య అలియాస్ అశోక్ (తెలంగాణ), రణదేవ్ అలియాస్ అర్జున్(కలిమేల దళం), సంతు నాచికా (ఆరియా కమిటీ సభ్యుడు- ఒడిశా), మహిళా క్యాడర్లు పైకే (ఛత్తీస్‌గఢ్), లలిత (జీకే వీధి) చనిపోయారు. సంఘటనా స్థలంలో ఏకే-47, ఎస్ఎల్ఆర్, కార్బైన్ మూడు 303 రైఫిల్స్‌తో పాటు భారీ ఆయుధాలను గ్రేహౌండ్స్ స్వాధీనం చేసుకున్నాయి.

2021 జూలై 26న జీ.మాడుగులలో ఎన్‌కౌంటర్

2021 జూలై 26న జీ.మాడుగులలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు మృతిచెందాడు. ఆ రోజు ఆదివారం కావడంతో ఏజీబీ ప్రాంతమంతా ఉద్రిక్తంగా మారింది. అదే ఏడాది ఆగస్టు 9న పెదబయలు మండలం చింతలవీధి వద్ద మావోయిస్టులు పాతిపెట్టిన ల్యాండ్‌మైన్ పేలి ఇద్దరు గిరిజన యువకులు మృతి చెందారు.

పోలవరం ప్రాజెక్టుకు భారీ భద్రత

» మావోయిస్టుల అలజడి నేపథ్యంలో విస్తృత తనిఖీలు, పెట్రోలింగ్

» సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ

పోలవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులు రాష్ట్రంలో మకాం వేశారన్న ఇంటెలిజెన్స్ సమాచారం మేరకు భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టుకు భారీ భద్రత కల్పించాయి. ప్రాజెక్టు వద్ద మంగళవారం విస్తృత తనిఖీలు నిర్వహించాయి. అనుమానిత ప్రాంతాల్లో నిరంతరాయంగా పెట్రోలింగ్ నిర్వహించాయి. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చి పోలవరం ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికుల వివరాలను పరిశీలిస్తున్నట్టు ప్రాజెక్టు అవుట్‌పోస్టు సీఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఇక నుంచి ప్రాజెక్టులో భద్రతా ఏర్పాట్లు పటిష్టం చేసి, అపరిచిత వ్యక్తుల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నారు.



పోలవరం ప్రాజెక్టు వద్ద ఇతర రాష్ట్రాల కార్మికులను విచారిస్తున్న పోలీసులు

'పెద్దాయన' చెప్పిందే చేశా!

(మొదటి పేజీ తరువాయి)

మాత్రం వెల్లడించలేదని సమాచారం. మంగళవారం సిట్ విచారణలో టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్న అప్పన్నను రోజంతా సిట్ అధికారులు ప్రశ్నించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. నెయ్యి కల్తీ వ్యవహారంపై సిట్ అధికారుల ప్రశ్నలకు చిన్న అప్పన్న సరైన సమాధానాలు చెప్పకపోగా ఎదురు ప్రశ్నలు వేశాడు. తాను పెద్దాయనకు పీఏనని, నెయ్యి కల్తీ జరిగిందా? లేదా? అన్నదానితో తనకేం సంబంధం అని ప్రశ్నించాడు. కల్తీ నెయ్యిని అనుమతించడం అనేది తమకు సంబంధం లేని విషయమని, నెయ్యి నాణ్యమైందా? కాదా? అనేది పెద్దాయనకు ఎలా తెలుస్తుందన్నాడు. నాణ్యత గురించి చూసుకోవాల్సింది టీటీడీ అధికారులేనని, ఏదైనా జరిగిఉంటే సంబంధిత విభాగాల అధికారులు, ఉద్యోగులే బాధ్యులన్నాడు. అయితే గత ప్రొక్యూర్‌మెంట్ జీఎం సుబ్రమణ్యంతో తనకు పరిచయం ఉన్నట్లు అంగీకరించాడు.

ఖాతాల్లో డబ్బులు ముడుపులేనా?

ఢిల్లీ ఏపీ భవన్‌లో పనిచేసినపుడు పెద్దాయన చెప్పిన వారికి బస వంటి అవసరమైన సదుపాయాలు కల్పించేవాడినని చిన్న అప్పన్న వెల్లడించాడు. అయితే ఎవరెవరికి సదుపాయాలు కల్పించిందీ మాత్రం చెప్పలేదు. బ్యాంకు ఖాతాల్లోని డబ్బు నెయ్యి సరఫరా ముడుపులే కదా అని ప్రశ్నించగా.. పెద్దాయన చెప్పిన వారికి ఏపీ భవన్‌లో సదుపాయాలు కల్పించినపుడు వారు తన సేవలకు మెచ్చి డబ్బు ఇచ్చేవారని, ఆ డబ్బు తన ఖాతాల్లో దాచుకున్నానని వివరించాడు. తనకు వ్యక్తిగతంగా పది వరకూ బ్యాంకు ఖాతాలున్నాయని తెలిపాడు. తెలుగుతో పాటు ఇంగ్లిష్, హిందీ, కన్నడ, తమిళం వంటి భాషలు తనకు తెలుసునని చెప్పాడు.

పదే పదే ప్రశ్నించినా..

సిట్ విచారణలో పలు సందర్భాల్లో పెద్దాయన ప్రస్తావన తెచ్చిన చిన్న అప్పన్న పెద్దాయన పేరు మాత్రం వెల్లడించలేదు. పెద్దాయన ఎవరు? పేరేమిటి? అని సిట్ అధికారులు తరచితరచి ప్రశ్నించినా సమాధానం ఇవ్వలేదు. అలాగే ముడుపులపై, బ్యాంకు ఖాతాలపై, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ప్రమేయంపై ప్రశ్నలకు సమాధానాలు దాటవేశాడు. కాగా, ఐదు రోజుల కస్టడీలో ఇప్పటికే రెండు రోజులు గడిచిపోయాయి. చిన్న అప్పన్న నుంచీ దర్యాప్తునకు ఉపకరించే చెప్పుకోదగ్గ సమాచారమేదీ సిట్ రాబట్టలేకపోయింది. కస్టడీ గడువు ఈనెల 21తో ముగియనుంది. ఆలోపు చిన్న అప్పన్న నుంచి నెయ్యి కల్తీ వ్యవహారంలో కీలక సూత్రధారులు ఎవరన్నది రాబట్టాల్సి వుంది. చిన్న అప్పన్న ఇచ్చే సమాచారం ఆధారంగానే వైవీ సుబ్బారెడ్డిని విచారించాలని సిట్ భావిస్తున్నట్టు తెలిసింది.

పాడేరు వైద్య కళాశాలలో 50 అదనపు సీట్లకు నో

» అధికారుల నిర్లక్ష్యంతో ఎన్ఎంసీ నిరాకరణ

» మంత్రి సత్యకుమార్ ఆగ్రహం...

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య విద్యార్థులు 50 ఎంబీబీఎస్ సీట్లను కోల్పోయారు. అధికారుల నిర్లక్ష్యం, తప్పిదాల కారణంగా వైద్య విద్యకు దూరమయ్యారు. పాడేరు వైద్య కళాశాలలో ప్రస్తుతం 50 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. 2025-26 సంవత్సరానికిగాను అదనంగా మరో 50 సీట్లు కేటాయించాలని ఆరోగ్యశాఖ ఎప్పుడో దరఖాస్తు చేసింది. ఎన్ఎంసీ నిబంధనల మేరకు మౌలిక సదుపాయాలు, ఫ్యాకల్టీ, ఇతర సిబ్బందికి సంబంధించి ఏ లోటూ లేదు. దీంతో ఇక్కడ సీట్ల పెంపుపై ప్రత్యేకంగా దృష్టిసారించిన మంత్రి సత్యకుమార్ ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేస్తూ వచ్చారు. పాడేరు కాలేజీకి అదనపు సీట్లు వస్తాయంటూ వైద్య విద్యా విభాగం (డీఎంఈ) అధికారులూ సమీక్షల్లో ధీమాగా చెపుతూ వచ్చారు. అందుకు భిన్నంగా ఎన్ఎంసీ నుంచి లేఖ వచ్చింది. అదనపు సీట్ల కేటాయింపునకు నిరాకరించింది. దీనికి అధికారుల నిర్లక్ష్య వైఖరే కారణమని తేలింఅదనపు సీట్ల కోసం ఆరోగ్యశాఖ పంపిన అభ్యర్థనను పరిశీలించిన ఎన్ఎంసీ కొన్ని అంశాలపై వివరణ కోరింది. 'హెల్త్ వర్సిటీ నుంచి పొందిన అఫిలియేషన్ సక్రమంగా లేదు. దానిని సరిచేసి పంపించండి. కళాశాల నిర్వహణకు సంబంధించిన వీడియో రికార్డులు పంపించండి' అని డీఎంఈని, ప్రిన్సిపల్‌ను కోరింది. ఈ అంశాలపై స్పందించడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో అదనపు సీట్ల కేటాయింపునకు ఎన్ఎంసీ నిరాకరించింది. ఈ నేపథ్యంలో డీఎంఈ, పాడేరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌పై మంత్రి సీరియస్ అయ్యారు. సంబంధిత అధికారులకు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్‌ను మంత్రి సత్యకుమార్ ఆదేశించారు.

నేడు సీమ, దక్షిణకోస్తాలో వర్షాలు

విశాఖపట్నం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం మంగళవారం నాటికి కామరూన్ పరిసరాల్లో కేంద్రీకృతమై ఉంది. రానున్న 24గంటల్లో ఇది తమిళనాడు తీరం దిశగా రానుందని వాతావరణ శాఖ ప్రకటించింది. దీని ప్రభావంతో మంగళవారం తిరుపతి, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని, ఉత్తరకోస్తాలో పొడి వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, మంగళవారం కోస్తా, రాయలసీమల్లో అనేకచోట్ల చలి తీవ్రత కొనసాగింది. కళింగపట్నంలో 15.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. ఆ తర్వాత రెండు రోజుల్లో వాయవ్యంగా పయనించి వాయుగుండంగా లేదా తుఫాన్‌గా మారుతుందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఈనెల 24 నుంచి దక్షిణ కోస్తా, రాయలసీమల్లో, 26 లేదా 27 నుంచి ఉత్తర కోస్తాలో వర్షాలు కురుస్తాయని, దక్షిణకోస్తాలో అక్కడక్కడ భారీవర్షాలు పడే అవకాశం ఉంది.

హిడ్మా అంతం చరిత్రాత్మక విజయం!

» మార్చి 31నాటికి నక్సల్స్ రహిత భారతం తథ్యం: బీజేపీ

» నక్సలిజం అంతం దిశగా స్థిరమైన పురోగతి: వినోద్ తావ్డే

» ఇది భారీ వ్యూహాత్మక విజయం: ప్రదీప్ భండారీ

న్యూఢిల్లీ, నవంబరు 18:నక్సలిజానికి వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం చేపట్టిన పోరాటంలో హిడ్మా అంతం ఒక చరిత్రాత్మక విజయమని బీజేపీ అభివర్ణించింది. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి వామపక్ష తీవ్రవాదం నుంచి దేశం పూర్తిగా విముక్తమవడం తథ్యమని పేర్కొంది. దశాబ్దాలుగా హింసను, భయాందోళనలను వ్యాపింపచేస్తున్న హిడ్మాను భద్రతా దళాలు 'పక్కా ప్రణాళిక, సాహసోపేతమైన ఆపరేషన్' ద్వారా అంతమొందించాయని బీజేపీ జాతీయ ప్రధానకార్యదర్శి వినోద్ తావ్డే మంగళవారం 'ఎక్స్'లో కొనియాడారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పటిష్ట నాయకత్వం, హోంమంత్రి అమిత్‌షా విధానాల ద్వారా దేశం నక్సల్ విముక్తం దిశగా స్థిరంగా పురోగమిస్తోంది. 2026 మార్చి 31 నాటికి భారతదేశం తప్పకుండా నక్సలిజం నుంచి పూర్తిగా విముక్తమవుతుంది' అని పేర్కొన్నారు. కాగా, హిడ్మా అంతాన్ని నక్సలిజంపై పోరాటంలో భారీ వ్యూహాత్మక విజయంగా బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ అభివర్ణించారు. మోదీ నాయకత్వం, అమిత్‌షా నిర్వహణలో భారతదేశ నక్సల్ వ్యతిరేక వ్యూహం పదునెక్కిందని పేర్కొన్నారు. హిడ్మా అంతం ద్వారా తన చీకటి అధ్యాయాల్లో ఒకదానిని భారతదేశం మూసివేసిందని బీజేపీ అధికారిక 'ఎక్స్' ఖాతాలో పేర్కొంది. 'అతని అంతం ఒక టర్నింగ్ పాయింట్. దేశవ్యాప్తంగా వామపక్ష తీవ్రవాదం పతనమవుతోంది. 2013లో 182 ప్రభావిత జిల్లాలు ఉండగా, నేడు అవి 13కు పరిమితమయ్యాయి. ఇదో గొప్ప ధైర్యం, త్యాగం, దృఢ సంకల్పాల కథ. భద్రతాదళాలు, స్థానిక సమాజాలు భుజాలు కలిపి నిలబడటంతో చివరికి హింస రహిత, ప్రగతిశీల భారతదేశం అందుబాటులోకి వచ్చింది' అని పేర్కొంది.

ఇది బూటకపు ఎన్‌కౌంటర్!

» హిడ్మాను పట్టుకొని.. కాల్చిచంపారు: ప్రజాసంఘాలు

» ఘటనపై న్యాయ విచారణ జరిపించాలి

» పోలీసుల అదుపులో ఉన్న వారిని విడుదల చేయాలి

» న్యూడెమోక్రసీ, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ డిమాండ్

అమరావతి/హైదరాబాద్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాది బూటకపు ఎన్‌కౌంటర్ అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ ఆరోపించాయి. హిడ్మా, ఆయన భార్య, మరి కొందరిని పోలీసులు ఎక్కడో పట్టుకొని మారేడుమిల్లి అటవీప్రాంతంలో కాల్చిచంపి ఎన్‌కౌంటర్ కథ అల్లుతున్నారని న్యూడెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధులు పి.ప్రసాద్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, రాజకీయ ఖైదీల విడుదల కమిటీ కన్వీనర్ బల్లా రవీంద్రనాథ్ వేర్వేరు ప్రకటనల్లో ఆరోపించారు. పోలీసుల చర్యను వారు ఖండించారు. ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పోలీసుల అదుపులో ఉన్న మావోయిస్టులను వెంటనే విడుదల చేయాలని, వారిపై కేసులుంటే కోర్టులో తక్షణమే హాజరుపరచాలని కోరారు. మావోయిస్టు నేత తిప్పిరి తిరుపతి కూడా పోలీసుల అదుపులో ఉన్నట్టు తమకు అనుమానం ఉందని న్యూడెమోక్రసీ నేతలు పేర్కొన్నారు. ఆయన ప్రాణానికి హాని ఉన్నందున పోలీసులు వెంటనే ఆయన ఉనికిని బయటపెట్టాలని కోరారు. ఎన్‌కౌంటర్, అరెస్టుల విషయంలో హైకోర్టు వెంటనే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, హక్కుల సంఘాలు వెంటనే స్పందించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. కాగా, హిడ్మా ఎటు కదిలినా తన సైన్యం వెంటే ఉంటుందని పౌరహక్కుల సంఘం నేత లక్ష్మణ్ తెలిపారు.

ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణ జరిపించాలి: సీపీఐ

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు నేత హిడ్మా, అతని భార్యతో సహా ఆరుగురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన మంగళవారం ఓ ప్రకటన చేశారు. 'ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమంటూ మావోయిస్టులు ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం దమనకాండను కొనసాగించడం గర్హనీయం. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా హింసాత్మక విధానాలు విడనాడి, మావోయిస్టులతో చర్చలు జరపాలి' అని రామకృష్ణ డిమాండ్ చేశారు.

ఏలూరులో.. బెజవాడలో.. మావోయిస్టులు



ఏలూరులో మావోయిస్టులు బస చేసిన భవనంలోకి వెనుకవైపు నుంచి ప్రవేశిస్తున్న మఫ్టీపోలీసులు



విజయవాడలోని న్యూ ఆటో నగర్‌లో మావోయిస్టులు ఉన్న భవంతిలో ఆక్టోపస్ బలగాలు

50 మంది నక్సల్స్ అరెస్టు

ఒకేరోజు 5 జిల్లాల్లో అదుపులోకి తీసుకున్న పోలీసులు

విజయవాడ/ఏలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఒకేరోజు భారీసంఖ్యలో మావోయిస్టులు అరెస్టయ్యారు. హిడ్మా ఎన్‌కౌంటర్ జరిగిన మంగళవారమే కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 50 మందిని పోలీసులు పట్టుకున్నారు. ఎక్కడో దండకారణ్యంలో ఉండే మావోయిస్టుల దళం బెజవాడ సమీపాన మకాం వేసింది. వెంట ఆయుధాలను కూడా తెచ్చుకుంది. అనుమానం రాకుండా ఓ భారీ భవనంలో బసచేసింది. విజయవాడకు కూతవేటు దూరంలో ఉన్న కానూరులో ఉన్న న్యూ ఆటోనగర్‌లో తలదాచుకున్న ఈ దళాన్ని గ్రేహౌండ్స్, ఆక్టోపస్ దళాలు అదుపులోకి తీసుకున్నాయి. సోమవారం అర్ధరాత్రి రెండు గంటల నుంచి మంగళవారం ఉదయం పది గంటల వరకు జరిగిన సైలెంట్ ఆపరేషన్‌లో మొత్తం 28 మంది మావోయిస్టులు పట్టుబడ్డారు. వీరిలో 21 మంది మహిళలు, ఏడుగురు పురుషులు ఉన్నారు. పట్టుబడినవారిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ రక్షణ దళాధిపతి జ్యోతి కూడా ఉన్నట్లు సమాచారం.

కూలీలుగా వచ్చిన మావోయిస్టులు..?

అప్పలస్వామినాయుడు అనే ఆర్కిటెక్చర్ కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరులోని కొత్త ఆటోనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఐదో అడ్డరోడ్డులో మూడంతస్తుల భవనాన్ని నిర్మించారు. గోడౌన్‌గా అద్దెకు ఇవ్వడానికి ఏడాది క్రితం దీనిని కట్టారు. కింది అంతస్తును ఏసీల డీలర్‌కు అద్దెకు ఇచ్చారు. అతడు ఇటీవల ఖాళీ చేయడంతో మూడు అంతస్తులూ ఖాళీగానే ఉన్నాయి. అప్పలస్వామినాయుడు ప్రస్తుతం జర్మనీ పర్యటనలో ఉన్నారు. భవనాన్ని చూసుకోవడానికి ఒక వాచ్‌మన్‌ను నియమించుకున్నారు. కొద్దిరోజుల క్రితం వాచ్‌మన్‌కు పరిచయం ఉన్న ముగ్గురు వ్యక్తులు అతడి వద్దకు వచ్చారు. ఆ తర్వాత అతడు ఈ 28 మంది మావోయిస్టులకు మూడో అంతస్తులో ఆశ్రయం ఇచ్చినట్లు తెలుస్తోంది. వారంతా పది రోజుల కిందటే ఇక్కడ దిగారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ భవనానికి అన్ని అంతస్తుల్లోను షట్టర్లు మాత్రమే ఉంటాయి. మొదటి రెండు అంతస్తులకు షట్టర్లు దించి తాళాలు వేసి ఉన్నాయి. మావోయిస్టులు కూడా మూడో అంతస్తుకు ఉన్న అన్ని షట్టర్లను దించేసి ఉంచారు. వారికి ప్రతి రోజూ తెల్ల కారులో ఉదయం టీ, అల్పాహారం.. మధ్యాహ్నం, రాత్రిపూట భోజనాలు వచ్చేవి. క్యాటరింగ్ చేసే వారి మాదిరిగా వాటిని తీసుకొచ్చేవారు. పెద్ద కెటిల్‌లో టీ, పెద్దపెద్ద క్యారేజీల్లో టిఫిన్లు, భోజనాలు వచ్చేవి. ఈ తతంగాన్ని పక్క భవనంలో ఉన్న వ్యక్తులు నాలుగు రోజుల క్రితం గమనించారు. వాచ్‌మన్‌ను పిలిచి భవనంలో ఉన్నవారెవరో కారులో వచ్చినవారిని అడిగి తెలుసుకోవాలని పురమాయించారు. అతడు అలాగే అడుగగా.. కూలీలు ఉన్నారని వారు చెప్పినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈ భవనంలో ఎందుకున్నారని ప్రశ్నించగా.. పనులు ఇంకా దొరకలేదని, మంచి ఉపాధి దొరకగానే వెళ్లిపోతారని వారు బదులిచ్చినట్లు తెలియవచ్చింది.

రోడ్లన్నీ మూసివేయించి..

న్యూ ఆటోనగర్‌లో సోమవారం అర్ధరాత్రి దాటాక 2 గంటల నుంచి మంగళవారం ఉదయం పది గంటల వరకు పోలీసుల ఆపరేషన్ సాగింది. బలగాలు అత్యంత చాకచక్యంగా వ్యవహరించాయి. ముందుగా భవనంవైపు ఉన్న రోడ్లన్నీ బారికేడ్లతో మూయించి.. భవనాన్ని చుట్టుముట్టాయి. షట్టర్ల వద్ద అత్యాధునిక ఆయుధాలతో మాటు వేశాయి. పోలీసుల హెచ్చరికలు, సందేశాలను అర్థం చేసుకున్న మావోయిస్టులు లొంగిపోయారు. వారిని ప్రత్యేక వాహనాల్లో కట్టుదిట్టమైన భద్రత మధ్య రహస్య ప్రదేశానికి తరలించారు. ఆ తర్వాత డాగ్ స్క్వాడ్ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించింది. తర్వాత బాంబ్ స్క్వాడ్ తుపాకులు, మారణాయుధాలు, పేలుడు పదార్థాలను గుర్తించింది. నక్సల్స్ వాటిని చెక్కపెట్టెల్లో భద్రపరిచి ఉంచారు. వాటన్నిటినీ పోలీసులు సీజ్ చేసి తీసుకెళ్లారు. అనంతరం క్లూస్ టీం మరిన్ని ఆధారాలను సేకరించింది. అలాగే విజయవాడ పరిధిలోని రామవరప్పాడులో మరో నలుగురు నక్సల్స్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం నుంచి తలదాచుకోవడానికి ఇక్కడకు వచ్చినట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి.

ఏలూరులో 15 మంది..

ఎస్పీ శివకిశోర్ పర్యవేక్షణలో 45 నిమిషాల్లోనే ముగిసిన ఆపరేషన్

ఏలూరు జిల్లాలో 15 మంది మావోయిస్టులను పోలీసులు అరెస్టుచేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకున్న షెల్టర్ జోన్లలో 60 మంది మావోయిస్టులు తలదాచుకున్నారని నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో.. పోలీసులు మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశాలతో ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిశోర్ స్వీయ పర్యవేక్షణలో పోలీసు బలగాలతో రంగంలోకి దిగారు. ఏలూరు మినీ బైపాస్ పక్కనే ఉన్న కేకేఆర్ గ్రీన్‌సిటీలోని ఒక భవనంలో నక్సల్స్ మకాం వేసినట్లు గుర్తించారు. డ్రోన్ల సాయంతో వారి కదలికలను పసిగట్టారు. ఉదయం 11 గంటల సమయంలో పోలీసులు మఫ్టీలో ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టారు. మరోవైపు.. విజయవాడ నుంచి ప్రత్యేకంగా 30 మంది బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు ధరించిన గ్రేహౌండ్స్ సిబ్బంది వచ్చారు. ఒక్కసారిగా ఆ భవనంపై దాడి చేసి 14 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ఐదుగురు మహిళలు, తొమ్మిది మంది పురుషులు ఉన్నారు. వీరంతా ఛత్తీస్‌గఢ్, ఒడిసాలకు చెందినవారుగా గుర్తించారు. 45 నిమిషాల్లో ఈ ఆపరేషన్ పూర్తయింది. వీరందరినీ ఏలూరులో నూతనంగా నిర్మించిన మహిళా పోలీసు స్టేషన్ భవనంలో ఉంచారు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సమాచారం. నెల రోజుల క్రితం వారీ ఇంటికి వచ్చారని.. ఎవరితోనూ మాట్లాడేవారు కాదని, వారి పని వారు చూసుకునేవారని.. రాత్రి రెండు గంటల వరకూ లైట్లు వెలుగుతూ ఏవో శబ్దాలు వస్తూ ఉండేవని చుట్టుపక్కల వారు చెప్పారు. కాగా.. ఏలూరు సమీపంలోని వట్లూరు వేణుగోపాలస్వామి గుడి ఎదురుగా ఉన్న ఒక ప్రైవేటు హాస్టల్‌పై స్పెషల్ పార్టీ పోలీసులు దాడి చేసి ఓ యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద ఆయుధాలు ఉన్నట్లు తెలుస్తోంది. అతడు మావోయిస్టు అని తెలియడంతో విద్యార్థులంతా అవాక్కయ్యారు. పది రోజుల క్రితమే అతడు పేయింగ్ గెస్టుగా చేరాడు. అతడితో పాటు హాస్టల్ నిర్వాహకుడినీ అదుపులోకి తీసుకున్నారు. జిల్లాలో బుట్టాయిగూడెం, పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గ్రేహౌండ్స్ దళాలు, పోలీసు బలగాలు విస్తృతంగా గాలింపు చేపట్టాయి. కాగా.. కాకినాడ జిల్లా పోలీసులు ఇద్దరు మహిళా మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. హిడ్మాకు గన్‌మెన్‌గా ఉన్న వీరిని మంగళవారం సామర్లకోట మండలం కొప్పవరంలో అరెస్టు చేసి.. ఏలూరు రేంజ్ పోలీసులకు అప్పగించారు. అలాగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఓ మావోయిస్టును అరెస్టుచేశారు.



ఏలూరులో మహిళా మావోయిస్టులను భవనం నుంచి బయటకు తీసుకొస్తున్న పోలీసులు

ఏలూరుకు పది మంది ఆదివాసీల తరలింపు?

కుక్కునూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టుబడిన మావోయిస్టుల నుంచి సమాచారం సేకరించడానికి.. వారు మాట్లాడేదేంటో తెలుసుకోవడానికి ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం కొత్తలంకాలపల్లి నుంచి పది మంది ఆదివాసీలను ఏలూరు తరలించినట్లు సమాచారం. మావోయిస్టులు మాట్లాడేది వీరు తెలుసుకుని పోలీసులకు తెలుగులో తర్జుమా చేసి చెబుతారని ప్రచారం జరుగుతోంది. 20 ఏళ్ల క్రితం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన కొందరు ఆదివాసీలు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో స్థిరపడ్డారు. వారిలో చాలా మంది తెలుగు మాట్లాడగలరు. ఈ క్రమంలోనే పట్టుబడిన నక్సల్స్ మాట్లాడే భాషను తెలుగులో చెప్పడానికి వారిని ఉపయోగించుకోనున్నట్లు తెలుస్తోంది.



విజయవాడలో న్యూఆటోనగర్‌లో పట్టుబడ్డ మావోయిస్టులను తరలిస్తున్న పోలీసులు

పక్కా సమాచారంతో పట్టుకున్నాం

- కొద్దిరోజులుగా నక్సల్స్ కదలికలపై నిఘా
- కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడి వెల్లడి

విజయవాడ సిటీ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): నిఘా విభాగం నుంచి వచ్చిన పక్కా సమాచారంతోనే కృష్ణా జిల్లా పెనమలూరు పోలీసు స్టేషన్ పరిధిలోని కొత్తఆటోనగర్‌లో ఆశ్రయం పొందుతున్న 28 మంది మావోయిస్టులను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. వారిని అరెస్టు చేసిన ప్రదేశాన్ని పరిశీలించిన తర్వాత ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ ప్రాంతంలో మావోయిస్టుల కదలికలను గత కొన్ని రోజులుగా నిశితంగా పరిశీలిస్తున్నామని, మావోలపై పోలీసులు పెద్దఎత్తున దృష్టి సారించడంతో కొందరు కొత్తఆటోనగర్‌లో ఆశ్రయం పొందేందుకు వచ్చారనే విశ్వసనీయ సమాచారం తమకు అందిందన్నారు. దీంతో లా అండ్ ఆర్డర్, ఆక్టోపస్, ఇంటెలిజెన్స్ విభాగాలతో జాయింట్ ఆపరేషన్ చేపట్టామని తెలిపారు. అరెస్టుచేసిన వారిలో కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ సంరక్షకులు 9 మంది, హిడ్మా బెటాలియన్ సభ్యులు 19 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో ఇక్కడ షెల్టర్ తీసుకుంటున్నారని, ఈ పరిసరాల్లో, అమరావతిలో హింసాత్మక, విధ్వంసక ఘటనలకు పాల్పడేందుకు ప్రణాళిక రచిస్తున్నారనే సమాచారం ఉందన్నారు. విచారణ జరిపిన తర్వాత పూర్తి వివరాలను బహిర్గతం చేస్తామన్నారు. వీరికి ఆశ్రయం ఇచ్చిన భవనం యజమానిని ఫోన్‌లో విచారించినట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన హిడ్మా ఇక్కడి నుంచే ఆపరేషన్స్ జరిపారనడానికి ఎలాంటి ఆధారాలూ లేవని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. వరుస ఎన్‌కౌంటర్లకు ప్రతీకారంగానే విజయవాడ, పరిసర ప్రాంతాల్లో విధ్వంసానికి ఈ ప్రాంతంలో తిష్ట వేశారనే అనుమానాన్ని వ్యక్తంచేశారు. నక్సల్స్‌ను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్న గన్నవరం సబ్ డివిజన్ పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

చుట్టుముట్టి.. హెచ్చరించి..



ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

కృష్ణా జిల్లా పోలీసులు ఒక్క బుల్లెట్ కూడా పేల్చకుండా 28 మంది మావోయిస్టులను అరెస్టు చేశారు. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడి పర్యవేక్షణలో గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాస్ పెనమలూరు, గన్నవరం పోలీసులు, ఆక్టోపస్, నిఘా బృందాలతో కలిసి ఈ ఆపరేషన్‌ను విజయవంతం చేశారు. అర్ధరాత్రి ఒక్కసారిగా ఆ భవనాన్ని చుట్టుముట్టారు. లొంగిపోవాలంటూ మైకుల్లో హెచ్చరించడం కాకుండా.. మావోయిస్టుల సానుభూతిపరులను రంగంలోకి దించారు. వారి ద్వారా చర్చలు జరిపారు. ఇదే సమయంలో మావోయిస్టులు ఎటూ కదల్లేని పరిస్థితిని సృష్టించారు. ఉభయపక్షాలూ తుపాకులు బయటకు తీస్తే సామాన్య ప్రజల ప్రాణాలకు ముప్పు ఎదురుకావచ్చన్న సంకేతాలను పంపారు. చుట్టుముట్టిన పోలీసు వలయాన్ని ఛేదించడం కష్టమని గ్రహించేలా చేశారు. దీంతో లొంగిపోయేందుకు మావోయిస్టులు అంగీకరించారు.

ఫైరింగ్ ఎందుకు జరగలేదంటే..!

మావోయిస్టులు, కూంబింగ్ దళాలు ఎదురుపడితే పరస్పర కాల్పులు తప్పవు. కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు ఉన్న భవనం వద్ద మాత్రం అలాంటిదేమీ జరుగలేదు. ఎందుకంటే.. భవనంలో నక్సల్స్ మకాం వేశారని ముందే తెలుసుకున్న పోలీసులు.. తొలుత కొంతమంది మావోయిస్టు సానుభూతిపరులను వారి వద్దకు పంపారు. భవనాన్ని బలగాలు చుట్టుముట్టాయని.. ప్రతిఘటిస్తే కాల్చేస్తామని.. లొంగిపోవడమే మేలని సందేశం పంపారు. బాక్సుల్లో భద్రపరచిన ఆయుధాలను బయటకు తీసే అవకాశాన్ని బలగాలు ఇవ్వలేదని తెలుస్తోంది. ఈ కారణంగానే మావోయిస్టులు ప్రతిఘటన లేకుండా లొంగిపోయారు. కాల్పులు లేకుండా సైలెంట్‌గా ఆపరేషన్ ముగిసింది.

'డెడ్‌లైన్'కు ముందే హిడ్మా ఎన్‌కౌంటర్

- ఈనెల 30లోపే పని ముగించాలన్న అమిత్‌షా
- ముందే లక్ష్యాన్ని ఛేదించిన బలగాలు
- లొంగిపోతారా.. పరిణామాలను ఎదుర్కొంటారా?
- మావోయిస్టులకు మరోసారి బస్తర్ ఐజీ హెచ్చరిక

న్యూఢిల్లీ, నవంబరు 18 : మావోయిస్టు పార్టీ అగ్రనేత, మిలిటరీ వ్యూహకర్త మాద్వి హిడ్మాను కేంద్ర హోం శాఖ అమిత్‌షా పెట్టిన డెడ్‌లైన్‌కు ముందే భద్రతాబలగాలు ఎన్‌కౌంటర్ చేసినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 30వ తేదీ లోపు హిడ్మా పని ముగించాలని అమిత్‌షా ఆదేశించినట్టు సమాచారం. అయితే, ఆ తేదీకి ముందే భద్రతాబలగాలు తమ లక్ష్యాన్ని ఛేదించాయని తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌లో మంగళవారం ఉదయం హిడ్మా ఎన్‌కౌంటర్ అయిన విషయం తెలియగానే అమిత్‌షా ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షించిన ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడారు. ఆ ఘటనను గురించి ఆరా తీశారు. కాగా, హిడ్మా ఎన్‌కౌంటర్ నేపథ్యంలో, మావోయిస్టులకు ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ మరోసారి హెచ్చరికలు జారీచేశారు. లొంగిపోవడం లేదా తీవ్ర పరిణామాలను ఎదుర్కోవడం తప్ప మావోయిస్టులకు మరోదారి లేదని స్పష్టంచేశారు. హిడ్మా మృతితో ఒక్క బస్తర్‌లోనే కాకుండా మొత్తం భారతదేశ వ్యాప్తంగా భద్రతా బలగాలు నిర్ణయాత్మక ముందంజను సాధించాయని తెలిపారు. ఎన్‌కౌంటర్ అనంతరం ఘటనాస్థలిలో హిడ్మాతోపాటు ఆరుగురి మృతదేహాలను గుర్తించామని, ఆయన భార్య రాజే, సీనియర్ మావోయిస్టులు చెల్లూరి నారాయణ, టెక్ సుధాకర్ తదితరులు కూడా ఈ ఘటనలో మరణించారని, పెద్దఎత్తున ఏకే-47లను స్వాధీనం చేసుకున్నామని సుందర్‌రాజ్ వివరించారు.

కథ ముగిసినట్టేనా?!

హిడ్మా మృతితో మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ

- కీలక సభ్యుల వరుస ఎన్‌కౌంటర్లతో కుదేలు
- మిగిలినవారి లొంగుబాట్లతో డీలా పడిన పార్టీ
- 'ఆపరేషన్ కగార్' చివరి దశకు.. జనవరిలోపే పూర్తవుతుందని అంచనా

హైదరాబాద్/చర్ల, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మావోయిస్టు అగ్రనేత హిడ్మా ఎన్‌కౌంటర్‌లో మరణించడంతో మావోయిస్టు పార్టీ కథ ముగిసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో 'ఆపరేషన్ కగార్' చివరి దశకు చేరుకున్నట్టేనని భావిస్తున్నారు. గత రెండేళ్లుగా సాగుతున్న వరుస ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీ ఇప్పటికే డీలా పడింది. గత ఐదు నెలల్లో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు మృతి చెందారు. వారిలో సుధాకర్, బాలకృష్ణ, కడారి సత్యనారాయణరెడ్డి, కె.రామచంద్రారెడ్డి, అంజు దాదా ఉన్నారు. మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న, చంద్రన్న తదితర కీలక సభ్యులు లొంగిపోవడంతో పార్టీని నడిపించే నాయకుడు కరువయ్యారు. ఈ పరిస్థితుల్లో పార్టీ మనుగడపై నీలి నీడలు కమ్ముకున్నాయి. హిడ్మా ఎన్‌కౌంటర్‌తో ఇంకా అడవిలో ఉన్న వివిధ క్యాడర్ల మావోయిస్టులు కూడా లొంగిపోతారనే ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే జనవరిలోపే ఆపరేషన్ కగార్ ముగుస్తుందని అంచనా వేస్తున్నారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో మిగిలినవారిలో కొందరు పశ్చిమ బెంగాల్‌లో ఆశ్రయం పొందుతున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం పార్టీలో గణపతి, మల్లా రాజిరెడ్డి, మరో ఐదుగురు కేంద్ర కమిటీ సభ్యులు మిగిలి ఉన్నారని సమాచారం. వీరు మాత్రమే సాయుధ పోరాటాన్ని నమ్ముకున్నవారని, మరో నలుగురు సీసీ సభ్యులు లొంగిపోయేందుకు సిద్ధంగా ఉన్నారని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. షెల్టర్ జోన్‌లుగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఏరివేత చర్యలు ప్రారంభించిన నేపథ్యంలో మరిన్ని అరెస్టులు లేదా ఎన్‌కౌంటర్‌లు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఇప్పటికే దండకారణ్యంలోని పీఎల్‌జీఏ బృందాల్లో 12 లొంగిపోయాయి. మరో 6 బృందాలు ఉండొచ్చని చెబుతున్నారు. అవి కూడా త్వరలో లొంగిపోతాయని పోలీసు వర్గాల సమాచారం. అందులోనే తెలంగాణకు చెందిన ముగ్గురు, మరో ఏపీ నేత ఉంటారని చెబుతున్నారు. వీరి లొంగుబాటుకు అవకాశం కల్పించే పేరిట భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ల తీవ్రతను తగ్గించాయి.



తెలుగు వారెక్కడ?

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీలో తెలుగువారు ఐదుగురు ఉండగా, దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి తిప్పిరి అదుపులో ఉన్నారనే వార్తలు వస్తున్నాయి. మిగిలిన వారిలో కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల కేశవరావు (75) వయోభారంతో కదిలే పరిస్థితిలో లేరని తెలుస్తోంది. ఇక పాక హన్మంతు అలియాస్ గణేశ్ ఒడిశాలో యాక్టివ్‌గా ఉన్నారని పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. మరో సభ్యుడైన మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్(73) వృద్ధాప్య సమస్యలు ఎదుర్కొంటుండగా, పసునూరి నరహరి ఈఆర్‌బీలో యాక్టివ్‌గా ఉన్నారని తెలుస్తోంది.

భర్తీ చేయలేని లోటు

పీపుల్స్ వార్ దళాలకు అడవిలో దారి చూపించే గైడ్ స్థాయి నుంచి దళ సభ్యుడిగా, దళ నాయకుడిగా, అడవిని అసాంతం అర్థం చేసుకున్న గెరిల్లా వీరుడిగా ఎదిగిన హిడ్మా మరణం ఆ పార్టీకి భర్తీ చేయలేని లోటుగా మాజీ మావోయిస్టులు, పౌరహక్కుల సంఘాల నేతలు పరిగణిస్తున్నారు. పీఎల్‌జీఏ సైన్యంలో ఫస్ట్ బెటాలియన్ కమాండర్‌గా దళాలను ముందుకు నడిపిన హిడ్మా ఎన్‌కౌంటర్ ఆ పార్టీకి తీవ్రనష్టం కలిగిస్తుందని పోలీసు అధికారులు సైతం పేర్కొంటున్నారు. వాస్తవానికి హిడ్మా తన చుట్టూ సైన్యం లేకుండా ఎక్కడకూ వెళ్లడని, ఆయన రంపచోడవరం అడవిలో ఎన్‌కౌంటర్‌లో మరణిస్తే ఆయన సైన్యం విజయవాడలో పట్టుబడిందని పోలీసులు చెబుతున్న విషయాలు అత్యంత అనుమానాస్పదంగా ఉన్నాయని పౌరహక్కుల సంఘం నేత లక్ష్మణ్ అన్నారు.

7 నెలలు.. 3 ఎన్‌కౌంటర్లు!

- 11 మంది మావోయిస్టులు మృతి .. వారిలో మోస్ట్ వాంటెడ్ హిడ్మా
- అచ్చిరాని మారేడుమిల్లి.. 18వ తేదీ

(చింతూరు- ఆంధ్రజ్యోతి)

తుపాకీ పేలుళ్ల శబ్దాలు, బూట్ల చప్పుళ్లతో మారేడుమిల్లి అడవి దద్దరిల్లుతోంది. గత ఏడు నెలలల్లోనే ఇక్కడ మూడు ఎన్‌కౌంటర్లు జరిగాయి. మొత్తం 11 మంది మావోయిస్టులు మృతిచెందారు. మవోయిస్టు అగ్రనేత, మోస్ట్ వాంటెడ్ హిడ్మా ఎన్‌కౌంటర్ మారేడుమిల్లి అడవుల్లో జరగడం ఓ పెను సంచలనం. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి, వై.రామవరం మండలాల అడవుల్లో ఇటీవల జరుగుతున్న వరుస ఎన్‌కౌంటర్లతో ఆందోళన నెలకొంది. మావోయిస్టు పార్టీకి మారేడుమిల్లి అడవులతో పాటు 18 తేదీ అచ్చిరాలేదు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు ఈ అడవుల్లోనే మృతి చెందారు.ఈ ఏడాది వై.రామవరం మండలం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆంధ్ర- ఒడిశా బోర్డర్ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు టకూరి పండన్న అలియాస్ జగన్, ఏవోబీ డివిజన్ కమిటీ సభ్యుడు రమేశ్ మృతి చెందారు. ఈ ఘటనలో ఏకే 47, 303 రైఫిల్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇక ఇదే ఏడాది జూన్ 18న మారేడుమిల్లి మండలం కింటుకూరు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ ఉదయ్, కేంద్ర కమిటీ సభ్యుడు చలపతి భార్య, ఏవోబీ స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు రావి వెంకట చైతన్య, కొవ్వాసి అంజు అలియాస్ మాసే ఉన్నారు. తాజాగా నవంబరు 18న మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు, సౌత్ బస్తర్ బెటాలియన్ నాయకుడు హిడ్మా అలియాస్ సంతోష్, అతడి భార్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు రాజే అలియాస్ రాజక్క, దేవె, లఖాల్ అలియాస్ చైతు, మల్ల అలియాస్ మల్లాలు, కమ్లు అలియాస్ కమలేశ్ మరణించారు. ఈ ఘటనలో కూడా మావోయిస్టుల నుంచి పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో అలర్ట్

ఎన్‌కౌంటర్‌లో హిడ్మా మృతి చెందిన నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అప్రమత్తమయ్యాయి. పోలీసు క్యాంపుల వద్ద పహారా, కూంబింగ్‌ను ముమ్మరం చేశారు. హిడ్మా ఎన్‌కౌంటర్ సమాచారం తెలుసుకున్న ఛత్తీస్‌గఢ్ వాసులు ఆశ్చర్యానికి లోనయ్యారు. ఇక ఏపీతో పాటు ఒడిశా, తెలంగాణల సరిహద్దుల్లో పోలీసులు నిఘా పెంచారు.


మడివి హిడ్మా


మడకం రాజే


కమ్లేష్


మల్లు


దేవే


లక్మల్



హిడ్మా ఎన్‌కౌంటర్

'మోస్ట్ వాంటెడ్' మావోయిస్టు నేత మృతి

కాకినాడ/రంపచోడవరం/మారేడుమిల్లి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీ అగ్రనేత, అనేక రాష్ట్రాల పోలీసులకు 'మోస్ట్ వాంటెడ్' నక్సల్ నాయకుడు, గురితప్పని దాడుల వ్యూహకర్త, పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) కమాండర్ హిడ్మా (43) శకం ముగిసింది. మంగళవారం అల్లూరి సీతారామ రాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో... ఏపీ పోలీసుల చేతిలో హిడ్మా మరణించాడు. ఆయన జీవన సహచరితోపాటు మరో నలుగురు ఉద్యమ సహచరులూ ఇదే ఎన్‌కౌంటర్‌లో చనిపోయారు. పోలీసు వర్గాలు అందించిన సమాచారం ప్రకారం... 'ఆపరేషన్ కగార్' పేరుతో కేంద్రం వేట... ఛత్తీస్‌గఢ్ అడవుల్లో వేలమంది బలగాలతో భారీ కూంబింగ్... అగ్రనేతల లొంగుబాటు, ఎన్‌కౌంటర్లతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న మావోయిస్టులు... దట్టమైన దండకారణ్యం దాటారు. పోలీసులు దృష్టిసారించని మారేడుమిల్లి అడవుల్లో తలదాచుకోవాలని భావించారు. హిడ్మా మరికొందరితో కలిసి ఏపీ సరిహద్దుల్లోకి ప్రవేశించాడు. మారేడుమిల్లి అడవుల్లో తలదాచుకున్నాడన్న పక్కా సమాచారంతో... పోలీసులు 4రోజులుగా కూంబింగ్ ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో గుజ్జిమామిడి వలస (జీఎమ్ వలస) పంచాయతీలోని నెల్లూరు శివార్లలో పోలీసు బలగాలకు హిడ్మా దళం తారసపడింది. ఆ వెంటనే పోలీసులకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. అటువైపు నుంచి కాల్పులు ఆగిపోవడంతో... పోలీసులు అక్కడ గాలింపు జరిపారు. అక్కడ ఆరు మృతదేహాలు లభ్యమయ్యాయి. వారి మృతదేహాల చిత్రాలను ఛత్తీస్‌గఢ్ పోలీసులకు పంపించి... వారిలో హిడ్మా ఉన్నట్లు నిర్ధారించుకున్నారు. దీనిపై ప్రకటన వెలువడగానే... ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కలకలం రేగింది. ఇదే ఎన్‌కౌంటర్‌లో హిడ్మా భార్య, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు రాజే ... సాయుధ మావోయిస్టులు దేవే, లక్మల్ అలియాస్ చేతు, మల్ల ఎలియాస్ మల్లలు, కమ్లు ఎలియాస్ కమ్లేశ్ ఉన్నారు. ఘటనా స్థలం నుంచి మరికొందరు మావోయిస్టులు పరారయ్యారు. వీరికోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. సంఘటనా స్థలం నుంచి రెండు ఏకే 47 రైఫిళ్లు, ఒక పిస్టల్, ఒక రివాల్వర్, ఒక సింగిల్ బోర్ తుపాకీ, పలు ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 150 వరకూ నాన్‌ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, 25 మీటర్ల ఫ్యూజ్ వైరు, ఒక విద్యుత్ వైర్ బండిల్, ఏడు కిట్ బ్యాగులు, 28 ఏకె 47 రౌండ్లు, ఐదు పిస్టల్ రౌండ్లను స్వాధీనం చేసుకున్నారు.

● అక్కడ కష్టమని ఇటువైపు...

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో పోలీసు బలగాలు ఇటీవలకాలంలో ఆపరేషన్ కగార్ పేరుతో భారీగా కూంబింగ్ కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో చోటుచేసుకున్న పలు ఎన్‌కౌంటర్లలో పలువురు మావోయిస్టు అగ్ర నేతలు మరణించారు. ప్రస్తుతం ఉన్న ప్రతికూల పరిస్థితుల్లో సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని మావోయిస్టులు ప్రణాళిక రచించారు. ఇందులో హిడ్మాతో పాటు ఆయన దళం కూడా ఉంది. మారేడుమిల్లి అడవుల మీదుగా ఒడిసా వైపు వెళ్లాలని ప్రణాళిక రచించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో... మారేడుమిల్లి అడవుల్లో అడుగుపెట్టగానే హిడ్మా ఆచూకీని నిఘా వర్గాలు కనిపెట్టాయి.

గాలింపు ముమ్మరం..

ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకున్న వారి కోసం పోలీసులు గాలింపు మొదలుపెట్టారు. మావోయిస్టుల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో మృతి చెందినవారి బంధువులకు ఛత్తీస్‌గఢ్ పోలీసుల ద్వారా సమాచారం ఇచ్చామని, గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశామని ఇంటెలిజెన్స్ ఐజీ మహేశ్ చంద్ర లడ్డా తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో ప్రతికూలతలతో ఏపీకి!

కొందరు అడవుల్లోకి.. మరికొందరు నగరాల్లోకి చొరబాటు

మావోయిస్టులపై నెలన్నర నిఘా : లడ్డా


రంపచోడవరం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ కగార్'తో ఛత్తీస్‌గఢ్‌లో ఎదురవుతున్న ప్రతికూల పరిస్థితుల కారణంగా అక్కడి మావోయిస్టులు ఏపీ వైపు చూస్తున్నారని రాష్ట్ర పోలీసు నిఘా విభాగం అధిపతి, అదనపు డీజీపీ మహేశ్‌చంద్ర లడ్డా తెలిపారు. గత నెలన్నర రోజులుగా సాగిస్తున్న గాలింపుల్లో భాగంగా వారి కదలికలను పక్కాగా పసిగట్టామన్నారు. అల్లూరి జిల్లా మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందిన నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ఆయన రంపచోడవరంలో మీడియాతో మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో మనుగడ సాగించలేని పరిస్థితుల్లో అక్కడి మావోయిస్టులంతా ఆంధ్రాకు చేరుకున్నారని చెప్పారు. ఎన్‌కౌంటర్లో మృతి చెందిన హిడ్మా, ఆయన భార్య రాజే సహా మరో నలుగురు అడవుల్లోకి చేరారని తెలిపారు. ఈ సాయుధ దళాల కదలికలపై స్పష్టమైన సమాచారంతో తమ బలగాలు చుట్టుముట్టాయని, వారితో జరిగిన ఎదురుకాల్పుల్లో ఈ ఆరుగురు మృతి చెందగా, మరికొందరు పరారయ్యారని ఆయన వివరించారు. సాయుధ పోరాటం వైపు మళ్లిన గిరిజన యువతలో మంగళవారం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చినవారిలో 50 మందిని కృష్ణా, విజయవాడ, కాకినాడ తదితర జిల్లాల్లో అరెస్టు చేశామని, మరో 20మంది కోసం రాష్ట్రం నలుమూలలా బలగాలు గాలిస్తున్నాయని చెప్పారు.


ఘటనా స్థలంలో స్వాధీనం చేసుకున్న ఆయుధాలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

దళాలకు టీచర్.. భర్తకు వ్యూహకర్త

ఇదీ రాజే ప్రస్థానం.. హిడ్మాతో పాటే మృతి

చింతూరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత హిడ్మాతోపాటు ఆయన భార్య రాజే అలియాస్ రాజక్క కూడా మరణించారు. రాజే స్వస్థలం సుక్మా జిల్లా గొల్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరాపూర్ గ్రామం. మావోయిస్టు పార్టీ డివిజనల్ కమిటీ సభ్యురాలిగా(డీవీసీఎం) కొనసాగుతున్న రాజే దళాలకు రాజకీయ తరగతులు బోధించేవారు. భర్త హిడ్మా రచించే భీకర దాడులకు సహాయకురాలిగానూ వ్యవహరించారు. దీంతో రాజేకు పార్టీలో మంచి గుర్తింపు లభించింది. హిడ్మా, రాజేలు ఇద్దరిదీ సుక్మా జిల్లానే కావడం, ఇద్దరూ ఆదివాసీలే కావడంతో దండకారణ్యంలోని ఆదివాసీ యువతకు పార్టీ సిద్ధాంతాలను గోండు భాషలో వివరించి ఇట్టే ఆకర్షించేవారని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో దళంలో కొత్తగా చేరే సభ్యులకు రాజకీయ తరగతులు బోధించడంలో దిట్టగా ఆమెకు పేరు లభించింది. ఇక, గురితప్పని హిడ్మా విధ్వంసాల మిలిటెంట్ చర్యల్లో కూడా రాజే వెన్నంటే ఉండేవారని పోలీసులు వివరించారు.


మారేడుమిల్లి అడవుల్లో ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం మ్యాప్


రంపచోడవరం ఏరియా ఆసుపత్రి

మావోయిస్టుల మృతదేహాలకు నేడు పోస్టుమార్టం

రంపచోడవరం, నవంబరు18(ఆంధ్రజ్యోతి): మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్లో మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలకు బుధవారం పోస్టుమార్టం నిర్వహించనున్నారు. మృతుల గుర్తింపు అనంతరం మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఆ మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపర్చారు. మృతుల వివరాలను వారి కుటుంబీకులకు పోలీసులు తెలియపర్చారు. మృతుల కుటుంబీకులు బుధవారం నాటికి ఇక్కడకు చేరుకో వచ్చని భావిస్తున్నారు. వారి రాక అనంతరం నిబంధనల ప్రకారం పోస్టుమార్టం నిర్వహిస్తారు. ఆ తర్వాత మృతుల బంధువులకు మృతదేహాలను అప్పగిస్తారు. పోస్టుమార్టం నేపథ్యంలో రంపచోడవరం ఆసుపత్రి వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

నేడు పూవర్తిలో హిడ్మా అంత్యక్రియలు?

హిడ్మా దంపతులు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడంతో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని హిడ్మా సొంత గ్రామం సుకుమా జిల్లా పూవర్తిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుమారుడు చనిపోయినట్టు హిడ్మా తల్లికి పోలీసులు సమాచారం అందించారు. దీంతో 80 ఏళ్ల వయసున్న ఆమె ఓ చెట్టు కింద కూలబడి భోరున విలపించిందని స్థానికులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం హిడ్మా కుటుంబసభ్యులకు మృతదేహాలను అప్పగించనున్నారు. అన్నీ సవ్యంగా సాగితే బుధవారం పూవర్తిలో హిడ్మా దంపతుల అంత్యక్రియలు జరగనున్నాయి. మావోయిస్టులు ప్రతీకార దాడులకు పాల్పడే అవకాశం ఉందన్న అనుమానాలతో ఛత్తీస్‌గఢ్‌లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

కేంద్రం అమానవీయంగా వ్యవహరిస్తోంది

- పౌరసమాజ మౌనం.. ప్రమాదం: ప్రొఫెసర్ హరగోపాల్
- ఇది.. జంగిల్ రాజ్ పాలనకు పరాకాష్ఠ: కూనంనేని

హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలకు అంగీకరించకుండా, కార్పొరేట్ శక్తులకు ఖనిజ వనరులను అప్పగించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తోందని ప్రొఫెసర్ హరగోపాల్ ధ్వజమెత్తారు. విప్లవోద్యమ పోరాటాన్ని అణచివేస్తే.. వేరే రూపం దాల్చుతుందే తప్ప ఆగదన్న విషయాన్ని పాలకులు గ్రహించాలని హితవు పలికారు. ఆదివాసీల ఉద్యమాన్ని ఆయుధంతో అణచివేయడం, ఎన్‌కౌంటర్ల పేరుతో రక్తపాతం సృష్టించడం.. రాజ్యాంగ విలువలకు విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం తీరుపై పౌర సమాజం స్పందించాల్సినంతగా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అణచివేత చర్యలను పౌర సమాజం ఉపేక్షిస్తే.. ప్రజాస్వామ్యానికే ప్రమాదం వాటిల్లుతుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆదివాసీల గొంతు వినాలని, అడవి బిడ్డల హక్కులను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులను చంపుకుంటూ పోవడమంటే మానవ హననం తప్ప మరొకటి కాదని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అభిప్రాయపడ్డారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాలు జంగిల్ రాజ్ పాలనకు పరాకాష్ఠ అని మండిపడ్డారు. మారేడుమిల్లిలో జరిగింది ఫేక్ ఎన్‌కౌంటర్ అని విమర్శించారు.

'ఉనికి' కోసం వ్యూహం?

- అందుకే రాష్ట్రంలోని పలుప్రాంతాల్లో తిష్ఠ
- ముందుగానే పసిగట్టిన ఇంటెలిజెన్స్
- మూడు ప్రాంతాల్లో ఏకకాలంలో అరెస్టు
- అదుపులో హిడ్మా గన్‌మెన్, 'దేవ్‌జీ' గార్డులు
- డెన్, వ్యూహాలపై కూపీ లాగుతున్న పోలీసులు

ఏపీలో దాడులకు నక్సల్స్ ప్రణాళిక!?

ఎవరో ఒకరిని చంపేయాలన్నదే ప్లాన్?

అమరావతి/విజయవాడ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ఆశ్రయం పొంది ఎవరో ఒక ప్రముఖుడిని హత మార్చడం ద్వారా తమ ఉనికి చాటు కోవడమే లక్ష్యంగా మావోయిస్టుల బెటాలియన్ రాష్ట్రంలో తిష్ఠ వేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. 'ఆపరేషన్ కగార్' దెబ్బకు కకావికలమైన మావోయిస్టులు... 'ఏదో ఒకటి' చేసి తమ ఉనికి చాటుకోవడానికే ఏపీలోకి ప్రవేశించాయని భావిస్తున్నారు. రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా మావోయిస్టుల కదలికలు పెద్దగాలేవు. పోలీసులు కూడా ఆ విషయంలో కొంత ఉదాసీనంగానే ఉన్నారు. ఈ క్రమంలో తమ పునరుజ్జీవానికి ఈ రాష్ట్రమే సానుకూలంగా ఉంటుందని మావోయిస్టులు భావించినట్లు తెలుస్తోంది. అందుకే ఒక పూర్తి బెటాలియన్‌ను ఏపీలోకి పంపారు. ఏపీ ఎస్ఐబీ పోలీసులు అంతకన్నా అప్రమత్తంగా ఉండటంతో దాదాపు అందరూ దొరికిపోయారు. మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు మడివి హిడ్మా, దేవ్‌జీ దళాలు ఆంధ్ర-ఒడిశా సరిహద్దుల వైపు వస్తున్నట్లు ఏపీ ఇంటెలిజెన్స్ వర్గాలకు సమాచారం అందింది. దీంతో సరిహద్దు జిల్లాల పోలీసుల్ని అప్రమత్తం చేయడంతో కాకినాడ, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల పోలీసులు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన ప్రత్యేక పోలీసు బలగాలకు ఎదురు పడ్డ హిడ్మా దళం ఎదురు కాల్పుల్లో అంతమైంది. ఇదే సమయంలో మరో కేంద్ర కమిటీ సభ్యుడు, కీలక నేత దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి దళం విజయవాడలో పట్టుబడింది. ఇది జరిగిన కొద్ది సేపటికే ఏలూరు, కాకినాడలోనూ ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన మావోయిస్టుల ఆచూకీని సైతం పోలీసులు కనుగొన్నారు. దీంతో మావోయిస్టుల 'వ్యూహానికి' అడ్డుకట్టపడింది. మరోవైపు, మావోయిస్టులను అరెస్టు చేసిన నేపథ్యంలో ప్రముఖుల పర్యటనలపై ఆరా తీసిన డీజీపీ.. అన్ని జిల్లాల్లోనూ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇతర ముఖ్య నేతలకు భద్రత తగ్గకుండా చూసుకోవాలని జిల్లాల ఎస్పీలకు ఆదేశాలిచ్చినట్లు తెలిసింది.

అంతా 'గెరిల్లా' సభ్యులే

కృష్ణా జిల్లా పెనమలూరు మండలం కానూరులోని కొత్త ఆటోనగర్‌లో గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలకు చిక్కిన వాళ్లంతా గెరిల్లా కమిటీ సభ్యులేనని తెలిసింది. మావోయిస్టుల్లో అగ్రనేతల భద్రతను ఈ గెరిల్లా కమిటీలే చూస్తాయి. మావోయిస్టు అగ్ర నేత దేవ్‌జీకి రక్షణ దళంగా ఉన్న 9 మంది ఈ మావోయిస్టుల్లో ఉన్నారని కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. జిల్లా పరిధిలో మొత్తం 28 మందిని అదుపులోకి తీసుకోగా ఈ 9 మంది మినహా మిగిలిన వాళ్లంతా గెరిల్లా కమిటీ సభ్యులేనని తెలుస్తోంది.

ముందు ఏది జరిగింది?

ఎన్‌కౌంటర్‌లో మరణించిన హిడ్మా డైరీలో కానూరులోని మావోయిస్టుల షెల్టర్ పేరు రాసి ఉందా?. షెల్టర్‌ను చుట్టుముట్టిన తర్వాత హిడ్మా ఉన్న అరణ్యం జాడ తెలిసిందా?. అన్నది సందిగ్ధంగా మారింది. హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత అతని వద్ద లభించిన డైరీలో కొత్త ఆటోనగర్‌లో మావోయిస్టులు తలదాచుకున్న షెల్టర్ భవనం పేరు, చిరునామా రాసి ఉన్నట్టు కొందరు చెబుతున్నారు. ఆ సమాచారంతోనే గ్రేహౌండ్స్, ఆక్టోపస్ బలగాలు ఈ భవనాన్ని చుట్టిముట్టినట్టు తెలుస్తోంది. దీంతోపాటు మరో వాదనా వినిపిస్తోంది. సోమవారం అర్ధరాత్రి నుంచే మావోయిస్టులు ఉన్న షెల్టర్ భవనాన్ని బలగాలు అదుపులోకి తీసుకున్నట్టు కొందరు చెబుతున్నారు. వారి ద్వారానే మారేడుమిల్లి అడవుల్లో హిడ్మా ఉన్న ప్రదేశ సమాచారాన్ని రాబట్టినట్టు భావిస్తున్నారు. అక్కడ ఎన్‌కౌంటర్ పూర్తయిన తర్వాత హిడ్మాతో పాటు అతడి భార్య ఫొటోను అక్కడున్న బలగాలు ఇక్కడి బలగాలకు వాట్సాప్‌లో పంపినట్టు విశ్వసనీయంగా తెలిసింది. వారిద్దరూ హిడ్మా దంపతులని షెల్టర్‌లో ఉన్న మావోయిస్టులు నిర్ధారించినట్టు ప్రచారం జరుగుతోంది.


విజయవాడలోని న్యూ ఆటోనగర్‌లో మావోయిస్టులు ఉన్న భవంతిలో ఆక్టోపస్ బలగాలు

మావోయిస్టు కార్యదర్శి దేవ్‌జీ ఎక్కడ?

విజయవాడలో పట్టుబడ్డ ఆయన సిబ్బంది

- నేతను వదిలి బెజవాడకు వారెలా వచ్చారు?
- దేవ్‌జీని అదుపులోకి తీసుకున్నారా?.. పరారయ్యారా?

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో భారీ సంఖ్యలో మావోయిస్టులు పట్టుబడ్డారు. వీరిలో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి, తెలంగాణలోని జగిత్యాల జిల్లాకు చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ రక్షణ సిబ్బంది ఉన్నారు. ఈ నేపథ్యంలో దేవ్‌జీ జాడపై ఉత్కంఠ నెలకొంది. దేవ్‌జీ రక్షణ దళంలో తొమ్మిది మంది ఉంటారు. వీరికి జ్యోతి నాయకత్వం వహిస్తున్నారు. మంగళవారం విజయవాడలో ఆమెతోపాటు పదుల సంఖ్యలో మావోయిస్టులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో దేవ్‌జీ రక్షణ సిబ్బంది 9 మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో దేవ్‌జీ ఎక్కడున్నారన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వాస్తవానికి మావోయిస్టు నేత, ఆయన రక్షణ బృందం వేర్వేరుగా ఉండవు. దేవ్ జీ ఎక్కడుంటే ఆయనకు భద్రత కల్పించే బృందం కూడా అక్కడే ఉంటుంది. దీంతో దేవ్‌జీ భద్రత బృందం విడిగా ఇతర బృందం(హిడ్మా టీమ్)తో కలిసి పట్టుబడడం సందేహాలకు తావిస్తోంది. దేవ్‌జీ కూడా ఏపీ పోలీసుల అదుపులో ఉన్నారా?. లేక ఆయన తప్పించుకున్నారా?. అన్న ప్రశ్నలు తెరమీదికి వచ్చాయి. ఇదిలావుంటే, హిడ్మా పీఎల్‌జీఏలో బెటాలియన్-1కు నేతృత్వం వహిస్తున్నారు. ఆయన టీమ్‌లో సింహభాగం విజయవాడ పరిసరాల్లో పోలీసులకు పట్టుబడ్డారు. ఆయన మాత్రం మారేడుమిల్లి అటవీప్రాంతంలో ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఈ పరిణామం కూడా అనేక సందేహాలు, అనుమానాలకు తావిస్తోందని ప్రజాసంఘాల నేతలు చెబుతున్నారు. హిడ్మా బృందం మారేడుమిల్లి ఎందుకొచ్చింది?. విజయవాడలో ఎందుకు మకాం వేసిందనే సందేహాలు తలెత్తాయి. ఏపీలో 2017లో ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని రాంగూడ ఏరియాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. 31 మంది మావోయిస్టులు మరణించారు. దీని తర్వాత ఏపీలో మావోయిస్టుల అలికిడి లేదు. పార్టీకి గిరిజన ప్రాంతాల్లో సంబంధాలు కూడా లేకుండా పోయాయి. ఈ ప్రాంతానికి వస్తే భోజనం పెట్టే పరిస్థితి కూడా లేదు. ఇదిలావుంటే, గత ఏడాది మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతి చెందడంతో దేవ్‌జీ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నారు. కొంతకాలంగా హిడ్మా, దేవ్‌జీ కలిసే ఉంటున్నారన్న ప్రచారం సాగుతోంది. హిడ్మా మృతి చెందడంతో దేవ్‌జీ పోలీసులకు చిక్కే ఉంటారని ప్రజాసంఘాలు అనుమానిస్తున్నాయి. అయితే, దేవ్‌జీ ఆచూకీ తెలియడం లేదని పోలీసులు తెలిపారు. దేవ్‌జీ ఇక్కడికి రాలేదా?.. పారిపోయారా?.. అనే విషయాలను వెల్లడించడంలేదు. దీంతో ఆయన జాడ చర్చనీయాంశమైంది.

మావోయిస్టులూ.. అర్బన్ నక్సల్స్ మాటలు నమ్మొద్దు

- బండి సంజయ్

సిరిసిల్ల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): 'మీ చావుకు అర్బన్ నక్సల్సే కారకులు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా పైరవీలు చేసుకుంటూ ఆస్తులు కూడగట్టుకుని కార్లలో తిరుగుతున్న అర్బన్ నక్సల్స్ మాయలో పడి ప్రాణాలు కోల్పోవద్దు' అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మావోయిస్టులకు సూచించారు. తెలంగాణలోని సిరిసిల్లలో మంగళవారం ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తుపాకీతో సాధించేదేమిటని, తుపాకీ పట్టుకుంటే క్షమించే ప్రసక్తే లేదని అన్నారు. తుపాకులు వదిలి జన జీవన స్రవంతిలో కలవాలి అని పిలుపునిచ్చారు.

రూ.58,700 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

నీరివ్వడమే గాక.. వెలిగొండ, గుండ్లకమ్మ, ఇతర చిన్న ప్రాజెక్టుల పరిధిలోని 6 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలని.. 60 లక్షల మందికి తాగునీటి సరఫరా చేయాలనేవి కొత్త పథకం లక్ష్యాలు. నేడో రేపో ప్రాజెక్టు సమగ్ర నివేదిక(డీపీఆర్)ను రూపొందించేందుకు ఆసక్తి కలిగిన సంస్థలను ఎంపిక చేసేందుకు టెండర్లు పిలువనున్నారు. ఎల్-1గా వచ్చే సంస్థ వచ్చే ఏడాది జనవరి 1నాటికి డీపీఆర్‌ను సిద్ధం చేయాల్సి ఉంటుంది. దానిని జలవనరుల శాఖ పరిశీలించి జనవరి 31లోగా కేంద్ర జల సంఘం ఆమోదానికి పంపుతుంది. మార్చి 31వ తేదీ నాటికి జల సంఘం నుంచి అది సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ)కి చేరి ఆమోదం పొందాక.. ఏప్రిల్ 30లోగా కేంద్ర జలశక్తి శాఖ, కేంద్ర పర్యావరణం-అటవీ మంత్రిత్వ శాఖల అనుమతులు పొందే దిశగా చర్యలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 24వ తేదీన సీఎం చంద్రబాబు నిర్వహించే సమీక్షలో తుది మెరుగులు దిద్దనున్నారు.

ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'

బనకచర్ల పథకంపై ఇతర రాష్ట్రాల అభ్యంతరాల నేపథ్యంలో ఈ ప్రాజెక్టును పోలవరం నుంచి నల్లమలసాగర్ వరకే పరిమితం చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించిన విషయాన్ని మొదట 'ఆంధ్రజ్యోతి' తెలియజేసింది. 'బనకచర్లలో భారీ మార్పులు' శీర్షికన ఈ నెల 8న ప్రచురించింది. 'ఆంధ్రజ్యోతి' పేర్కొన్నట్లుగానే మూడు దశల్లో రూ.58,700 కోట్లతో పోలవరం-నల్లమలసాగర్ పథకాన్ని చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మొదటి విడతలో తాతపూడి వరద కాలువ నుంచి పోలవరం కుడి ప్రధాన కాలువ గుండా ఇబ్రహీంపట్నం వరకు వరద నీటిని తరలిస్తారు. రెండో దశలో.. ఇబ్రహీంపట్నం వద్ద నిర్మించే అక్విడెక్టు ద్వారా నాగార్జునసాగర్ కుడికాలువలోకి ఎత్తిపోసి.. బొల్లాపల్లి రిజర్వాయర్‌కు తీసుకెళ్తారు. తుది దశలో బొల్లాపల్లి నుంచి నల్లమలసాగర్‌కు తరలిస్తారు.

'యూడైస్'తో పదో తరగతి విద్యార్థుల డేటా అనుసంధానం

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థుల డేటాను యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్(యూడైస్)తో అనుసంధానం చేసే ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ ప్రారంభించింది. దేశవ్యాప్తంగా విద్యార్థుల సమచారాన్ని ఒకే నమూనాలో సేకరించేందుకు కేంద్ర విద్యా శాఖ గత కొన్నేళ్లుగా యూడైస్‌ను వినియోగిస్తోంది. ఇప్పటి వరకు అన్ని తరగతుల విద్యార్థుల సమాచారాన్ని అన్ని రాష్ట్రాలు దీనిలో అప్‌లోడ్ చేస్తున్నాయి. కొత్తగా పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల వివరాలను కూడా యూడై స్‌లో నమోదు చేయాలని కేంద్రం సూచించింది. తదనుగుణంగా దేశంలో తొలిగా రాష్ట్రప్రభుత్వం ఈ ప్రక్రియను చేపట్టింది. దీని వల్ల టెన్త్ పూర్తిచేసిన వారి వివరాలు ఆ పైచదువుల కోసం విద్యా సంస్థలకు తెలుస్తాయి. అలాగే, టెన్త్ పరీక్ష ఫీజును విద్యార్థుల తల్లిదండ్రులు నేరుగా వెబ్‌సైట్‌లో చెల్లించవచ్చు. కాగా, 2, 3 రోజుల్లో టెన్త్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రభుత్వం ప్రకటించనుంది.

అన్నదాతకు డబుల్ ధమాకా!

(మొదటి పేజీ తరువాయి)

రూ.2,342.92కోట్లు, కేంద్రం వాటా రూ.972.09 కోట్లు ఉంటుంది. బుధవారం కోయంబత్తూరులో పీఎం కిసాన్ నిధుల్ని ప్రధాని మోదీ విడుదల చేయనున్న నేపథ్యంలో అదే సమయంలో అన్నదాత సుఖీభవ సొమ్మును వైఎస్సార్ కడప జిల్లా కమలాపురంలో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబు విడుదల చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా 10వేలపైగా రైతు సేవా కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు.

ఇచ్చిన మాట ప్రకారం..

గతేడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో 'సూపర్ సిక్స్'లో భాగంగా ఏటా రైతులకు రూ.20వేల ప్రత్యేక ఆర్థిక సహాయం అందిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. కేంద్రం పీఎం కిసాన్ డబ్బులు ఎప్పుడిస్తే.. అప్పుడే అన్నదాత సుఖీభవ నిధులు చెల్లిస్తామని ప్రకటించారు. ఆ మేరకు గత ఆగస్టు 2న ప్రధాని మోదీ పీఎం కిసాన్ నిధులు విడుదల చేయగా, అదే రోజు ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గంలో సీఎం ఈ పథకాన్ని ప్రారంభించారు. తొలి విడత కింద 46.86లక్షల మంది రైతులకు రూ.3,174.43కోట్లు విడుదల చేశారు. అయితే అప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగిన మండలాల్లో మినహా మిగతా రాష్ట్రమంతా ఒకేసారి రైతులకు సొమ్ము చెల్లించారు. ఆరోజు సాయంత్రానికి కల్లా 99.98% మంది రైతుల ఖాతాలకు నగదు జమ చేశారు. స్థానిక ఎన్నికల ప్రక్రియ ముగిశాక.. ఆయా ప్రాంతాల రైతులతో పాటు గ్రీవెన్స్‌లో అర్హులని తేలిన వారితో కలిపి, 1,04,107 మంది రైతులకు ఆగస్టు 20న అన్నదాత సుఖీభవ డబ్బులు జమ అయ్యాయి. అన్నదాతకు డబుల్ సంక్షేమం.. రెట్టింపు సంతోషం.. అంటూ గత ప్రభుత్వం ఇచ్చిన రూ.13,500 కన్నా రూ.6,500 అదనంగా కలిపి, అర్హులైన రైతులకు కూటమి ప్రభుత్వం లబ్ధి చేకూర్చుతోంది.

ఇది రెండో విడత సొమ్ము

ఈ పథకంలో తొలి విడత రూ.7వేలు, రెండో విడత రూ.7వేలు, మూడో విడత రూ.6వేలు ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే! ఇందులో భాగంగా రెండో విడుదల సుఖీభవ నిధులు ఇప్పుడు జమ కానున్నాయి. రెండు విడతల్లో కలిపి ఈ పథకం కింద మొత్తం రూ6,309.44కోట్లు ప్రభుత్వం అందించినట్లవుతోంది.

రైతులు చనిపోయి ఉంటే వారి వారసులకు..

ఈ పథకానికి అర్హులైన రైతులు ఎవరైనా చనిపోయి ఉంటే.. వారి వారసులకు డెత్ మ్యుటేషన్ చేసి, లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే విధానాన్ని సులభతరం చేయాలని సూచించారు. దీనిపై సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నంబరు అందుబాటులో ఉంచాలని, సొమ్ము అందుకునే రైతుల సెల్‌ఫోన్లకు ఒక రోజు ముందే మెస్సేజ్‌లు వెళ్లాలని నిర్దేశించారు. అలాగే, తొలి విడత అన్నదాత సుఖీభవ సొమ్ము జమ కాని రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, అర్హులకు పథకం సొమ్ము జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వెబ్‌ల్యాండ్‌లో నమోదు కాక, అర్హత ఉండి.. లబ్ధి చేకూరని రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకుని, వాటిని పరిశీలించి, పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు.

నేడు కడప జిల్లాకు సీఎం చంద్రబాబు

పెండ్లిమర్రిలో అన్నదాత సుఖీభవ.. రైతులతో ముఖాముఖి

కడప, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం కడప జిల్లాలో పర్యటించనున్నారు. కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రిలో 'పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ' కార్యక్రమంలో పాల్గొంటారు. షెడ్యూల్ ప్రకారం.. ఉదయం సత్యసాయి జిల్లా పర్యటన అనంతరం సీఎం చంద్రబాబు ప్రత్యేక విమానంలో కడప విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టరులో 1.15 గంటలకు పెండ్లిమర్రి జడ్పీ హైస్కూలుకు చేరుకుంటారు. 1.25 వరకు ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు. అనంతరం పెండ్లిమర్రిలోని వెల్లటూరులోగల మన గ్రోమోర్ సెంటరు ఎరువుల దుకాణాన్ని పరిశీలించి, రైతులతో ముఖాముఖి మాట్లాడతారు. 1.45కు రోడ్డు మార్గాన పెండ్లిమర్రిలోని ప్రజావేదిక చేరుకుంటారు. పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రధాని మోదీ ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా రైతులతో కలిసి తిలకిస్తారు. 4.15కు బయల్దేరి చిన్నదాసరిపల్లెకు చేరుకుని వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించి రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. 5.15 నుంచి 6.15 వరకు వెల్లటూరులో టీడీపీ కార్యకర్తలతో భేటీ అవుతారు.

ధాన్యం కొనుగోళ్లు ముమ్మరం

2,36,284 టన్నుల సేకరణ.. 24 గంటల్లోనే రూ.560 కోట్లు

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఇప్పటివరకు 32,793 మంది రైతుల నుంచి 2,36,284 టన్నుల ధాన్యాన్ని, సేకరించి.. 24 గంటల్లోపే రూ.560 కోట్లకు పైగా సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. పౌరసరఫరాల సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఢిల్లీరావుతో కలిసి మంగళవారం విజయవాడలో మంత్రి విలేకరులతో మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రజా పంపిణీ అవసరాల కోసం 51 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. క్షేత్రస్థాయిలో కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేందుకు 16 వేల మంది సిబ్బంది పని చేస్తున్నారని, ఆయా జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని కొన్ని ప్రాంతాల్లోని రైస్ మిల్లులకు మాత్రమే తరలించి తమకు కావలసినవారికి లబ్ధి చేకూర్చిన ఉదంతాలు చూశామని గుర్తుచేశారు. ఇప్పుడు రైతులు వాట్సాప్ ద్వారా తమకు ఇష్టమొచ్చిన రైసుమిల్లులో అమ్ముకునే అవకాశం కల్పించామన్నారు.

అక్రమాస్తుల కేసులో రేపు కోర్టుకు జగన్

అమరావతి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 20న(గురువారం) హైదరాబాద్‌లోని సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు హాజరు కానున్నారు. సుదీర్ఘ కాలంగా బెయిల్‌పైనే ఉన్న ఆయన ఇటీవల కోర్టు ఆదేశాలతో న్యాయస్థానం మెట్లు ఎక్కనున్నారు. ముఖ్యమంత్రి హోదాలో 2020, జనవరి 10న విచారణకు హాజరయ్యారు. ఆ తర్వాత 'అధికార హోదా'ను అడ్డుపెట్టుకుని ఇప్పటి వరకు కోర్టుకు వెళ్లకుండా తప్పించుకున్నారు. ముఖ్యమంత్రిగా తనకు భద్రత అవసరమని.. పాలనా బాధ్యతల నేపథ్యంలో తాను కోర్టుకు హాజరు కాలేనంటూ అపట్లో పిటిషన్ దాఖలు చేసి సీబీఐ ప్రత్యేక కోర్టు నుంచి అనుమతి పొందారు. 2024, సార్వత్రిక ఎన్నికల తర్వాత కూడా సీబీఐ ప్రత్యేక కోర్టు ముందు హాజరుకాకుండా వాయిదాలు వేయించుకునే ప్రయత్నాలు చేశారు. అయితే.. జగన్ లండన్ వెళ్లిన సమయంలో ఫోన్ నంబరు తప్పుగా ఇవ్వడంతో.. జగన్ కోర్టుకు హాజరు కావాల్సిందేనంటూ అక్రమాస్తుల కేసును విచారిస్తున్న సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. గతంలో సీఎం హోదాలో ఉన్నానని.. తనకు భద్రత అవసరమంటూ జగన్ సాకులు చెబుతూ వచ్చారు. ప్రస్తుతం ప్రతిపక్షనేత హోదా లేదు. వైసీపీ అధ్యక్షుడిగా ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఆందోళనలు చేపడుతున్నారు. ఈ క్రమంలో న్యాయస్థానం ముందు హాజరు నుంచి తప్పించుకునేందుకు ఎలాంటి సాకులూ చూపలేని పరిస్థితి ఎదురైంది. కోర్టు కూడా ఈ నెల 21లోగా విచారణకు హాజరు కావాలని ఆదేశించింది.

మాజీ ఏవీఎస్‌వో సతీశ్ మృతిపై హైకోర్టు దిగ్భ్రాంతి

- దర్యాప్తు పూర్తయ్యేదాకా నిందితుడు రవికుమార్‌కు, సాక్షులకు రక్షణ కల్పించండి.. పోలీసులకు న్యాయమూర్తి ఆదేశం

అమరావతి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పరకామణి చోరీ కేసులో.. ఘటన ఫిర్యాదుదారు, టీటీడీ అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ (ఏవీఎస్‌వో) వై.సతీశ్‌కుమార్ అసహజ మరణ వార్త విని దిగ్భ్రాంతి చెందామని హైకోర్టు పేర్కొంది. కేసు దర్యాప్తు ముగిసేవరకు నిందితుడు సీవీ రవికుమార్, ఇతర సాక్షులకు పోలీసు భద్రత కల్పించాలని సీఐడీని ఆదేశించింది. తన పర్యవేక్షణలో దిగువ స్థాయి సీఐడీ అధికారులు కూడా కేసును దర్యాప్తు చేసేందుకు అనుమతించాలన్న సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యన్నార్ చేసిన అభ్యర్థనపై న్యాయస్థానం సానుకూలంగా స్పందించింది. రవికుమార్ ఆస్తుల విషయంలోనూ ఏసీబీ డీజీ పర్యవేక్షణలో కిందిస్థాయి సిబ్బంది విచారణ జరిపేందుకు అంగీకరించింది. ఈ విషయంలో సీఐడీ డీజీ వేసిన అనుబంధ పిటిషన్‌ను అనుమతించింది. తదుపరి విచారణను డిసెంబరు 2కు వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు.

పరకామణి చోరీపై కొత్తగా క్రిమినల్ కేసు!

- టీటీడీ బోర్డు నిర్ణయం.. లోక్‌అదాలత్‌లో రాజీ రద్దుపై పరిశీలన

తిరుమల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుమల పరకామణిలో చోరీపై కొత్తగా క్రిమినల్ కేసు పెట్టాలని టీటీడీ భావిస్తోంది. మంగళవారం తిరుమలలో జరిగిన బోర్డు సమావేశంలో ఈ అంశంపై లోతైన చర్చ జరిగినట్లు తెలిసింది. పాత ఫిర్యాదు విచారణకు వస్తే అసలు కుట్రలోని చాలా అంశాలు బయటపడకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తం కావడంతో.. ఈ మొత్తం కుట్రను బయటపెట్టేందుకు మరో క్రిమినల్ కంప్లయింట్ ఇవ్వాలని నిర్ణయించారు. లోక్ అదాలత్‌లో జరిగిన రాజీని రద్దు చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని నిశ్చయించారు. పరకామణిలో 900 యూఎస్ డాలర్లను దొంగించిన వ్యక్తి.. రాజీ కోసం టీటీడీకి ఏకంగా రూ.14.50 కోట్ల విలువైన ఆస్తులను ఎలా ఇచ్చారని బోర్డు విస్మయం వ్యక్తం చేసింది. అసలు లోక్ అదాలత్‌లో ఎవరి ప్రమేయంతో ఈ రాజీ జరిగింది.. ఇందులో ఉన్న వ్యక్తులు ఎవరు.. రాజీకి దారి తీసిన కారణాలేమిటో మరోసారి లోతైన దర్యాప్తు జరిపించాలని నిర్ణయం తీసుకుంది. మాజీ ఏవీఎస్‌వో సతీశ్‌కుమార్ మరణంపైనా చర్చ జరిగినట్లు తెలిసింది. దీని వెనుక కుట్ర బయటపడాలంటే టీటీడీ కూడా క్రిమినల్ ఫిర్యాదు చేయడమే మార్గమని బోర్డు సభ్యులు అభిప్రాయపడ్డారు గతంలో జరిగిన దొంగతనాలు, నిధుల దుర్వినియోగం, కుట్రలను వెలికితీయాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. అధికారులు, బోర్డు సభ్యులు ఎవరైనా అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉంటే దర్యాప్తు చేయించాలని బోర్డు తీర్మానించింది.

రవికుమార్ ఆర్థిక లావాదేవీలపై ఏసీబీ ఆరా

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పరకామణి చోరీ కేసులో నిందితుడు రవికుమార్ ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు బృందం దృష్టిపెట్టింది. ఆయనతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, నమ్మకస్తుల బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆయన జీతం, ఇతర సంపాదన, ఆస్తులు, ఆదాయానికి మించి ఆస్తులు ఏమైనా ఉన్నాయా? అన్న కోణంలో ఏసీబీ బృందం ఆరా తీస్తున్నట్లు తెలిసింది. పరకామణి కేసు రాజీ నేపథ్యంలో టీటీడీకి రాసిచ్చిన ఆస్తులకు స్టాంప్ డ్యూటీ ఎవరు కట్టారు? రవికుమార్ ఆస్తులు ఎవరికైనా విక్రయించారా? ఆర్థిక లావాదేవీలేమైనా జరిగాయా? అన్న అంశాలు పరిశీలిస్తున్నారు. అదే విధంగా రవికుమార్ సన్నిహితుడు చంద్రగిరికి చెందిన జయచంద్రారెడ్డి పాత్రపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అతడిని కూడా విచారించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక, రవికుమార్‌తోపాటు కుటుంబ సభ్యులు, సాక్షులకు భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో వీరు ఎంతమంది ఉన్నారని కూడా జిల్లా పోలీస్ శాఖ ఆరా తీస్తోంది.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.*